

# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



హ్యాపీ సంక్రాంతి

సంక్రాంతి పండుగ సందర్భంగా మన పత్రిక కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

- ఎడిటర్

ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 145 గురువారం 15 జనవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 22 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్


## పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు

# శుభవార్త

### ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల నగదు జమ

### ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

**అమరావతి :** సంక్రాంతి పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం బుధవారం చెల్లించింది. దీంతో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల ఖాతాల్లో భారీగా నగదు జమవుతోంది. దాంతో ఆయా ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సంక్రాంతి పండగవేళ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవులతోపాటు కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న బిల్లులు

మిగతా 2 లో



రాష్ట్ర ప్రజలకు చంద్ర బాబు సంక్రాంతి శుభాకాంక్షలు

పండగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్ష

## భోగి వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

**సంప్రదాయ ముగ్గుల పోటీలు.. ఎడ్ల బండ్లపై ఊరేగింపు**

**స్థానిక చిన్నారులకు ఆటల పోటీలు.. పాల్గొన్న దేవాన్ష్**

**గంగిరెద్దుల విన్యాసాలతో సందడిగా నారావారి పల్లె**

సంస్కృతి, సంప్రదాయలు చాటి చెప్పేలా నారావారిపల్లిలో భోగి పండగ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ భోగి వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబసమేతంగా పాల్గొంటున్నారు. వరుసగా రెండోరోజు తన స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు కుటుంబం పాల్గొంది.



## పల్లెల్లో అంతటా సంక్రాంతి శోభ

**కూటమి రాకతో పల్లెల్లో ప్రశాంత జీవనం**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**అమరావతి :** తెలుగు రాష్ట్రాల్లోని పల్లెలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ పండుగ అనగానే మన మదిలో మెదిలేది భోగిమంటలు, గంగిరెద్దులు,

మిగతా 2 లో

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

### 29మంది మావోల లొంగుబాటు

**రాయపూర్ :** మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎమ్ఎస్) నేత పొడియం బుద్రాతో పాటు డీఏకేఎమ్ఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో పాటు ఇతర మావోయిస్టులు

మిగతా 2 లో






మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# భోగి వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

**సంప్రదాయ ముగ్గుల పోటీలు..**
**ఎడ్ల బండ్లపై ఊరేగింపు**
**స్థానిక చిన్నారులకు ఆటల పోటీలు.. పాల్గొన్న దేవాన్ష్**
**గంగిరెద్దుల విన్యాసాలతో సందడిగా నారావారి పల్లె**





**కుప్పం :** సంస్కృతి, సంప్రదాయలు చాటి చెప్పేలా నారావారిపల్లిలో భోగి పండగ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ భోగి వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబసమేతంగా పాల్గొంటున్నారు. వరుసగా రెండోరోజు తన స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలు భార్య భువనేశ్వరితో సహా కుటుంబసభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. ఇక బుధవారం భోగి పండగ వేళ.. సీఎం చంద్రబాబు మనవడు దేవాన్ష్, నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్వినీ, శ్రీభరత్ దంపతుల పిల్లలు ఎద్దుల బండిలో ఊరేగారు. ఈ సందర్భంగా ఎద్దుల బండిని బెలూన్లతో అందంగా అలంకరించారు. ఈ ఎద్దుల బండిపై వారు వారంతా అటుఇటు తిరిగారు. దేవాన్ష్‌తోపాటు శ్రీభరత్ దంపతుల చిన్నారులు సైతం ఈ సందర్భంగా గ్రామంలోని పిల్లలందరికీ చేతులు ఊపుతూ ఎద్దుల బండిలో తిరిగారు. అనంతరం ఈ ఎడ్ల బండి దిగి.. స్థానికంగా ఉన్న చిన్నపిల్లకు వీరు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పిల్లల్లో ఆనందం వెల్లువిరిసింది. తన స్వగ్రామం నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు మంత్రి నారా లోకేశ్ స్వగ్రామానికి చేరుకున్న సంగతి తెలిసిందే. నాలుగు రోజులపాటు వీరు స్వగ్రామంలోనే ఉండి.. సంక్రాంతి సంబరాలు జరుపుకోనున్నారు. మంగళవారం ఉదయం స్వగ్రామంలో ఏర్పాటు చేసిన.. ముగ్గుల పోటీలను సీఎం సతీమణి నారా భువనేశ్వరితోపాటు నారా బ్రాహ్మణి పరిశీలించారు. లాగే చిన్నారులకు ఆటల పోటీలు.. మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, కాక్గ ÷ట్, త్రీలెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భారీగా బాలురు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే గ్రామస్తుల నుంచి అర్జీలను సీఎంతోపాటు ఆయన తనయుడు, మంత్రి నారా లోకేశ్ స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా వారికి తండ్రి తనయులు భరోసా ఇచ్చారు. ఇక మంగళ వారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్ర మాలకు సైతం సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నాలుగు రోజులపాటు ఈ సంబరాల్లో పాల్గొని సీఎం చంద్రబాబు తిరిగి అమరావతికి చేరుకోనున్నారు.

## రాష్ట్ర ప్రజలకు చంద్ర బాబు సంక్రాంతి శుభాకాంక్షలు

**పండగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్ష**

**అమరావతి :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. కాగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి తన స్వగ్రామం నారావారిపల్లిలో ఉన్నారు. కుటుంబసమేతంగా గ్రామానికి చేరుకుని సందడి చేస్తున్నారు. నారా ఫ్యామిలీతోపాటు నందమూరి కుటుంబం సైతం చంద్రబాబు స్వగ్రామం వెళ్లి ఆనందంగా గడుపుతున్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు సీఎం చంద్రబాబు. 'సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర పర్వదినం మకర సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. విశిష్టమైన ఈ సంక్రాంతి పండుగ మీ జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పాడిపంటలతో పల్లె సీమలు మరింత కళకళలాడాలని, ఆధునికతను సంతరించుకున్నప్పటికీ, మన సంప్రదాయాలను మరచిపోకుండా పాటించాలని కోరుకుంటున్నాను. ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా రైతన్నలు ఆనందంగా ఉండాలని, కష్టజీవులు శ్రమకు తగిన ఫలితం పొందాలని, అందుకు అనువైన పథకాలతో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరిస్తుందని హామీ ఇస్తున్నాను. సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ మరొక్కమారు అందరికీ శుభాకాంక్షలు' అని సీఎం చంద్రబాబు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ద్వారా సందేశమిచ్చారు.

# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి



- భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు
- భోగి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- ఏపీలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భారీగా తరలివచ్చిన వీక్షకులు
- ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర నేతల రాకతో హడావిడి

**విజయవాడ, జనవరి 14:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు.కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

### భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు

తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా గడిపారు . సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అని అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. అలాగే భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మల కొలువును కూడా జరుపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా భోగి సంబరాల్లో పాలుపంచుకున్నారు. విజయవాడలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ భోగి పండుగ రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి

జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భోగి పండుగ రోజు ఈ నగదు బకాయిలు చెల్లించింది. నగదు ఖాతాల్లో జమ కావడంతో వారంతా ఆనందంలో ఉన్నారు. డీఏ, డీఆర్ఏ ఎరియర్స్ నిమిత్తం ఒక్కో ఉద్యోగి, పోలీసుల ఖాతాల్లో రూ.70 నుంచి రూ.80 వేల వరకు నగదు జమ అవుతుంది. పండగ పూట డీఏ, డీఆర్ఏ బకాయిలు జమ కావడంతో ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఆనందంలో మునిగిపోయాయి. సుమారు 5.70 లక్షల మంది ఖాతాల్లో ఈ నిధులను ఆర్థిక శాఖ జమ చేస్తోంది. ప్రభుత్వానికి, సీఎంకు ఉద్యోగ సంఘాలు సైతం కృతజ్ఞతలు తెలియజేశాయి. ఈ నిధుల జమపై ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు స్పందించారు. పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులు, డీఏ ఎరియర్లను ప్రభుత్వం విడుదల చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి సంక్రాంతి పండుగను తామందరం చాలా సంతోషంగా జరుపుకుంటామని చెప్పారు. గతంలో సీఎం చంద్రబాబును కలిసి సరెండర్ లీవులకు సంబంధించిన నగదు విడుదల చేయాలని కోరగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పోలీసులు అందరి తరఫున కృతజ్ఞతలతోపాటు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు. అలాగే ఈ నిధులు విడుదలకు సహకరించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోమ్ మంత్రి అనితతోపాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి ఈ సందర్భంగా శ్రీనివాసరావు కృతజ్ఞతలు చెప్పారు.

# పల్లెల్లో అంతటా సంక్రాంతి శోభ

మొదటి పేజీ తరువాయి



రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ పందేలు, కొత్తదుస్తులు, పిండి వంటలేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఏపీ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్న సంగతిని వేరే ప్రస్తావించవలసిన అవసరం లేనేలేదన్నారు. శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతితో ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని కోరుకుంటున్నాను. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యాన్ని ప్రసాదించే ఈ పండుగ తెలుగువారందరికీ సర్వైశ్వర్యం ప్రసాదించాలని దేవుడిని కోరుకుంటున్నానని పవన్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి సౌభాగ్యాన్ని అందించాలని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పవన్ ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్నారు. శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతి పండుగ నాడు ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని పవన్ కోరారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

పోలీసులు ముందు లొంగిపోయారు. తమ ఆయుధాలను సరెండర్ చేశారు. పొడియం బుధ్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది మావోయిస్టులు ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని చెప్పారు. నక్సలిజంను వీడి సామాన్య జనజీవనాన్ని అవలంబించాలని ఈ సందర్భంగా ఇతర మావోలకు ఆయన పిలుపునిచ్చారు. కొంతకాలంగా మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతుండటంతో గోగుండ ప్రాంతంలో (దర్భా డివిజన్) ఉద్యమ ప్రాబల్యం మరింతగా తగ్గినట్లైంది. గోగుండలో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకూ తగ్గిపోయాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మావోయిస్టు మద్దతుదారుల నెట్‌వర్క్ బలహీనపడిందని, ఫలితంగా సరెండర్లు పెరిగాయని చెబుతున్నారు. జనవరి 8న దంతేవాడలో 63 మంది సరెండర్ కాగా అంతకుముందు రోజున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500 మంది లొంగిపోయారు. ఈ ఏడాది మార్చ్ 31 నాటికి నక్సలిజంను రూపుమాపాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.


# శబరిగిరులపై మకరజ్యోతి దర్శనం

**తిరువనంతపురం :** శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్శన కోటాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ.. తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే.. బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక జనవరి 12వ తేదీన పందళం రాజప్రసాదం నుంచి బయలుదేరిన స్వామివారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది. అంటే సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల వరకు అంటే పావుగంట మధ్య మూడుసార్లు స్వామివారు దీప రూపంలో దర్శనమిచ్చారు. జనవరి 19వ తేదీ వరకు స్వామివారి దర్శనం కొనసాగనుంది. ఆ మరునాడు అంటే జనవరి 20వ తేదీ ఆలయాన్ని మూసివేయనున్నారు.

# కర్నాకటలో చైనా మంజా పంజా

## బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా

## తీవ్ర రక్త స్రావతంతో అక్కడిక్కడే మృతి



**బెంగళూరు :** చైనా మాంజా యమ పాశంగా మారి దేశవ్యాప్తంగా అనేక మందిని బలి తీసుకుంటోంది. తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు. బీదర్ జిల్లా తలమడగి వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితుడిని సంజు కుమార్ హాళసమణిగా గుర్తించారు. హాళసమణి బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మెడకు మాంజా చుట్టుకోవడంతో కోసుకుపోయి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైంది. ఆయన తన కూతురికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నంలో ఉండగానే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కల వారు గాయాలకు కర్చీఫ్‌లను అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశారు. మరికొందరు అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలోనే కన్నుమూశారు. హాళసమణి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి

ఉంటే ఆయన ప్రాణాలతోనే ఉండి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జాప్యమే ఆయన ప్రాణాలను తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో మృతుడి బంధువులు, స్థానికులు ధర్నాకు దిగారు. ఎమ్జర్గ÷న్సీ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాంజాపై నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇక ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గాలిపటాలను ఎగురవేయడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, గాలిపటాల కోసం సాధారణ మాంజాలకు బదులుగా కొందరు చైనా మాంజాలను వినియోగించడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల నుంచి వేళ్లాడే మాంజాలు వాహనదారులకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్స్‌పై ప్రయాణించే వారికి ఇవి యమ పాశాలుగా మారుతున్నాయి.

# చనిపోయిందనుకున్న బామ్మ లేచింది

## బర్త్‌డే వేడుకగా మారిన అంత్యక్రియల ఘట్టం..

**నాగపూర్ :** ఒక్కోసారి అనూహ్య ఘటనలె, అద్భుతాలు జరుగుతుంటాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇలాంటి అనూహ్య ఘటన చోటుచేసుకుంది. చనిపోయిందనుకున్న బామ్మ బతికింది. అందరిలోనూ ఆశ్చర్యంతో పాటు, ఆనందం కూడా కలిగింది. అదేరోజు బామ్మ బర్త్‌డే కావడంతో చావుకు వచ్చిన వారంతా కేక్ కట్ చేసి బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే...నగరానికి చెందిన 103 ఏళ్ల వృద్ధురాలు గంగాబాయి సఖారే కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం ఆమె మరణించినట్టు కుటుంబసభ్యులు నిర్ధారించుకున్నారు. చివరి చూపు కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా..వృద్ధురాలి కాలి వేలు కదలడాన్ని ఆమె మనవడు రాకేష్ సఖారే గమనించాడు. వెంటనే అక్కడి వారికి విషయం చెప్పడంతో ఆమె ముక్కులో ఉన్న దూదిని తొలగించగా వృద్ధురాలు శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. దీంతో చనిపోయిందనుకున్న గంగాబాయి బతికే ఉన్నందుకు కుటుంబసభ్యులు సంతోషపడ్డారు. వైద్యులు కూడా ఆమెను పరీక్షించి..ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా అదే రోజు గంగాబాయి 103వ పుట్టిన రోజు కూడా కావడంతో వేడుకలను కుటుంబసభ్యులు ఘనంగా జరిపారు. అంతసేపు బాధలో ఉన్న బంధువులంతా బర్త్‌డే కేక్ తిని ఆనందంగా తమ ఇళ్లకు వెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది.

# బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదు

## తమిళగ వెట్రి కళగం పార్టీ స్పష్టీకరణ

**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదని సినీ నటుడు విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం తెలిపింది. పొత్తుల విషయంలో తమ పార్టీ గతంలో తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉందని టీవీకే డిప్యూటీ సెక్రటరీ నిర్మల్ కుమార్ తెలిపారు. పొంగల్ రేసులో విడుదలకు సిద్ధమైన విజయ్ 'జన నాయగన్' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకుండా కేంద్రం అడ్డుపడుతోందనే విమర్శలు రావడం, కరూర్ తొక్కిసలాట ఘటనపై మరోసారి విచారణకు ఈనెల 19న హాజరుకావాలని విజయ్‌కు సీబీఐ సమన్లు పంపిన నేపథ్యంలో టీవీకే తాజా ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈనెల 12న విజయ్‌ను సీబీఐ ఆరు గంటల సేపు విచారణ చేసింది . మరుసటి రోజు కూడా విచారణకు రావాలని కోరినప్పటికీ పొంగల్ కారణంగా ఆయన గడువు కోరారు. విచారణ అనంతరం విజయ్ తిరిగి చెన్నైకు చేరుకున్నప్పుడు నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, టీవీకే సైద్ధాంతిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని చెప్పారు. తమకు బీజేపీ సైద్ధాంతిక శత్రువని, ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఆ పార్టీతో పొత్తు ఉండదని వెల్లడించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న అన్నాడీఎంకేతోనూ కలిసేది లేదని తెలిపారు. నాయగన్ విడుదల కాకుండా కేంద్రం అడ్డుకోవడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే విమర్శించారు. తమిళ సంస్కృతిపై కేంద్రం దాడి జరుపుతోందన్నారు. తమిళ ప్రజల వాణిని అణిచివేయాలి మోదీ చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావన్నారు. దీనిపై కూడా నిర్మల్ కుమార్ స్పందించారు. 'జన నాయగన్'కు ఎవరు సపోర్ట్ ఇచ్చినప్పటికీ తాము స్వాగతిస్తామని చెప్పారు. కాంగ్రెస్‌తో పొత్తు విషయంపై తమ పార్టీ అధినేత విజయ్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారని వివరించారు. కాగా, 'జన నాయగన్' విడుదలను అడ్డుకోవడం, విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు పంపడం వంటి చర్యల ద్వారా టీవీకేపై బీజేపీ ఒత్తిడి రాజకీయాలకు పాల్పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# తమిళనాడులో 23న మోడీ పర్యటన

## అదేరోజు చెన్నైలో బహిరంగ సభకు ప్లాన్


**చెన్నై:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్డీయే తరఫున ప్రచార సభలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 23న రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఖరారైందని బీజేపీ రాష్ట్ర నాయకులు తెలిపారు. అదే సమయంలో ముందుగా అనుకున్నట్లు సభను మదురైకి బదులుగా రాజధాని నగరం చెన్నైలో ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్డీయేలో చేరిన అన్నాడీఎంకే ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందంజలో ఉంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రంలో ఎన్డీయేని బలపరచటంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మదురై నగరంలో ప్రధాని ప్రచార సభ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నిర్ణయించారు. గత వారం బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్ మదురై ప్రచార సభకు అనువైన ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి ప్రధాని మోదీ సభను రాజధాని నగరం చెన్నైలో నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర నాయకులు తీసుకున్న ఈ నిర్ణయానికి బీజేపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దీంతో నయినార్ నాగేంద్రన్ నగరంలో మోదీసభకు అనువైన రెండు ప్రాంతాలను ఎంపిక చేశారు. మహాబలిపురం సమీపం తిరువిడందై వద్ద సైనిక యుద్ధ సామగ్రి ప్రదర్శన జరిపిన ప్రాంతం మోదీ సభకు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ స్థలంతోపాటు పూందమల్లి వద్దనున్న 'వేల్స్ ఫిల్మ్‌సిటీ' ప్రాంతాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాలే కాకుండా చెంగల్పట్టు సమీపంలోను రెండు ప్రాంతాలను ఆయన పరిశీలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# అమెరికాలో చేరేది లేదు

## గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్



**కోపెన్‌హాగెన్ :** అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. త-రువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు.




# మోడీ సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ :** ప్రధాని మోడీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు మరియు పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి -సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు నేడు మాఘ బిహు పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పొంగల్ పర్వదినం సందర్భంగా తమిళనాడు ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పండగ రైతులు, వారి కుటుంబాల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ పండగ మనల్ని పోషించే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, తద్వారా మన సమాజాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆశావాదాన్ని కలిగివుండాలని పేర్కొన్నారు. ఈసంవత్సరం ప్రజలందరికీ శ్రేయస్సు, సానుకూలత మరియు మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు.

# మరోమారు రాజ్యసభకు నో

## దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన



**భోపాల్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.

# ఆరోపణలు సులువే.. ఆధారాలెక్కడ!

## కెనడాపై భారత రాయబారి ఫైర్



**ఢిల్లీ :** ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా 40 ఏళ్లుగా విఫలమవుతూనే ఉందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ అన్నారు. అందువల్లే భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మా-రుతోందని విమర్శించారు. కెనడా మీడియా సంస్థ సీబీసీకి దినేశ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటన ప్రస్తావనకు రాగా.. ఈ కేసులో భారత్‌పై కెనడా ఆరోపణలను ఆయన మరోసారి తిప్పికొట్టారు. "కెనడా గడ్డ నుంచి జరుగుతోన్న ఉగ్ర కుట్రల గురించి మేం 40 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. ఉగ్రవాద కట్టడికి ఈ దేశ నేతలెవరైనా చర్యలు చేపట్టారా? ఈ కేసుల్లో (ఎయిరిండియాపై బాంబు దాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ) కనీసం ఒక్కరికైనా శిక్ష పడిందా? కెనడా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఉగ్రవాదుల గురించి భారత్ లేవనెత్తినప్పుడు ఆధారాలు కావాలని డిమాండ్ చేస్తోంది. మరి మా దేశంపై కెనడా ఆరోపణలు చేసినప్పుడు కూడా (నిజ్జర్ హత్య కేసు విషయంలో) ఆధారాలు చూపించాలి కదా. ఆరోపణలు చేయడం సులువే. ఆ ఘటనలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని చెప్పేందుకు కచ్చితమైన సమాచారం ఉందని పదే పదే చెబుతోంది. మరి అందుకు తగిన ఆధారాలెక్కడ?" అని భారత రాయబారి ప్రశ్నించారు. నిజ్జర్ హత్య కేసు కు సంబంధించి కెనడాలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదైందని, ఇప్పటివరకు భారత ప్రభుత్వంపై ఎలాంటి అభియోగాలు లేవని దినేశ్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందంటూ గతంలో కెనడా చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య విభేదాలు రాజుకున్న సంగతి తెలిసిందే.

# ఇరాన్‌ను తక్షణమే వీడండి



**న్యూఢిల్లీ :** ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు, భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యా-త్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.. ఇరాన్‌లో నిరంతరం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా , వాణిజ్య విమానాలు సహా అందుబాటులో ఉన్న ఏదైనా రవాణా మార్గం ద్వారా భారతీయ పౌరులు ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించారు.ఇరాన్‌లో ఉన్న అన్ని భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని మరియు పరిస్థితిపై తాజా పరిస్థితుల కోసం స్థానిక మీడియాను ఫాలో కావాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది.. భారత పౌరులు తమ ప్రయాణ మరియు ఇమ్మిగ్రేషన్ పత్రాలన్నింటినీ పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని.. తక్షణమే అందుబాటులో ఉండాలని రాయబార కార్యాలయం కోరుతోంది. వారికి ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా వారు కోరారు. ఇటీవలి ఇరాన్‌లో విస్తృత నిరసనలు, హింస మరియు భద్రతా చర్యలు జరిగాయి, దీనివల్ల విదేశీ పౌరుల భద్రత గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకుంటామని అమెరికా బెదిరిస్తూనే ఉన్న విషయం విదితమే..

## ఇరాన్‌లో మారణ హోమం

### 2500 మందికి పైగా మృతి..

**ఢిల్లీ :** ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం, అవినీతికి వ్యతిరేకంగా శాంతియుతంగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నిరసనల కారులకు, భద్రతా దళాలకు మధ్య జరుగుతున్న పోరు మారణ హెూమానికి కార-ణమైంది. ఆందోళనకారులను అణిచివేసేందుకు భద్రతా దళాలను ప్రభుత్వం రంగంలోకి దింపడం పెను విధ్వంసానికి దారి తీసింది. గత మూడు వారాలుగా ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మృతి చెందారని, వారిలో 2,403 మంది ఆందోళనకారులని, 147 మంది భద్రతా సిబ్బంది అని అమెరికా కేంద్రంగా పని చేసే మానవ హక్కుల ఉద్యమకారుల సంస్థ ప్రకటించింది. ఈ ఘర్షణలతో ఏమాత్రం సంబంధం లేని 12 మంది చిన్నారులు, 9 మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్టు సదరు సంస్థ వెల్లడించింది. అలాగే ఇప్పటివరకు 18 వేల మంది నిరసనకారులను ఇరాన్ భద్రతా దళాలు అరెస్ట్ చేశాయి. కాగా, ఇరాన్‌లో ఆందోళనలను మరింతగా రెచ్చగొట్టేలా డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఆందోళనలు చేస్తూనే ఉండాలని, ప్రభుత్వ సంస్థలను స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సాయం అందించేందుకు వస్తున్నామని హామీనిచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలతో అమెరికా సైనిక చర్యకు సిద్ధమైందనే సంకేతాలు అందినట్టేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ట్రంప్‌గానీ, వైట్‌హౌజ్ వర్గాలు గానీ దీనిపై ఇప్పటివరకు ఏ స్పష్టతా ఇవ్వలేదు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




సంపాదకీయం

# సంక్రాంతితోనే ఉత్తరాయణం ప్రారంభం!

కాలగమనంలో మార్పును సూచించేదే సంక్రాంతి. చలికాం ముగిసిపోయి..వెచ్చని అడుగులు పడుతున్నాయన్న సంకేతం ఇచ్చేదే సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయంనం నుంచి ఉత్తరాయణంలోకి పయనించేది కూడా సంక్రాంతి నుంచే. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది. ఈ ఉత్తరాయణాన్ని దేవతలకు సంబంధించిన కాలంగా పరిగణిస్తారు. అందుకే ఈ కాలాన్ని ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. ఈరోజు నుంచి వివాహం, గృహప్రవేశం, నామకరణం, కొత్త వ్యాపారం వంటి ఇతర శుభ కార్యాలపై ఉన్న నిషేధం కూడా తొలగిపోతుంది. హిందువుల పండుగలు అన్నీ కానుగతిని బట్టి నిర్ణయించినవే. ఇందులో శాస్త్రీయతో పాటు, బలమైన సందేశం ఉంది. పండగల వైశిష్ట్యం అంతాఇంతా కాదు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంది. వాటిని ఆరించే విధంగా చేస్తున్నవే పండగలు. సంక్రాంతి పండగ తెలుగు వారికి పెద్ద పండగే అయినా...దేశంలోని పలు ప్రాంతాల్లో దీనిని పలు రకాలుగా జరుపు కుంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మకర సంక్రాంతి పండుగని సూర్యుడు రాశి మార్పు ఉత్తరాయణం ప్రారంభానికి సూచికగా భావిస్తారు. ఇదే రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం చేసిన షట్తిల ఏకాదశి అరుదైన కలయిక ఏర్పడుతోందని చెబుతున్నారు పండితులు. ఈ ప్రత్యేక యోగంలో చేసే పవిత్ర స్నానం, దానధర్మాలు, పూజలు మామూలు రోజులు చేసే పూజాఫలం కంటే అనేక రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు. షట్తిల ఏకాదశి ఉండటం వల్ల ఈరోజుకు మరింత విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో మకర సంక్రాంతి పండుగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు ఈ సంక్రాంతి పండుగని పెద్ద పండుగగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక శుద్ధి, నూతన శక్తికి సంబంధించిన పండుగగా పరిగణిస్తారు. ఈ పండుగ వేళ పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు, సూర్యారాధన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణం ప్రారంభిస్తాడు. అలాగే హిందూ సంప్రదాయం ప్రకారం మకర సంక్రాంతి రోజు చేసే దానధర్మాలు, పుణ్య కార్యాలు, పరిహారాలు ఏడాది పొడవునా సుఖశాంతులు, సిరిసంపదలు, శ్రేయస్సు కలిగిస్తాయని నమ్మకం. ఈ సంక్రాంతి పండుగ రోజు సాధారణంగా ఇరుగు పొరుగు వారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇస్తారు. సంక్రాంతి పండుగ, మకర సంక్రాంతి పండుగ అందమైన రంగవల్లులకు.. గొబ్బెమ్మలకు.. హరిదాసుల పాటలకు.. బసవన్నల ఆటలకు.. నువ్వుల మిఠాయిలకు.. గాలిపటాలు ఎగరేయడానికి ఇలా ఎన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ సంక్రాంతి పండుగను పంటల పండుగ అని.. అలాగే మార్పు తీసుకొచ్చే పండుగ అని కూడా అంటారు. అలాగే ఈ పండుగలు అనేవి మన వర్తమాన, భవిష్యత్తులను గుర్తుచేస్తూ.. స్పృహతో మలచుకోవాలి అనే విషయాలను గుర్తుచేస్తాయి. అంతే కాకుండా ఈ సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడిని నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పించడం వల్ల ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయని పండితులు చెబుతారు. వేకువజామున లేచి తలంటుకుని స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి అర్ఘ్యం వదలాల్సి ఉంటుంది. అంటే ఈ పండుగ రోజుల్లో స్నానం చేయకపోతే కనుక 7 జన్మల పాటు రోగాల బారిన పడి నిర్ధనుడై జీవిస్తాడని శాస్త్రంలో చెప్పారు. కాబట్టి పవిత్రమైన సూర్య సంక్రమణం సమయంలో స్నానం చేయడం ఎంతో శుభప్రదం. ఈ పండుగ మూడు రోజులు ఎంత పని ఉన్నా ఎలా ఉన్నా స్నానం మాత్రం తప్పకుండా చేసి శుచిగా ఉండాలి.ముఖ్యంగా ఈ మూడు రోజులు తెల్లవారు జామున నిద్రలేచి సూర్యోదయం వేళ స్నానం చేసి సూర్య నమస్కారం చేస్తే ఎంతో పుణ్యప్రదం. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు,బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది.పంచభూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్యపదమని నమ్మకం.ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్మజీవు లను నశింపజేస్తుంది. హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడించే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది. క్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారు జామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపస్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్



# సర్వహితం సంక్రాంతి సంబరం

> తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ... ఆధునిక హంగులను సైతం సదాచారం వైపు నడిపించే పండుగ సంక్రాంతి. 'క్రాంతి' అంటే వెలుగు. 'సంక్రాంతి' అంటే కొత్తదైన వెలుగు. మన జీవితాల్లో కొత్త వెలుగు నిండాలని కోరుకుంటూ చేసుకొనే సమష్టి ఆరాధన సంక్రాంతి. అందుకే పండుగల్లో ఇది అగ్ర తాంబూలాన్ని అందుకుంది.

సంక్రాంతి అంటే భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పేరుతో నాలుగు రోజుల ఆటవిడుపు కాదు. జీవన సంస్కృతికి ప్రతిబింబమైన సామాజిక పర్వదినం. రంగవల్లులు, గొబ్బెమ్మలు, బంతిపూలు, రేగు పండ్లు, బసవన్నలు, హరిదాసులు, పిండివంటలు, కొత్త బియ్యం, కోడి పందేలు, పతంగులు, చెరుకు గడలు, భోగి మంటలు, తర్పణాలు, దాన ధర్మాలు, ఆత్మీయమైన పలకరింపులు, అనుబంధాల సరదాలు, ఆచార వ్యవహారాలు... వీటన్నిటి సమాహారం సంక్రాంతి.



సంక్రాంతి సందడి భోగి రోజునే ప్రారంభమవుతుంది. పాత కలపను, వృధా వస్తువులను భోగి మంటల్లో వేసి, అగ్ని ఆరాధన చేయడం అంటే... పాత వాసనలు, వృధా ఆలోచనలు వదులుకొని కొత్త ఆశలతో జీవించాలనే సందేశం. కాలం కదిలిపోతుంది. భవిష్యత్తు వర్తమానం అవుతుంది. వర్తమానం కూడా గతం అనే మహార్ణవంలో కలిసిపోతుంది. గతాన్ని మరచి, భవిష్యత్తుకోసం దిగులు పడకుండా వర్తమానంలో జీవించాలని భోగి మంటలు చెబుతాయి. భోగి అనగానే గుర్తుకువచ్చేది భోగి పండ్లు. అపురూపమైన పసితనానికి దిష్టి తగలకుండా, అన్ని ఆనందాలూ పిల్లలకు లభించాలని ఆశీర్వదించేవే భోగి పండ్లు. ఆరోగ్యం, ఆనందం అనే భాగ్యాలను తెచ్చే భోగి పండుగ అద్వితీయమైన రోజు. బలి చక్రవర్తిని వామనుడు మూడు అడుగుల నేలను అడిగి, విశ్వమంతా వ్యాపించినది భోగి రోజునే అని, వ్యవసాయానికి ఆధారమైన వర్షానికి కారకుడు ఇంద్రుడు. ఆయన కృపవల్ల పంటలు సమృద్ధిగా చేతికి వచ్చాయని కృతజ్ఞతలు చెప్పుకొనే అవకాశాన్ని భోగి ఇచ్చిందని పురాణాలు చెబుతున్నాయి.

## శుభ సంక్రాంతి

సూర్యుడు మకర రాశిలోకి సంక్రమణం చేసే శుభపర్వం మకర సంక్రాంతి. అన్ని పండుగలు చాంద్రమానం ప్రకారం చేసుకుంటే... సౌరమానం ప్రకారం జరుపుకొనే పండుగ సంక్రాంతి. ఆ రోజు నుంచే దక్షిణాయనం ముగిసి, ఉత్తరాయణం మొదలవుతుంది. శుభకార్యాలకు నెలవైన కాలం ఉత్తరాయణం. మకర సంక్రమణం త-రువాత ఇళ్ళలో శుభకార్యాలను తలపెట్టడం ఆనవాయితీ. మనిషి తనలోని ప్రతికూల లక్షణాలన్నిటినీ వదులుకొని, సత్ప్రవర్తన అలవరచుకోవాలనే సందేశానికి ప్రతీక ఈ పండుగ. భగీరథ ప్రయత్నం ఫలించి, గంగానది భువిపై పరుగులు పెట్టిన రోజుగా దీన్ని పేర్కొంటారు. మనిషికి జీవితాన్ని, అస్థిత్వాన్ని ఇచ్చిన పూర్వీకులను సంస్మరించుకుంటూ తర్పణాలు ఇవ్వడం, దానాలు చేయడం సంక్రాంతి విధి. మనిషిని బ్రతికించేది అన్నం. సంక్రాంతి నాడు కొత్త ధాన్యంతో పరమాన్నం చేసి, భగవంతుడికి నివేదించి, అందరికీ అన్నం సమృద్ధిగా లభించాలని ఆకాంక్షించడం... సార్వజనీన సౌభాగ్యాన్ని సహృదయంతో కోరుకోవడమే అవుతుంది.



## కృతజ్ఞతలే కనుమ

ప్రపంచానికి అన్నం పెట్టే రైతులతో కలిసి ఆరుగాలం శ్రమించే బసవన్నలను అలంకరించి, పూజలు నిర్వహించి, కృతజ్ఞతలు చెల్లించుకొనే మహత్తర పర్వం... కనుమ. పశు పక్ష్యాదులను కూడా గౌరవించుకొనే సందర్భం. పశు పోషణ, రక్షణ మానవుల కర్తవ్యం. వాడుకలో 'కనుమ'గా ఉపయోగించే పదానికి అసలు రూపం... కనుముపులు. 'కనుము' అంటే పశువు, 'పులు' అంటే మాలిన్యం. పశువుల మాలిన్యాన్ని శుభ్రపరచడం వెనుక... మనిషిలోని పశుత్వాన్నీ, మాలిన్యాన్నీ కడిగేసుకోమనే అర్థం దాగుంది. ప్రపంచంలో మనతోపాటు కలిసి ఉండే జీవజాతికి మంచి మనసుతో, నిష్కల్మషంగా కృతజ్ఞతలు తెలుపుకోవడమే అసలైన కనుమ పండుగ.

## సంఘీభావమే ముక్కనుమ

సంక్రాంతి పండుగ వాతావరణానికి ముగింపు శోభను సంతరించే ముక్కనుమ... అందరినీ కలుపుకొనే విశేషమైన పర్వం. అందరినీ మనవారనుకొని ఊరంతా ఒక్కటయ్యే సూత్రం... రథం ముగ్గు రూపంలో ప్రతి ఇంటినీ ఒక్కటిగా చేస్తుంది. మనిషి సంఘజీవి. సంఘీభావంతోనే మనిషి మనుగడ సాధ్యపడుతుంది. 'నేను, నాది' అనే స్వార్థానికి తావివ్వని సమైక్య భావన మనలో ధ్వనించాలనేదే ముక్కనుమ సారాంశం.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
గురువారం 15 జనవరి 2026 పేజీ : 5



# తీడ ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం

## - పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల

**కశింకోట, జనవరి 14 మనసులో మాట...** మండలం లోని, తీడ గ్రామంలో భోగి పండుగ, ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం సందర్భంగా మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ఎన్టీఆర్ తీర్థం సందర్బంగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళలు అర్పించారు. తీడ గ్రామంలో కూటమి నాయకులతో, ప్రజలతో కలిసి ఈ తీర్థం సందర్భంగా కూటమి శ్రేణులు, ప్రజలతో కలిసి భోగి పండుగలో, ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ,మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిలికి చైతన్య, చిలికి సన్యాసిరావు, కలగ గోవింద కూటమి నాయకులు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.



# హోంమంత్రి ఇంట సంక్రాంతి శోభ

## - సంప్రదాయబద్ధంగా వేడుకలు



**ఎస్. రాయవరం, జనవరి 14,(మనసులో మాట):** రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలును తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ఆమె స్వగృహంవద్ద పాయకరావు పేట నియోజకవర్గ కూటమినేతల తోకలిసి వైభవంగా నిర్వహించారు.







హోంమంత్రి అనిత భోగిమంటలు వేసి వేడుకలును ప్రారంభించారు. అనంతరం కేరళ డప్పు వాయిద్యాలును ఆమె స్వయంగా డప్పులు కొట్టి స్థానికనేతలు కలిసి డాన్సులు చేసారు. అనంతరం బసవన్నలుకు పూజలుచేసి, హరిదాసులుకు కానుకలు అందచేసారు. తాడిపెద్దుల భజన వాయిద్యాలు, కోలాటాలు, పిల్లలు నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్యంతం వేడుకలు ను ఉత్సాహం గా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నాలుగు మండలాలుకు చెందిన కూటమినేతలు పాల్గొన్నారు.



# స్పీకర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

నర్సీపట్నం రూరల్, జనవరి 14, ( మనసులో మాట) : ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఇటీవల నియమితులైన వన్నెంరెడ్డి సతీష్ కుమార్ బుధవారం నర్సీపట్నం లోని స్పీకర్ నివాసంలో శాసనసభ గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 23న జరిగే ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని గౌరవ స్పీకర్ ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, పదవికి వన్నె తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన గ్రంథాలయ సంస్థ చైర్మన్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ రాజాన వీర సూర్యచంద్ర, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, కార్యదర్శులు పంచాడ హరినాథ్, అల్లాడ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# గవరపాలెం లో ఘనంగా అయ్యప్ప స్వామి మకరజ్యోతి దర్శన వేడుకలు

## పురవీధులలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు



**అనకాపల్లి, జనవరి 14 (మనసులో మాట):** స్థానిక గవరపాలెం శ్రీ గౌరీ పంచాయతన దేవాలయం లో బుధవారం అయ్యప్ప స్వామి మకరజ్యోతి దర్శన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు సహకారంతో సోలాల బంగారం తో స్వామివారికి బంగారు వజ్రకవచం, పట్టబంధు, నామాలు, పాదుకలుతో అయ్యప్ప స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని పురవీదులలో ఊరేగింపు జరిపారు. అంతకుముందు శ్రీ అయ్యప్పస్వామి మకరజ్యోతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శబరిమల ఆలయంలో తయారు చేసిన స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉత్సవ కమిటీ చైర్మెన్ పీలా నాని అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు సూర్యనారాయణ శాస్త్రి వేదమంత్రాలతో ఉదయాన్నే అయ్యప్ప స్వామి మూల విరాట్ విగ్రహానికి వివిధ రకాల 18 పళ్ళరసాలతో విశేష అభిషేకాలు, పంచామృత అభిషేకాలు ఘనంగా జరిపారు. ఆలయ ప్రధాన గురుస్వామి మద్దాల నారాయణరావు,

కో కన్వీనర్ ఆధ్వర్యంలో పడిపూజ ను శ్రీ గౌరీ సేవా సంఘం మాజీ అధ్యక్షులు మళ్ల సాంబశివరావు ప్రారంభించారు. తదనంతరం అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), కొణతాల బాల సుబ్రహ్మణ్యం కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి జ్యోతి ప్రజ్వలన చేశారు . ఈ కార్యక్రమంలో శ్రీగౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, అయ్యప్ప స్వామి దేవాలయ కన్వీనర్ మళ్ల సూర్యప్రకాష్ రావు, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, పర్యవేక్షకులు అయ్యప్ప ఆలయ కమిటీ మెంబర్ భీమరశెట్టి నూకేష్, కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో దేవాలయాల

# అభివృద్ధికి కృషి చేస్తాం

### - ఎమ్మెల్యే బండారు, డైరీ చైర్మన్ ఆనంద్ కుమార్ - 23 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం
### - పెదనందిపల్లి సత్యనారాయణమూర్తి కొండపై మండపం నిర్మాణానికి శంకుస్థాపన





**దేవరాపల్లి, జనవరి 14, (మనసులో మాట) :** గ్రామీణ ప్రాంతాలలో దేవాలయాలను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. మండలంలోని పెదనందిపల్లి గ్రామ సమీపంలోని సత్యనారాయణ మూర్తి ఆలయం వద్ద 6 లక్షలు ఆడారి సొంత నిధులతో మండపం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడారు. నూతన మండపం నిర్మాణంతో పాటు మరో మండపం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. పెదనందిపల్లి గ్రామంతో పాటు సత్యనారాయణమూర్తి ఆలయ సమీపంలో సిమెంట్ రోడ్లు నిర్మాణానికి మరో 17 లక్షలతో పనులు చేపట్టనున్నామన్నారు. డైరీ చైర్మన్ ఆనంద్ మాట్లాడుతూ పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు, యువత ముందుకు రావాలన్నారు. దీనికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. ఆలయానికి వెళ్లే దారిలో మట్టి రోడ్డు నిర్మాణం ఆలయ ధర్మకర్త ఓ.సత్యనారాయణ, గ్రామ నాయకులు, మాజీ సర్పంచ్ కొరుపోలు రామలింగస్వామి యువసేన సొంత నిధులతో చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే ను, డైరీ చైర్మన్ ను, ముఖ్య నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు సత్యనారాయణ మూర్తి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కిలపర్తి భాస్కరరావు, రావాడ సింహాద్రి నాయుడు, రైవాడ రిజర్వాయర్ చైర్మన్ పోతల పాత్రునాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, బిజెపి మండల పార్టీ అధ్యక్షురాలు ఆవుగడ్డ సత్యవేణి (నాయుడమ్మ), మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి శరఖాన సూర్యనారాయణ, డైరీ డైరెక్టర్ గంగాధర్, ఆవు గడ్డ కోటిపల్లి నాయుడు, పూడి సత్యరావు, మతల రాజు నాయుడు, అల్లు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# శారీరిక మానసిక వికాసానికి క్రీడలు దోహదం



**చీడికాడ జనవరి 14, (మనసులో మాట)..** శారీరిక మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు మండలంలో తురువోలు గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ యువత క్రికెట్ తో పాటు మిగతా అన్ని పోటీలలో రాణించాలని కోరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తన సొంత నిధులతో రెండు క్రికెట్ కిట్లును నిర్వాహకులు అందజేశారు ఈ కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ చైర్మన్ గ్రామ టిడిపి యువ నాయకులు పాత్రిని సురేషు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



**చీడికాడ, జనవరి 14, (మనసులో మాట)..** రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు మండలంలో ఖండి వరం గ్రామంలో హై స్కూల్ లో నూతనంగా నిర్మించిన ప్రహరిగోడను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కూటమి కృషి చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ జిల్లా టిడిపి అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి మాజీ ఎంపీపీ కళావతి టిడిపి నాయకులు దయాకర్ సింగంపల్లి పెదనాయుడు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ రఘు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి ఆచారి పాల్గొన్నారు

## అనకాపల్లి జనసేన పార్టీ ఆధ్వర్యంలో..

# భోగి పండుగ మహోత్సవ వేడుకలు





**అనకాపల్లి, జనవరి 14 (మనసు లో మాట):** అనకాపల్లి రింగ్ రోడ్డు లోని జనసేన పార్టీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం భోగి పండుగ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లి నియోజవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఇంట్లో భోగభాగ్యలు తో నిండాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతంగా, సుఖ శాంతులతో, జీవితంలో వెలుగులు నింపాలని అకాంక్షించారు. ఈ కూటమి ప్రభుత్వం లో ప్రశాంతంగా అన్ని వర్గాలు ప్రజలు క్షేమంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ఈ రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలన్న సంకల్పం లో సఫలీ కృతులు అయ్యారన్నారు. ఈ రాష్ట్రం లో ఏడాది కి సుమారు 24 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చి లక్షల మంది ఉద్యోగ అవకాశాలు కల్పించే మంచి సంకల్పంతో ముందుకు వెళు తున్నామన్నారు. సంక్షేమ, అభివృద్ధి బాట వైపు తీసుకు వెళ్తూ, దేశ ప్రధాని నరేంద్ర మోడీ 2047 కల్లా ప్రపంచ దేశాల్లో నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దే భాగంగా ఈ ఆంధ్ర రాష్ట్రం ఆయన 2047 గోల్ రీచ్ అవ్వడానికి దోహదపడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దోహదపడుతూ మంచి పరిపాలన అందిస్తున్నారని తెలియజేశారు. ముందుగా నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ సారథ్యంలో భోగి పండుగను అత్యంత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంకీ మాట్లాడుతూ ఈ సంక్రాంతి ప్రతి ఇంట్లో భోగభాగ్యలు తేవాలని, సుఖశాంతులతో, జీవితంలో వెలుగులు నింపాలన్నారు. మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదర్శ అనకాపల్లి గా అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా నియోజకవర్గ ప్రజలందరికి భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి సంబరాల్లో అనకాపల్లి నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన భోగి ఉత్సవాలు

## - లచ్చన్నపాలెంలో ఘనంగా ధనుర్మాస మేల్కొలుపు ముగింపు



**మాకవరపాలెం, జనవరి 14, (మనసులో మాట) :** మండలంలోని లచ్చన్నపాలెం గ్రామంలో ధనుర్మాసపు మేల్కొలుపు కార్యక్రమం 30 రోజులు విజయవంతంగా పూర్తికావడంతో, బుధవారం భోగి, సంక్రాంతి ఉత్సవా లు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుని తనయుడు చింతకాయల రాజేష్ దంపతులు భక్తులతో కలిసి ఉదయం నిర్వహించిన మేల్కొలుపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భోగి ఉత్సవాలను ప్రారంభించి, గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ శ్రేయస్సు, ప్రజల ఆరోగ్యం, పంటల సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు చేశారు. భోగి పండుగ సందర్భంగా లచ్చన్నపాలెం గ్రామం భక్తి, సంప్రదాయ ఉత్సాహంతో కళకళలాడింది. ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు పోతల రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## కనులపండువు గా గోదాదేవి కల్యాణం

**ఎస్. రాయవరం, జనవరి 14,(మనసులో మాట):** భోగిపండుగ సందర్భంగా మండలకేంద్రంలో ని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వామిల కళ్యాణోత్సవం వైభవం గాళనిర్వహించారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా భోగిరోజున ఈకళ్యాణోత్సవం ప్రతిఏటా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గోవిందరావు తెలిపారు. బుధవారం జరిగిన ఈకళ్యాణ ఉత్సవంలో 50 మంది దంపతులు పాల్గొన్నారు. అమ్మవారి కళ్యాణోత్సవాన్నిఆలయ అర్చకులు కన్నులపండువుగా నిర్వహించారు. మండలంలోని దార్లపూడిలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణం నిర్వహించారు. వేలాదిమందిభక్తులు ఈకళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### తుప్పల చాటున
## 108 అంబులెన్స్
### - మరమ్మతుకు పట్టించుకోని అధికారులు



**డుంబ్రిగుడ, జనవరి 14, (మనసులో మాట) :** మారుమూల గ్రామంలో అనారోగ్యానికి గురైన వ్యాధిగ్రస్తులకు తక్షణమే వైద్య సేవలు అందించటానికి గాను ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ కు మరమ్మత్తు పనులు చేయకపోవడంతో అది మూలన పడింది. సుమారు ఏడాది నుంచి అది పలమాటులో మూలన పడి నిరుపయోగంగా దర్శనమిస్తుంది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతు గురైన 108 అంబులెన్స్ కు మరమ్మత్తు పనులు చేసి వినియోగంలో తీసుకొచ్చి గిరిజనులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని మండలంలోని గిరిజనులు కోరుతున్నారు.

## రేపు మునగపాక లో గోమాతల అలంకరణ పోటీలు
### ఎడ్ల పందాలు ఉత్సవ కమిటీ



**మునగపాక జనవరి 14, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక లో ఈ నెల 16న శుక్రవారం ఉదయం10 గంటలకు ఆవుల అలంకరణ పోటీలు పెట్టడం జరిగినది. మొదటి బహుమతి20000 ద్వితీయ బహుమతి 150000. తృతీయ బహుమతి 10000. మరియు పోటీకి వచ్చిన ప్రతి గోమాతకు పాలు క్యాన్ బహుమతిగా ఈ బహుమతులు మన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చేతులమీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేదిక వాడ్రాపల్లి రోడ్డు ఎడ్ల పందాలు గ్రౌండ్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

### యువతలో చైతన్యం కోసమే
# విజిబుల్ పోలీసింగ్ క్రీడలు
### జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్.,





**అనకాపల్లి (నాతవరం), జనవరి 14 (మనసులో మాట)..** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ మరియు అసాంఘిక కార్యకలాపాల నివారణే ధ్యేయంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో మాధవనగరం, నాతవరం మరియు గంగవరం గ్రామాల్లో 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. స్థానిక యువత కోసం వాలీబాల్ మరియు క్రికెట్ టోర్నమెంట్లను ఏర్పాటు చేశారు. పండుగ సమయాల్లో యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా, క్రీడల ద్వారా క్రమశిక్షణ మరియు సోదరభావాన్ని పెంపొందించడం. అలాగే గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిఘా ఉంచడం.

నర్సీపట్నం రూరల్ ఇన్ స్పెక్టర్ రేవతమ్మ, ఎస్సై వై.తారకేశ్వరరావు మరియు పోలీస్ సిబ్బంది గ్రామ పెద్దల సహకారంతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. గ్రామ పెద్దలు ఈ చొరవను అభినందిస్తూ, పోలీసుల విజిబుల్ పోలీసింగ్ వల్ల ప్రజల్లో భద్రతా భావం పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

## జనసేన ఆధ్వర్యంలో ఈనెల 16న ఎడ్లబండ్ల పోటీలు




**నాతవరం, జనవరి 14, ( మనసులో మాట) :** మండలంలోని దారగంగవరంలో ఈ నెల 16న జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎడ్లబండి పోటీలు నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర తెలిపారు. బుధవారం ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన జనసేన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, జనసేన నాయకుడు ప్రగడ కృష్ణబాబు నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.12 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.8 వేలు, నాల్గవ బహుమతి రూ.6 వేలు, ఐదవ బహుమతి రూ.4 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సశీస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని, ఆ సంప్రదాయాలను కాపాడే ఉద్దేశంతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నర్సీపట్నం వైస్ ఎంపీపీ ఇన్నం రమణ,రత్నం, జనసేన నాయకులు భాస్కరరావు, గుడివాడ కృష్ణ, శివలంక సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్యశేఖర్, కూటమి నాయకులు కాసారపు నూకరాజు, అప్పన విజయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అనకాపల్లి లో ఘనంగా కృష్ణకుమారి
# పేరంటాలమ్మ తల్లి తీర్థం





**అనకాపల్లి, జనవరి 14 (మనసులో మాట):** అనకాపల్లి పట్టణం లోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు లో బుధవారం కృష్ణ కుమారి పేరంటాలమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించారు. బోగి పర్వదినాన కృష్ణకుమారి పేరంటాలమ్మ తల్లికోట తీర్థ మహోత్సవం కోలాహాలంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే పేరంటాలమ్మ తల్లి కి భక్తులు పూజలు చేశారు. తీర్థంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషం గా అకట్టుకున్నాయి. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ కృష్ణ, బుద్ధ విజయలక్ష్మి, బుద్ధ భగవాన్, బిజెపి సీనియర్ నాయకుడు, తోటాడ మాజీ సర్పంచ్ పొలమరశెట్టి నాగేశ్వరరావు, ఉమ్మలాడ మాజీ సర్పంచ్ కర్రి అప్పారావు, కాంద్రేగుల సత్యనారాయణ (టీచర్), అనకాపల్లి బుద్ధ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటింటికి చెరకుగడలు, గుమ్మడికాయల పంపిణీ
### - దశాబ్ద కాలంగా కొనసాగుతున్న కార్యక్రమం



**నర్సీపట్నం రూరల్, జనవరి 14, ( మనసులో మాట) :** మకర సంక్రాంతి పండుగ సందర్భంగా మున్సిపాలిటీ లోని ఒకటి మరియు రెండు వార్డులలో పట్టణ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి చెరుకు గడలు, గుమ్మడికాయలను బుధవారం పంపిణీ చేశారు. ప్రతి సంక్రాంతికి ఆనవాయితీగా చెరుకు గడలు గుమ్మడికాయలను పంపిణీ చేయడం మురళీకృష్ణ గత దశాబ్ద కాలంగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, సంక్రాంతి పూజా విధానంలో చెరుకు గడలు, గుమ్మడికాయలు తప్పకుండా ఉండాల్సినవని, అవి రెండూ లేని పూజకు శోభ రాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరుకు గడలు గుమ్మడికాయలు విరివిగా లభించే అవకాశం ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వాటి లభ్యత కష్టతరంగా మారిందన్నారు. అందుకనే గత పది ఏళ్లుగా సంక్రాంతికి ముందుగానే వాటిని సమకూర్చి మున్సిపాలిటీలోని ఒకటి, రెండు వార్డులలో ఇంటింటికి అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రెండు వార్డులోని ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రావణాపల్లి రిజర్వాయర్ చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, ఒకటి రెండు వార్డుల పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం లో
## గోదాదేవి కళ్యాణ మహోత్సవ వేడుకలు



**అనకాపల్లి, జనవరి 14 (మనసులో మాట):** సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణస్వామి, శ్రీ సూర్యనారాయణస్వామి వార్ల దేవస్థానం లో బుధవారం గోదాదేవి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవస్థాన ప్రాంగణంలో భోగి మంటలు వెలిగించి దేవస్థాన చైర్మెన్ బొడ్డేడ మురళీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశా రు. అనంతరం భోగిపళ్ళ తో స్వామివారికి అభిషేకం చేసి, చిన్నపిల్లలకు భోగి పళ్ళు ఇవ్వడం జరిగింది. అనంతరం గోదాదేవి కల్యాణం అత్యంత కడురమ్యంగా జరిపారు. ఇతర దేవతా కళ్యాణోత్సవా లతో పోలిస్తే గోదాదేవీ కళ్యాణం అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని చైర్మన్ మురళి అన్నారు. ఈ కార్యక్రమం లో ఈఓ మురళీకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు దొడ్డి భరత్, సూరిశెట్టి బల్లమ్మ, కర్రీ లక్ష్మీ నూకరాజు, తురకలపూడి ఈశ్వరరావు, రేబాక వరలక్ష్మి ఈశ్వరరావు, కైచర్ల నరసమ్మ, తిమ్మరాజు మల్లిఖార్జునరావు, శ్రీ సంతోషిమాత దేవస్థాన చైర్మెన్ మారిశెట్టి అరుణ భాస్కరరావు, సత్య దేవా భక్త బృందం పాల్గొన్నారు.



### తోటలూరులో అంబరాన్నంటిన
## భోగి సంబరాలు

**కొయ్యూరు, జనవరి 14 (మనసులో మాట):** అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం తోటలూరు గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పండుగలో భాగంగా బుధవారం నిర్వహించిన భోగి వేడుకలు గ్రామ ప్రజల మధ్య ఎంతో సందడిగా సాగాయి. ఉదయాన్నే గ్రామస్థులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తోరణాలు, పూలమాలలతో అలంకరించిన గడపలను భక్తిశ్రద్ధలతో కొలిచారు. మహిళలు, పురుషులు కలిసి జానపద పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పండుగ వాతావరణాన్ని నింపారు. గ్రామంలోని చిన్నాపెద్దా అందరూ ఏకమై భోగి వేడుకల్లో పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. పిల్లలు, పెద్దలు కొత్త బట్టలు ధరించి పండుగ సంబరాల్లో మునిగిపోయారు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకలు గ్రామస్థుల మధ్య ఐక్యతను చాటిచెప్పాయి. సంక్రాంతి మూడు రోజుల పండుగలో మొదటి రోజైన భోగిని ఇంత ఘనంగా జరుపుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొలపర్తి భవనంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



అనకాపల్లి రూరల్, జనవరి 14 మనసులో మాట): సంక్రాంతి సంబరాల్లో భాగంగా అనకాపల్లి రింగ్ రోడ్ కోలపర్తి భవనంలో శ్రీ రామచంద్ర మిషన్ ఆర్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే భవద్గీత పారాయణం, భక్తి గీతాలు ఆలాపన, యోగ, ధ్యానం ఆచరించారు. అలాగే పేదలకు బట్టలు, ఖర్జూరం, బెల్లం, బియ్యం పంపిణీ చేశారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోలపర్తి జయ బాబు, పూర్ణ దంపతులు, కృష్ణ మోహన్, సూర్యనారాయణ, కళ, మోహన్, సభ్యులు,విద్యార్థులు, మహిళలు, అభ్యసికులు పాల్గొన్నారు.

## భోగి సందర్భంగా పేదలుకు నూతన ధస్త్రాలు పంపిణీ



**ఎస్. రాయవరం, జనవరి 14,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం గుడివాడ గ్రామపంచాయితీ పరిధిలో లక్ష్మి పతిరాజు పేటగ్రామంలో భోగిపండుగ సందర్భంగా పేదలుకు నూతన వస్త్రాలు పంపిణీచేసారు. వైఎస్సార్సీపీ నాయుకుడు, గుడివాడ మాజీ సర్పంచ్ తన తాత, తండ్రులు జ్ఞాపకార్థం ప్రతిఏటా పేదలుకు వస్త్రాలు పంపిణీ చేస్తున్నారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమం లో మాజీ శాసన సభ్యుడు కంబాల జోగులు చేతులుమీదుగా ఈవస్త్రాలును పంపిణీచేసారు. ఈ కార్యక్రమం లో వైఎస్సార్సీపి నేతలుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎం.మాకవరం గ్రామంలో
## ఆవుల శాల అగ్నికి ఆహుతి



కొయ్యూరు జనవరి 14 (మనసులో మాట):ఎం.మాకవరం గ్రామంలోని చేను పాకల వద్ద ఉన్న ఆవుల శాల ఈరోజు ఉదయం సుమారు 6 గంటల సమయంలో అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన సాంబె లోవప్రసాద్, సాంబె చిరు వారి ఆవుల పాక పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే ఆవుల శాల పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎటువంటి మంటలు పెట్టలేదని, మంటలు ఎలా చెలరేగాయో తెలియడం లేదని బాధితులు తెలిపారు.

### మునగపాక లో ఘనంగా
## గాలిపటాల పోటీలు
### విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు



**మునగపాక, జనవరి 14, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక లో పతంగాల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్ జగదీష్, మల్ల తేజ, ఎన్నిటి గణేష్, పెంటకోట ప్రసాద్, కటారి నాయుడు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు మునగపాక ఎస్ఐ పీ ప్రసాదరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మూలపేట జనసేన పార్టీ అధ్యక్షులు కాంద్రేగుల గాంధీ, మునగపాక మండలటిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్, వేగి రమణబాబు, కోరుకొండ రామప్రసాద్, పెంటకోట స్వరూప్ పలువురు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## మునగపాకలో ఉత్సాహంగా
# భోగి పండుగ వేడుకలు

**మునగపాక, జనవరి 14, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక చెరువు ఒడ్డున జోగినాయుడు వీధిలో సంక్రాంతి భోగి పండుగ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే పిల్లలు పెద్దలు స్నానాలు ఆచరించి పిల్లలను తయారు చేసిన భోగి పందిళ్లకు నిప్పు పెట్టి ఆనందోత్సవాలతో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ భోగి పండుగ మహోత్సవాల్లో పాల్గొన్న వారందరికీ స్వీట్లు, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సూరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే ఆనందంగా భోగిమంటల వేడుకల్లో పాల్గొవాలని, ప్రతి కుటుంబ సుఖశాంతులతో ఆనంద ఉత్సవాలుగా అనునిత్యం ఉండాలని, గతంలో జరిగిన బాధలు, కష్టాలు భోగిమంటల్లో కరిగిపోవాలని, ప్రతి ఒక్కరిని జీవితంలో నూతన వెలుగులు సంతరించుకొని ఆనందంగా దీవించేలా ఆ భగవంతుడు ఆశీస్సులు మెండుగా ప్రజలందరికీ ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. ఈ వేడుకలను వచ్చిన పిల్లలకు పెద్దలకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం నగదు అందజేశారు.

## సరుగుడు పంచాయతీ రామన్నపాలెం గ్రామంలో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు





**నాతవరం, జనవరి 14(మనసులో మాట)..** సరుగుడు పంచాయతీ రామన్నపాలెం గ్రామంలో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు సర్పంచ్ గొల్లపల్లి గంగరాజు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మహిళలకు శీరల పంపిణి ఈ కార్యక్రమం కి ముఖ్య అతిధిలు గా నాతవరం మండలం పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణ రమణ , తాండవ డాం చైర్మన్ గారు కరక సత్యనారాయణ విచ్చేశారు. ఈ కార్యక్రమం లో లోకల్ నాయకులు అయినా సరుగుడు ఉపసర్పంచ్ మరియు మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బండి శివరామకృష్ణ , సరుగుడు పార్టీ ప్రెసిడెంట్ వై. చిన్న , మార్కెట్ డైరెక్టర్ పి. రాజుబాబు గారు, పీసా ఉపాధ్యక్షులు టి. రాంబాబు , కించి నాగేష్ , వార్డ్ మెంబెర్ పి. పోతురాజు ,పార్టీ ఉపాధ్యక్షులు ఎస్. నూకరత్నం ,టీడీపీ నాయకులు కొండబాబు , జి. రమణ, జి. లోవరాజు, కొండబాబు పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం నీ ఉద్దేశించి నందిపల్లి రమణ గ్రామ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేసి రామన్నపాలెం కట్టుబాట్లు చాలా బాగున్నాయి ఎప్పుడు ఇలానే ఉండాలని చెప్పి ఉన్నారు

## సుశీలమ్మ నేత్ర, శరీర అవయవదానం



అనకాపల్లి రూరల్ జనవరి 14 (మనసులో మాట): అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం సీనియర్ సభ్యురాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాసిరెడ్డి సుశీలమ్మ (91) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కోరిక మేరకు కళ్లను ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ కి, పార్దేవదేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజీకి దానం చేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సుశీలమ్మ భర్త వాసిరెడ్డి నారాయణ రావు అవయవాలను జీవన్దాన్ విభాగం కి దానం అందజేయడం జరిగిందని జిల్లా ఖజానా శాఖ అధికారి వి ఎల్ సుభాషిని తెలిపారు. నంబూరు నరేష్, అడ్డూరి శ్రీనివాస్ , రిటైర్డ్ అధ్యాపకుల సంఘం ప్రతినిధులు గ్రంధి గాంధీ , పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జగన్నాథం, శరీరధాత సంఘ సభ్యులు గంధం సాయి, డాక్టర్ రవీంద్ర కిషోర్, డాక్టర్ శిరీష, డాక్టర్ జర్నీ పల్లవి తదితరులు ఉన్నారు.

# బూరుగుపాలెంలో మకర సంక్రాంతి వేడుకలు

### - మహిళలకు ముగ్గుల పోటీలు, అన్నసంతర్పణ



**మాకవరపాలెం, జనవరి 14, ( మనసులో మాట)..** మండలంలోని బూరుగుపాలెం గ్రామంలో బుధవారం మకర సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం వద్ద గ్రామ యువకుల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ బహుమతిగా రూ. 2,000, ద్వితీయ బహుమతిగా రూ. 1,500, తృతీయ బహుమతిగా ఇద్దరికి రూ. 1,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను గ్రామ పెద్దలు, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కేతిరెడ్డి చిరంజీవి అందజేశారు. పోటీలలో పాల్గొన్న మహిళలం దరికీ ప్రోత్సాహకంగా కన్సోలేషన్ ప్రైజ్‌లు కూడా అందజేశారు. ఇదే సందర్భంలో రామాలయం వద్ద మేల్కొలుపు భక్తుల ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిఎన్ఆర్ ఆధ్వర్యంలో మహిళలకు వెయ్యి చీరలు పంపిణీ

### - కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పీకర్ సతీమణి పద్మావతి




**నర్సీపట్నం రూరల్, జనవరి 14, ( మనసులో మాట) :** మున్సిపాలిటీలోని 17వ వార్డుకు చెందిన ప్రముఖ వ్యాపారి, తెలుగుదేశం పార్టీ నాయకుడు గుడబండి నాగేశ్వరరావు ( జి ఎన్ ఆర్ ) తన సొంత నిధులతో సంక్రాంతి పండుగ సందర్భంగా సంక్రాంతి కానుక పేరుతో వార్డులోని మహిళలకు సుమారు వెయ్యి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి హాజరై చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఆమెకు సుమారు 500 మంది మహిళలు స్వాగతం పలకడం విశేషం. ఈ సందర్భంగా స్పీకర్ సతీమణి మాట్లాడుతూ, జిఎన్ఆర్ ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. జిఎన్ఆర్ మాట్లాడుతూ, ప్రతి పండుగకు వార్డులోని అక్క చెల్లెమ్మలకు కానుకలు అందించడం నాకు సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఒక కుటుంబ సభ్యునిలా నన్ను అభిమానించే నా వార్డు ప్రజలకు నేను ఎన్ని కానుకలు ఇచ్చినా వారి అభిమానం ముందు తక్కువేనన్నారు. రానున్న రోజుల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆశీస్సులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, వార్డును అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలపడమే నా లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, జి ఎన్ ఆర్ సోదరి గుడబండి ఆదిలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డెహ్రాడూన్ జాతీయ పెన్‌కాక్ సిలాట్ పోటీలకు
# విశాఖ నుంచి 14 మంది క్రీడాకారుల ఎంపిక

### మిషన్ కర్షకదేవోభవ జాతీయ చైర్మన్, పెన్ కాక్ సిలాట్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆడారి కిషోర్ కుమార్ అభినందన



**విశాఖపట్నం, జనవరి 14 (మనసులో మాట):** ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ లో 202526 సంవత్సరానికి జరగనున్న 3 వ అఖిల భారత పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ కు విశాఖపట్నం జిల్లా నుంచి 14 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. సంక్రాంతి సెలవులు ఉన్నప్పటికీ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో క్రీడాకారులు కఠిన సాధన కొనసాగిస్తు న్నారు. విశాఖపట్నం జిల్లా నుంచి ఎంపికైన కోటేశ్వరరావు, ధర్మశీల, శివ, నందిని, యువరాజ్, రాఘవ, ఈషా, కృతివాస్, కృతిక్ శ్రీ తేజ్, పావని, లింసీ, శర్మిల, నక్షత్ర, నాగేశ్ లకు డాక్టర్ కిషోర్ కుమార్ అభినందనలు తెలియజేశారు. అలాగే ఈ బృందానికి మద్దతుగా ప్రసాద్ అన్న, భార్గవి, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి అండ్ జిల్లా చీఫ్ కోచ్ ఎం. వెంకటరావు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పెన్‌కాక్ సిలాట్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడారి కిషోర్ కుమార్ ఎంపికైన క్రీడాకారులందరినీ అభినందిస్తూ, జాతీయ స్థాయిలో విశాఖ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి, మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదే విధంగా బోధిధర్మ యుద్ధకళాక్షేత్ర అధ్యక్షుడు వెంకట్రావు క్రీడాకారుల కృషిని ప్రశంసిస్తూ, నిరంతర సాధనతో జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని సూచించారు.

# పాడి రైతులకు హెరిటేజ్ డైరీ బోనస్, క్యాన్లు పంపిణీ



**మునగపాక జనవరి 14, మనసులో మాట..** పాడి రైతులకు సంక్రాంతి బోనస్ మరియు స్టీల్ క్యాన్ల పంపిణీ మునగపాక మండలం రాజుపేట గ్రామంలో హెరిటేజ్ డైరీ కి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతు హెరిటేజ్ డైరీ మేనేజర్ కూంద్రపుశేషు 24 పాడి రైతులకు సంక్రాంతి బోనస్ 2.10 రెండు లక్షలు 20వేలు రూపాయలు మరియు స్టీల్ క్యాన్లు పంపిణీ చేశారు మాట్లాడుతూ హెరిటేజ్ డైరీ లో పాలు సరఫరా చేస్తున్న ప్రతి పాడి రైతుకు కృత్రిమ గర్భధారణ రాయితీ పైన రూపాయలు 50/లకే చెయ్యబడును అదేవిధంగా కృత్రిమ గర్భధారణ (ఆడ దూడ పోట్టేటందుకు) రాయితీ పైన 500 రూపాయలు లకు చెయ్యబడునుమ హెరిటేజ్ డైరీ అన్ని విధాలుగా రైతు కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు అంతేకాకుండా హెరిటేజ్ డైరీ లో సభ్యత్వం ఉన్న పాడిరైతుకు యాక్సిడెంట్లో మరణించినట్లయితే రెండు లక్షల రూపాయలు అదేవిధంగా సహజం సహజంగా మరణిస్తే అయితే 50 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమముల హెచ్పిఆర్ శ్రీనివాసరావు సంతోష్ సూరిప్పారావు అప్పారావు ముసలి నాయుడు మహాలక్ష్మి వెంకు నాయుడు మొదలైన రైతులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని
# భోగిమంటల్లో విక్రాంజీ జీవో కాపీలు దగ్ధం

### సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ



**మునగపాక జనవరి 14, మనసులో మాట..** మునగపాక. ఉపాధి హామీ పథకం పై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పద్ధతులు రద్దుచేసి ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మునగపాక మండలం వెంకటాపురం గ్రామంలో బుధవారం భోగిమంటల్లో జి రామ్ జి పథకం జీవో కాపీలు దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చి వికసిత భారత్ జి రామ్ జి గా మార్చింది. దీనివలన ఉపాధి కూలీలకు ఉపయోగం లేదని జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధాతంగా కొనసాగించాలని పని కోరే హక్కు గ్రామసభకు అధికారులు గతంలో వలె కొనసాగించాలని ఉపాధి హామీ మార్పులు చేయాలనుకుంటే ప్రజలతో విస్తృత చర్చలు 200 రోజులు పని 600 రూపాయలు కూలి వంటి ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్ని. అప్పారావు, బి. శ్రీనివాసరావు, నూక అప్పారావు, కనకారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద ఉప్పలంలో స్వామివారికి పల్లకీ సేవ

**ఎస్. రాయవరం, జనవరి14(మనసులో మాట)..** ఎస్. రాయవరం మండలం పెద్ద ఉప్పలంగ్రామంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా గ్రామస్తులు బుధవారం నగరసంకీర్తన నిర్వహించారు.గ్రామంలోని మధ్యవీధి రామకోవెల ఆలయకమిటీ అధ్వర్యంలో సీతారాముల పల్లకి సేవ నిర్వింపహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అంతా జైశ్రీరామ్ నినాదాలుతో గ్రామంలో నగరసంకీర్తన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామపెద్దలుతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యాన
# పేదలకు దుప్పట్లు పంపిణీ




**అనకాపల్లి, జనవరి 14 (మనసు లో మాట):** స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ లో బుధవారం అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి పర్వదినాన 300 మంది పేదలకు దుప్పట్లు ను బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షులు బి.ఎస్.ఎం.కె జోగినాయుడు పంపిణి చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు బిఎస్ఎంకె జోగినాయుడు మాట్లాడుతూ ప్రతి ఏటా వలె ఈ ఏడాది చేపట్టే సేవా కార్యక్రమాలలో భాగంగా పేదలకు దుప్పట్లు పంపిణి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో క్లబ్ కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, బుద్ద రామా, బుద్ధ శ్రీనివాసరావు, కె సూరి జగ్గారావు, మల్ల రామారావు, బొడ్డు శివ, యల్లపు రాము,క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాల్తేరు గ్రామంలో యువకులకు క్రికెట్ వాలీబాల్ కిట్లు పంపిణీ



**పాయకరావుపేట జనవరి 14 మనసులో మాట..** పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామంలో యువకులకు ప్లేయింగ్ కిట్లు పంపిణీ జరిగింది. దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు సమకూర్చిన క్రికెట్ వాలీబాల్ కిట్లను గ్రామ పెద్దలు యువకులకు అందజేశారు. క్రీడలలో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని తెలిపారు.

# కైలాసపట్నంలో ముగ్గుల పోటీలు



కోటవురట్ల (మనసులో మాట) జనవరి14: సంక్రాంతి సందర్భాన్ని పురస్కరించుకొని కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో బుధవారం సాయంత్రం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. రాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొన్నారు.వారు వేసిన రంగురంగుల హరివిల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగలో ముగ్గులకు విశిష్ట స్థానం ఉందన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు ఏర్పాటుచేసిన నిర్వాహకులను అభినందించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ చామంతుల శ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల సత్తిబాబు పాల్గొన్నారు.

# తీడ ఎన్టీఆర్ తీర్థ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల



**కశింకోట, జనవరి 14 మనసులో మాట..** మండలం లోని, తీడ గ్రామంలో భోగి పండుగ, ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం సందర్భంగా మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ఎన్టీఆర్ తీర్థం సందర్భంగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తీడ గ్రామంలో కూటమి నాయకులతో, ప్రజలతో కలిసి ఈ తీర్థం సందర్భంగా కూటమి శ్రేణులు, ప్రజలతో కలిసి భోగి పండుగలో, ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ,మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిలికి చైతన్య, చిలికి సన్యాసిరావు, కలగ గోవింద కూటమి నాయకులు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.




యువకులను ఆత్మీయంగా కలిపేందుకే

## సంక్రాంతి విలేజ్ క్రికెట్ టోర్నమెంట్

**సబ్బవరం, జనవరి 14, మనసులో మాట:** అంతకాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన యువకులు ఉద్యోగరీత్యా ,వ్యాపార రీత్యా, ఇతర కారణాలతో పట్టణాలకు వలస వెళ్లారని, ఏడాదిక ఒకసారి వారందరినీ ఆత్మీయంగా కలపాలనే సంకల్పంతోనే అంతకాపల్లి లో సంక్రాంతి విలేజ్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నామని ప్రముఖ పరిశ్రమకు వేత్త, లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ షిప్పింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, బిజెపి నేత చొక్కాకుల .వెంకటరావు అన్నారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ క్రికెట్ టోర్నమెంటును ఆయన బుధవారం బ్యాటింగ్ చేసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ , ఆయన తమ గ్రామపంచాయతీలో అంతక పల్లి, ఓమివానిపాలెం, రావులమ్మ పాలెం, శివారుగా గ్రామాల యువకులు ఉన్నత విద్య కోసం, వ్యాపారాల కోసం, వృత్తిపరమైన పనుల కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళుతున్నట్లు పేర్కొన్నారు. వారంతా తమ సొంత గ్రామము అభిమానం తో ఈ పోటీల్లో ప్రతి సంక్రాంతి పర్వతనానికి వచ్చి పాల్గొని ప్రదర్శించి కప్పు గెలుస్తారని తెలిపారు.
ఇక్కడ నిర్వహించే పోటీల్లో విజేతలకు ఫస్ట్ ప్రైస్ 20 వేల నగదు, షీల్డ్, సెకండ్ ప్రైజ్ 15 వేలు, షీల్డ్, తడి ప్రైజ్ 10,000 నగదు, మెమెంటు, ఫోర్త్ ప్రైస్ 5 వేల రూపాయల నగదు, జ్ఞాపికలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇవి కాకుండా, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలింగ్, బెస్ట్ బ్యాటింగ్ , క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. మొత్తం 15 జ ట్లు ఈ పోటీల్లో తెలపడనున్నట్లు ఇ క్కడ పోటీల ఆర్గనైజర్ చీపురుపల్లి. ఎస్ ఎస్ ఎస్ నాయుడు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంతక పల్లి గ్రామ సర్పంచ్ ఎస్ .నారాయణమూర్తి మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి, లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ ఎండి చొక్కాకుల వెంకటరావు సోదరులు ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రెసెంసించారు. సబ్బవరం మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు మాజీ అధ్యక్షులు మాజీ అధ్యక్షులు మిరతాడ. మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, తమ గ్రామంలో యువతను ప్రోత్సహించేందుకు విలేజ్ కప్పు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న వెంక టరావు సోదరులను అభినందించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి , రొంగలి దేముడు, మాజీ ఎంపీపీ ఎస్ ముత్యాల నాయుడు, మాజీ సర్పంచ్ ఎస్ దేముడు, పిఎసిఎస్ సీఈవో గొంప రమణ, ఉపసర్పంచ్, గొర్లి అప్పారావు లు పాల్గొన్నారు.

## ఎంజిఎన్ఆర్ఈజిఎ పేరు మార్పు తగదు

కొత్తగా తీసుకొచ్చిన జి రాంజీ చట్టం పత్రాలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దగ్ధం చేసిన ఉపాధిహామీ కూలీలు



**అరకులోయ, జనవరి 14 (మనసులో మాట):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు పేరు మార్పు తగదని ఉపాధ్యామి పథకం పేదల హక్కు అని సిపిఎం పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స అన్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లాఅరకులోయ మండలం పెద్దలబుడు,శరభగూడ గ్రామాల్లో సి. పి. ఎం అరకులోయ మండల నాయకులు మగ్గన్న నేతృత్వంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం( ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎ)ను రద్దు చేసి తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) ( వి బి- జి ఆర్ ఏ ఎం జి ) చట్టం ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి. పి. ఎం పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స మాట్లాడుతూఇది గ్రామీణ కార్మికుల ఉపాధి హక్కులపై తీవ్ర దాడి అని ఆరోపించారు. అప్పటి యూపీఏ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ పథకం ప్రస్తుత ఎన్డిఏ బిజెపి ప్రభుత్వం రద్దు చేసి ఆ స్థానంలో విబి జి ఆర్ ఏ ఎం జి చట్టాన్ని తీసుకు రావడం కూలీల హక్కును కాలరాయడమేనని కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆయన మండిపడ్డారు. కూలీలహక్కు ఆధారిత చట్టం నుంచి సరఫరా ఆధారిత పథకంగా మార్చి కేంద్రం నియంత్రణ పెంచుతూ రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతుందని అప్పల నరస విమర్శించారు.
పనిదినాలు పెంపు పేరుతో ( వంద నుంచి 125 రోజులకు) చట్టాన్ని మార్చారని చెబుతున్నారని అయితే వాస్తవంగా 50 రోజులు పనిదినాలు కూడా లభించడం లేకపోవడంతో కనీస వేతనం 34 రూపాయలు రావాల్సి ఉండగా కనీసం 200 రూపాయలు కూడా కూలీలకు రావడంలేదని అందుకు చట్టాన్ని మార్చాల్సిన అవసరం ఏమిటని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకాన్ని మెరుగుపరచాల్సింది పోయి కూలీలకు ఉపయోగపడే చట్టాన్ని రద్దు చేయడం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్నివిమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్, మండల నాయకులు జగన్నాథం, హరి , రాము,గోపాల్, సహదేవ్, ఆనంద్, ప్రసాద్, ఆనంద్,పరశురాం,దేవా, మోహన్ గణేష్,గోపి, తదితరులు పాల్గొన్నరు.

# అనకాపల్లి లో ఘనంగా శోభన్‌బాబు జయంతి





**అనకాపల్లి, జనవరి 14 (మనసు లో మాట):** అనకాపల్లి పట్టణంలో బుధవారం పలు చోట్ల ప్రముఖ సినీ నటులు సోభన్ బాబు 90 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా చినరాజుపేట చౌడేశ్వరీ సాంబశివాల యం ప్రాంగణం లో సోభన్ బాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి సిద్దార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిరుపేదలకు దుస్తులను పంపిణి చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా బల్లా నాగభూషణం మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో సోగ్గాడు శోభ నాద్రి గా, నటభూషణ్ గా దాదాపు 250 చిత్రాలలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలను పోషించి, ప్రభుత్వ నంది బహుమతులు, ఫిలిం ఫేర్ అవార్డులు అందుకున్న గొప్ప నటుడు శోభన్ బాబు కి ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిద్దార్ధ అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, సభ్యులు పోతిన బుజ్జి, బూడిద జోగారావు పాల్గొన్నారు.

**విజయరామరాజుపేట లో.....**

స్థానిక విజయరామరాజుపేట లో అందాల నటుడు నటభూషణ్ శోభన్ బాబు జయంతి వేడుకలు అభిమాన సంఘం అధ్యక్షులు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా శోభన్ బాబు చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్, పళ్ళ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలకా రాము, బొబ్బిలి అప్పారావు, ఆళ్ల రామకృష్ణ, పిట్ల బుద్దేశ్వరరావు, పిట్ల గుద్దేశ్వరరావు, పలకా సత్యనారాయణ, పల్లా శ్రీను, అప్పికొండ వెంకట్రావు, పూడి త్రినాథ్, పల్లా సత్య అప్పారావు, పసుపులేటి అప్పారావు, బొబ్బిలి గోవింద్, విత్తనాల పోతురాజు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ పునః ప్రారంభోత్సవ వేడుకలు

- తారువలో వైభవంగా ఆధ్యాత్మిక శోభ
- స్వామివారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు
- భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం



**దేవరాపల్లి, జనవరి 14 (మనసులో మాట) :** మండలంలోని తారువలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ పునఃప్రారంభోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. తెల్లవార జాము నుంచి నూతన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ముందుగా మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు, ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్, వైఎస్సార్సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ తదితర గ్రామ పెద్దలు భక్తాంజనేయ స్వామి వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అలాగే గ్రామస్తులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధ నకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయ కులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరిం చారు. స్థానిక రాయాలయం ఆవర ణలో నిర్వహించిన మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. వెరసి గ్రామంలో శ్రీరామ నామం, హనుమాన్ నామస్మరణం మారుమ్రోగింది. దీంతో తారువ గ్రామంలో భోగి పర్వదినాన ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

## అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- వాకపల్లిలో ఉత్సాహంగా కోలాట పోటీలు



**దేవరాపల్లి, జనవరి 14, (మనసులో మాట) :** మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. భోగి పండుగను ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. మూడు రోజులు పాటు ముచ్చటగా జరిగే ఈ సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా గ్రామాల ప్రజలు అన్ని ఏర్పాట్లను చేశారు. మండలంలోని వాకపల్లి గ్రామంలో శ్రీరాముల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉత్సాహంగా కోలాట పోటీలను నిర్వహించారు. ఈ కోలాటం పోటీల్లో 15 మహిళా బృందాలు పాల్గొని అందరినీ అలరించారు. ఈ పోటీలో గెలుపొందిన బృందాలకు భారీ నగదు బహుమతులను గ్రామస్తులు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 16,17, 18 తేదీల్లో గ్రామంలో శ్రీరాముల తీర్ధ ఉత్సవాలు జరుగుతాయని ఈ కార్యక్రమంలో భాగంగా 15న మహిళలకు ముగ్గులు పోటీలు, 16 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ (మేట్) పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుగత వెంకటరమణ, ఎంపీటీసీ గొరపల్లి భాస్కరరావు, మాజీ సర్పంచ్ బుదిరెడ్ల అప్పారావు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు బుగత నాగేశ్వరరావు, దొగ్గ నానాజీ, మామిడి గణేష్, బుగత కాశీ, ద్వారపరెడ్డి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే బలి పండుగ విశిష్టత

- ఘనంగా ముగిసిన బలి పండగ





**హుకుంపేట జనవరి 14 (మనుసులో మాట)..** ఏజెన్సీ ప్రాంతాల్లో మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే బలి పండుగ విశిష్టత ఏజెన్సీ ప్రాంతాల్లో తాతలుముత్తాతల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న బలి పండుగను అక్కడి ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. ఈ పండుగను ప్రతి సంవత్సరం కాకుండా మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించడం ప్రత్యేకత.
ప్రతి సారి డిసెంబర్ 23 నుంచి జనవరి 3 వరకు సుమారు 11 రోజుల పాటు వందలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా జరుపుకుంటారు. రైతులు సంవత్సరం పొడవునా కష్టపడి పండించిన పంటలు సమృద్ధిగా ఇంటికి చేరిన ఆనందాన్ని వ్యక్తం చేయడానికి ఈ పండుగను జరుపుతారు. ముఖ్యంగా జొన్న విత్తనాలు వేసిన తరువాత మంచి దిగుబడి రావాలని కోరుకుంటూ ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీ.
ఈ పండుగలో మట్టితో నంది ఆవును తయారు చేసి, గౌరమ్మ తల్లిగా ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహిస్తారు. గతంలో గత్తుం పట్టాం, వెంగడ, మజ్జివలస, బూర్జ, ఈదుల పుట్టు, గోమంగి, మాడగాడ, ఒరిస్సా ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా గత్తుం పంచాయతీ లోనే మూడు సంవత్సరాలకు ఒకసారి బలి పండగకు వచ్చేవారు.
అయితే ఈ సంవత్సరం భిన్నంగా పట్టాం, వెంగడ, మజ్జివలస, బూర్జ, పలు గ్రామాల్లో విడివిడిగా బలి పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్లు, మేకలు వంటి బలులు సమర్పించి, శివరి రోజు ప్రతి గడవగడవకు ఊరేగింపు అనంతరం. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలతో నృత్యాలు చేస్తూ భక్తులకు భోజన వసతులు కల్పించారు. పంటలు బాగా పండిన ఆనందాన్ని ప్రతిబింబించే పండుగగా బలి పండుగ ఇప్పటికీ ప్రజల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది.



ముచ్చటైన పల్లె పండుగలు

## భోగి, సంక్రాంతి, కనుమ

- గ్రామీణ పల్లెల్లో సంబరాల సందడి
- తెలుగువారి సాంప్రదాయ ప్రతీక తీర్దాలు

దేవరాపల్లి, జనవరి 14, (మనసులో మాట) : సాంప్రదాయానికి అర్థం చెప్పే పండుగ. తెలుగువారికి పెద్ద పండగ.. ఎక్కడున్నా అందరూ ఒక్క చోటికి చేరి చేసుకునే పండుగ.. సంక్రాంతి పండుగ. సందడిని తెస్తూ అంబరా న్నంటే విధంగా సంబరాలు చేసుకో మని చెప్పే పండుగ సంక్రాంతి. పంటతల్లి ఇంటికొచ్చే పండుగ.. పదిమంది పంచుకునే ఫలితం. భూమి తల్లి ఇచ్చే భోగభాగ్యాలు.. సంక్రాంతి తెస్తుంది ధాన్యపురాశులు. ఇదీ మూడురోజుల పాటు ముచ్చటగా సందడిగా జరుపుకొనే సంక్రాంతి పండుగ సందర్భం. సంక్రాంతి పండుగకు నెలరోజుల ముందే ఇళ్లల్లో హడావిడి మొదల వుతుంది. మూడురోజుల పండుగను ఆస్వాదించడానికి ఎదురు చూపులు చూస్తారు. సాంప్రదాయాలకు నెలవైన పండుగ. తెలుగువారి సంస్కృతికి అద్దం పట్టే పండుగ. ఏ పండుగకు ఎలాగున్నా.. ఈ పండుగలో సంప్రదాయానికే ప్రాధాన్యత నిస్తారు. భోగి మొదలు ముక్క నుమ వరకు ఇంట్లో సందడే సందడి. కొత్త అల్లుళ్లు.. కొంటె మరదలు కోడి పందాలు.. పిండి వంటలు.. సరదా ఆటలుడి సాంప్రదాయ పనులుడెఅన్నీ సంక్రాంతిలో భాగమే. ఇవన్నీ ఒకెత్తైతే డూడూ బసవన్నలు, హరిదాసుల రాకలు ఊరికి దేవుళ్ల రూపంలో అతిధులొచ్చినట్లు గా తెలుగువారు భావించే సమయం.

మునగపాక వెంకటేశ్వర స్వామి

## గుడి నిర్మాణానికి విరాళం

విరాళాలు అందజేస్తున్న మద్దాల వీరు నాయుడు



**మునగపాక, జనవరి 14, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక శ్రీ వేంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి టి. శిరసపల్లి గ్రామం వాస్తవ్యులు మద్దాల వీరునాయుడు రూ.10,000/-చందా ఇవ్వడం జరిగింది. వారికి వారి కుటుంబానికి శ్రీ శ్రీ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా కలగాలని కోరుకుంటూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బొడ్డేడ ప్రసాద్, సూరిశెట్టి కన్నారావు, దాడి ముసలి నాయుడు, ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు,కాండ్రేగుల జగ్గారావు, బొడ్డేడ రామునాయుడు, పెంటకోట ఉమేష్, ఆడారి కాశి బాబు, అలంక సూర్య ప్రకాశరావు, దాడి శ్రీరామ్ మూర్తి పలువురు పాల్గొన్నారు.

## విజయవంతంగా 71 వ సిబిసిఎన్‌సి క్రైస్తవ మహాసభ




**నర్సీపట్నం రూరల్, జనవరి 14, (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో సంఘ కార్యవర్గ సహకారంతో బుధవారం నిర్వహించిన 71 వ సాంవత్సరిక మహాసభ విజయవంతంగా జరిగింది . అవనిగడ్డ నుండి సోంపేట వరకు ఏడు జిల్లాలలో విస్తరించి ఉన్న సి బి సి ఎన్ సి చర్చిల నుండి నాయకులు ,పాస్టర్లు, రాయబారులు పాల్గొని అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సి బి సి ఎన్ సి కార్యదర్శి ఆధ్వర్యంలో సి బి సి ఎన్ సి ప్రెసిడెంట్ టి. ఐజాక్. అధ్యక్షతన రెవరెండ్ డాక్టర్ కొత్తపల్లి అబ్రహాం దైవ సందేశం తో, భక్తిశ్రద్ధలతో స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ సహకారంతో నిర్వహించారు. ఈ సభలో వైస్ ప్రెసిడెంట్ కే.సుభద్ర ,ఆర్ ట్రస్ట్ చైర్మన్ కె. కృష్ణమూర్తి ,గోదావరి అసోసియేషన్ ప్రెసిడెంట్, రెవరెండ్ డాక్టర్ మీరా జేసుదాస్, సి బి చర్చ్ ప్రెసిడెంట్ ఎన్. ఆర్. నవీన్ కుమార్, సెక్రెటరీ పి. దేవానంద్, ట్రెజరర్ సాల్మన్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ ఎన్. వయోలా లిలియన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొల్లేటి వెంకట భోగేశ్వర రావు జన్మదిన వేడుకలు

**కేక్ తినిపిస్తున్న జనసేన ఉత్తరాంధ్ర అధికార ప్రతినిధి సుందరపు సతీష్**

**మునగపాక, జనవరి 14, మనసులో మాట..** పాటిపల్లి గ్రామం జనసేన అధినేత, బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు మొల్లేటి బోగేస్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఇంటిదగ్గర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉత్తరాంధ్ర అధికార ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ కేక్ కట్ చేసి బోగేసుకు తినిపించారు. మరిన్ని పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేత దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కోడే గెలిచింది



- ▸▸ ఎటు చూసినా కోడి పందేలు బరులు
- ▸▸ ప్రతీ బరిలో గుండాటలు
- ▸▸ చేతులెత్తేసిన పోలీసులు
- ▸▸ రాజకీయం ముందు తలవంచిన అధికారం





**ముమ్మిడివరం(మనసులో మాట) జనవరి 14:** ముమ్మిడివరం నియోజకవర్గం లో సంక్రాంతి సందడి కోడిపందేల బరుల్లోనే కనిపిస్తోంది. పండుగ సంప్రదాయం పేరుతో నిర్వహించే కోడి పందేల కోసం ముమ్మిడివరం, కాట్రేనికోన, తాళ్లరేవు, ఐ. పోలవరం లో ఘనంగా ప్రారంభమయ్యాయి.ముమ్మిడివరం లో రాజుపాలెం, కొత్తలంక, అన్నంపల్లి, లంకాఫ్ ఠాణేలంక ఐ. పోలవరం లో మురముళ్ల, కేశనకుర్రు కాట్రేనికోన లో గెద్దనాపల్లి, పల్లంకుర్రు, కందికుప్ప, తాళ్లరేవు లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి.

హైకోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, గ్రామాల్లో బరులు భారీగా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది బరుల సంఖ్య గతంతో పోలిస్తే భారీగా పెరగడం విశేషం. కోనసీమ జిల్లాలోనే గతేడాది 70వరకు ఉన్న బరులు, ఈసారి 200 వరకు పెరిగినట్లు తెలుస్తోంది. ఒక్కో బరి వద్ద కోట్లాది రూపాయల పందేలు సాగనున్నాయి.

పందేల కోసం నిర్వాహకులు ఫైవ్ స్టార్ హోటల్ రేంజ్లో హంగులు అద్దారు. 5 నుంచి 10 ఎకరాల విస్తీర్ణంలో బరులు ఏర్పాటు చేసి, విదేశీ పర్యాటకులు, ప్రముఖుల కోసం వీఐపీ లాంజ్లు, ఏసీ గదులు, ఎల్ఈడీ స్క్రీన్లు, రాత్రి వేళల కోసం ఫ్లడ్ లైట్లు సిద్ధం చేశారు. కేవలం పందేలే కాకుండా, గుండాట, పేకాట వంటి జూద క్రీడలకు కూడా ప్రత్యేక స్థావరాలు వెలిశాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి పందెగాళ్లు తరలి వస్తుండటంతో ఇప్పటికే గోదావరి జిల్లాల్లోని హోటల్ రూమ్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి.

**పందెం పుంజులు అమ్మకాలు:**
పందెం కోళ్ల విక్రయాలు కూడా రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. జాతి కోళ్లకు రూ. 30 వేల నుంచి రూ. 2లక్షల వరకు ధర పలుకుతోంది. ముఖ్యంగా కత్తులు కట్టి నిర్వహించే పందేల కోసం పందెం రాయుళ్లు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. కొన్ని చోట్ల నిర్వాహకులు విజేతలకు బుల్లెట్ బైకులు, కార్లను బహుమతులుగా ప్రకటిస్తూ పందెగాళ్లను ఆకర్షిస్తున్నారు.కోనసీమ జిల్లాలో కేవలం భోగి రోజే సుమారు రూ. 20 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- ముఖ్య అతిథిగా కుటుంబ సమేతంగా విచ్చేసిన ఎస్పీ డీ నరసింహ కిషోర్ - పోలీసు కుటుంబాలలో నిండిన నూతనోత్సాహం

- సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోలీసు కుటుంబాలకు సంప్రదాయ క్రీడలు, ముగ్గుల పోటీలు







**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** రాజమహేంద్రవరం జిల్లా పోలీసు కార్యాలయంలో గల పోలీసు పరేడ్ మైదానంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్, ఆయన సతీమణి, కుటుంబ సభ్యులతో కలసి ముఖ్య అతిథులుగా హాజరై భోగి మంటలు వెలిగించి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. నిత్యం పని ఒత్తిడిలో కనిపించే పోలీసు మైదానం, సంక్రాంతి సందడితో ఒక్కసారిగా పల్లెటూరి వాతావరణాన్ని తలపించింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ అందరూ కలిసి ఆనందాన్ని పంచుకునే గొప్ప సందర్భమన్నారు. ఇలాంటి వేడుకలు పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో కలిగే ఒత్తిడిని తగ్గించి, మానసిక ఉల్లాసాన్ని, నూతనోత్సాహాన్ని నింపుతాయని ఆయన అభిప్రాయ పడ్డారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ సంక్రాంతి వేడుకల్లో భాగంగా మహిళా పోలీసులు, పోలీసు కుటుంబ సభ్యులు వేసిన రంగవల్లులు (ముగ్గులు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం చివరిలో వివిధ పోటీల్లో పాల్గొన్న సిబ్బందికి, వారి పిల్లలకు ఎస్పీ దంపతులు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్ చెంచి రెడ్డి, డీఎస్పీ (ఎస్ బీ) బీ రామకృష్ణ, జోనల్ డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐ లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా తిరువాభరణోత్సవం

- స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో మార్మోగిన రాజమహేంద్రవరం
- అడుగడుగునా భక్తుల నీరాజనం...
- అలరించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు..
- అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దర్శనమిచ్చిన మకరజ్యోతి
- తిరువాభరణోత్సవంలో పాల్గొన్న జక్కంపూడి కుటుంబ సభ్యులు...




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఎంతో శోభాయమానంగా అయ్యప్ప స్వామి వారి తిరువాభరణో త్సవములు ఆద్యంతం ఎంతో రమణీయంగా కొనసాగాయి. ఎన్నో కళలకు సంస్కృతి సంప్రదాయాలకు నెలవైన రాజమహేంద్రవరంలో అయ్యప్ప స్వామి వారి తిరువాభరణోత్సవాల కార్యక్రమం శ్రీ ధర్మశాస్తా ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ లో దివంగత నేత జక్కంపూడి రామ్మోహన రావు నివాసంలో అయ్యప్ప స్వామి, అమ్మవారి తీరువాభరణాలను గురుస్వాముల పర్యవేక్షణలో కొత్తపల్లి భుజంగ రాయులు, సింధు సహస్ర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీరువాభరణాలను బైపాస్ రోడ్డులోని ఆలయ ధర్మకర్త మండలిలో సభ్యుడైన బళ్ళ సత్యనారాయణ స్వగృహానికి తీసుకెళ్లి, కేరళ పంచారి మేళం, కోలాటాలు, డోలు సన్నాయి, మేళ తాళాలు ఆశేష భక్తజనుల నడుమ ఊరేగింపుగా బయలు దేరి, నందం గనిరాజు జంక్షన్, కంబాల చెరువు, దేవిచౌక్ మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్, విశ్వేశ్వర స్వామి ఆలయం మీదుగా అయ్యప్ప స్వామి వారి ఆలయానికి చేరుకుని స్వామి వారి ఆభరణాలను పూజారులకు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు నంబుద్రి సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు గావించి స్వామి వారికి తిరువాభరణాలను అలంకరణ చేశారు.

తిరువాభరణా ఘట్టం పూర్తయ్యాక మకరజ్యోతి రూపంలో అయ్యప్ప స్వామి భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ ప్రాంగణమంతా స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో



ప్రతిధ్వనించాయి. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ దివంగత నేత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన రావు శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక కేంద్రం అనే ట్రస్టును ఏర్పాటు చేసి పవిత్ర గోదావరి నదీ తీరాన రాజమహేంద్రవరంలో శబరిమలలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించి అయ్యప్ప స్వామివారి విగ్రహాన్ని పంచ లోహంతో తయారు చేయించి శబరిమల ఆలయంలో ఎటువంటి పూజలు నిర్వహిస్తారో అదే మాదిరిగా ప్రతి రోజు ఈ ఆలయంలోస్వామి వారికి పూజా కార్యక్రమలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి ఏడాది శబరిమాల అయ్యప్ప స్వామి ఆలయంలో ఏ విధంగా అయితే స్వామి వారి తీరువాభరణోత్సవం, మకర జ్యోతి దర్శనం జరుగుతుందో అదే మాదిరిగా ఈ ఆలయం నందు కూడా జ్యోతి దర్శనం, ప్రతి ఏడాది అయ్యప్ప స్వామి వారికి ప్రీతికరమైన తిరువాభరణోత్సవం ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు. మన రాష్ట్రానికి సంబంధించిన భక్తులే గాక ఇతర రాష్ట్రాల నుండి అనేక మంది భక్తులు వివిధ కారణాల వలన పవిత్ర పుణ్యక్షేత్రమైన శబరిమలకు వెళ్లలేని భక్తులు ఇక్కడకు వచ్చి స్వామివారి దీక్ష విరమణ చేస్తున్నారన్నారు. ప్రతి ఏటా ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ పెరుగుతోందని, ప్రతి సంవత్సరం విజయ దశమి రోజు నుండి జ్యోతి దర్శనం వరకు ప్రతి రోజు సుమారు 1500 మంది నుండి 2000 మంది అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం కార్యక్రమం చేస్తూ ఈ ఏడాది 1,45,000 మందికి అన్నదానం కార్యక్రమం చేశామని, రానున్న రోజుల్లో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. తిరువాభరణోత్సవంలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో తీసుకువచ్చి సాయంత్రం 6:15 గంటలకు స్వామివారికి సమర్పించడం జరిగిందని తెలియజేశారు.సాయంత్రం 6:45 గంటలకు ఆలయంలో మకర జ్యోతి దర్శనంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించడం జరిగిందన్నారు. శ్రీ అయ్యప్ప స్వామివారి ఆశీస్సులు కరుణాకటాక్షాలు అందరి మీదా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగిందని, ఎంతో ఘనంగా నిర్వహించిన ఈ ఉత్సవాలకు కారకులైన ఆలయ ట్రస్టు సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.





## చోడవరంలో ఘనంగా

# సంక్రాంతి సంబరాలు

### కోడిపందాలను ప్రారంభించిన భద్రాచలం ఎమ్మెల్యే, ఎటపాక వైస్ ఎంపీపీ

**ఎటపాక, ( మనసులో మాట), జనవరి 14:** పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని చోడవరంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ముందుగా గోదావరి జిల్లాలలోని సాంప్రదాయంగా జరిగే కోడిపందాలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ప్రారంభించారు. గోదావరి జిల్లాలలో సాంప్రదాయబద్ధంగా జరిగే సంక్రాంతి సంబరాలలో కోడి పందాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ప్రజలందరూ ఎటువంటి భాగోద్వేగాలకు లోనవ్వకుండా అందరూ సంతోషంగా కోడిపందాలు జరుపుకోవాలని ఎటువంటి గొడవలు పై కానీ కొట్లాటలకి కానీ చోటు లేకుండా అందరూ కలిసికట్టుగా పండుగను జరుపుకోవాలని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు ముప్పా శ్రీను, పెనుబల్లి సాయిబాబు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, పాయం దేవి మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

### -రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ - చిక్కాల బాబులు నివాసంలో దుస్తులు పంపిణీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేట మాజీ ఉప సర్పంచ్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల కమిటీ కన్వీనర్ చిక్కాల బాబులు ఆధ్వర్యంలో రామకృష్ణా నగర్లోని ఆయన నివాసంలో సంక్రాంతి సందర్భంగా బుధవారం పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు, పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ విచ్చేశారు. మంత్రి చేతుల మీదుగా పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల మాట్లాడుతూ మాజీ ఉప సర్పంచ్, జనసేన పార్టీ నాయకుడిగానే కాకుండా చిక్కాల బాబులు తనకు అత్యంత ఆత్మీయుడని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి మెరుగైన వేతనాలు అందించడంతో పాటు వారి ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషిచేస్తుందని భరోసా ఇచ్చారు. వారి సేవలను గుర్తించి బాబులు దుస్తులు, స్వీట్లు అందజేయటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. బాబులు కుటుంబ సభ్యులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి రావాలని, ప్రతీ ఏటా నిర్విఘ్నంగా ఈ కార్యక్రమం కొనసాగాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తోందన్నారు. ప్రతినిత్యం ఏదో ఒక కార్యక్రమం చేపట్టి ప్రజలను భాగస్వాములుగా చేస్తూ టూరిజం శాఖాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పనిచేసేందుకు తనకు అవకాశం రావడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, స్థానిక పెద్దలు, బాబులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనను సమర్పించండి



**ఏలూరు/దెందులూరు, జనవరి, 13(మనసులో మాట)..** దెందులూరు నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాద నలు వెంటనే రూపొందించి పంపాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి డా. ఎన్ . యువరాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. దెందులూరు మండలం సోమవరప్పాడులో దెందులూరు నియోజకవర్గ ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలనను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, పరిశ్రమలు, రెవిన్యూ శాఖల అధికారులతో మంగళవారం సాయంత్రం డా. యువరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి డా. యువరాజ్ మాట్లాడుతూ సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలని, రోడ్డు, రైల్, విమాన రవాణా సౌకర్యాలకు అనుగుణంగా ఉన్న భూములను గుర్తించినట్లయితే త్వరితగతిన పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి, ఆ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో చింతలపూడిలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు శంఖుస్థాపన జరిగిందని, పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని మిగిలిన అన్ని నియోజకవర్గాలలోనూ ఎంఎస్ఎంఈ పార్క్ ల ఏర్పాటుకు త్వరితగతిన ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని డా. యువరాజ్ అధికారులను ఆదేశించారు. అనంతరం దెందులూరు గ్రామంలో ఏర్పాటుచేస్తున్న సానోస్ ఫార్మా పరిశ్రమ నిర్మాణాన్ని పరిశ్రమల శాఖ కార్యదర్శి డా. యువరాజ్ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో కలిసి పరిశీలించి,పరిశ్రమ వివరాలను డా. యువరాజ్ పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

# నీకొకటి... నాకొకటి

- బరులు పంచుకున్నారు
- కోట్ల లో పందేలు
- పందెం రాయుళ్ళకి సకల సౌకర్యాలు

**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 14:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 300 లకుపైగా పందెం బరులు సిద్ధమయ్యాయి. బుధవారం ఉదయం నుంచి పందెం కోళ్లు ఢీకొట్టనున్నాయి. పండగ మూడు రోజులు పాటు విచ్చల విడిగా కోడి పందేలు, జూద క్రీడలు కొనసాగేలా భారీ ఏర్పాట్లు చేశారు. దానికనగుణంగా ఎక్కడా పోలీసుల అభ్యంతరం లేకుండా అన్ని చక్కదిద్దేశారు. కొన్ని బరుల్లో కార్ల బహుమానం, మరికొన్ని చోట్ల ఏఏ సమయాల్లో ఏ స్థాయి పందేం జరుగుతుందో వివరాలను సైతం సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు బరుల్లో రూ.కోటి పందేలు నిర్వహించనున్నారు.

**పేకాట, గుండాట, శిబిరాలు:**

ఉమ్మడి జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో సంక్రాంతి పోటీల పేరిట నాలుగు రోజుల క్రితమే బరులను పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. మంగళవారం వరకు సంప్రదాయ పోటీలు నిర్వహించి బుధవారం నుంచి పందెం బరులుగా మారాయి. అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి నేతలే కీలకంగా వ్యవహరిస్తూ పోటీలు పడి మరీ భారీ బరులు ఏర్పాటు చేస్తున్నారు. హైకోర్టు నిషేధాజ్ఞల నేపథ్యంలో పోలీసులు మొక్కుబడిగా అక్కడక్కడ చిన్నబరులను ధ్వంసం చేసి పొలిటికల్ బరులవైపు కన్నెత్తి చూడకుండా ఉండేలా అన్ని సిద్ధం చేసి పందాలకు రెడీ అయ్యారు. ఈ ఏడాది కోడి పందేలల్లో పదుల సంఖ్యలో పేకాట, గుండాట, శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది నిర్వాహకులు భారీ ధరకు ముందస్తుగానే విక్రయించారు. కోనసీమ లో ఒక బరిలో జూదక్రీడలన్నీ కలిపి అత్యధికంగా రూ.1.40 కోట్లకు విక్రయించారని సమాచారం. ముమ్మిడివరం అమలాపురం, కొత్తపేట, రాజోలు , పి. గన్నవరం నియోజకవర్గాల్లో రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలు వరకు విక్రయాలు చేశారు

**ప్రజాప్రతినిధులే నిర్వాహకులు:**

జిల్లాలో ఈ సారి కీలక నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులే కీలక నిర్వాహకులుగా మారి పనులన్నీ నిర్వహించడానికి ఏజెన్సీలకు, జూదరులకు బరులు అప్పగించారు. ముమ్మిడివరం లో పలు చోట్ల నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నేతల సహకారంతో భారీ బరి ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు సిద్ధం చేసి ఆటలు మొదలు పెట్టేరు. జిల్లాలో కొన్ని చోట్ల మూడు రోజులు పాటు ఎక్కువ పందేలు గెలిచిన వారికి కారును, ఒక్కొక్క రోజు ఎక్కువ పందేలు గెలిచిన వారికి కారును బహుమతిగా ఇస్తున్నట్లు ప్రకటించారు రోజుకు సగటున 22 పందేలు రూ.25 లక్షల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు సమాచారం. సినీ సెట్టింగుల హంగులతో సహకారంతో మురముళ్ల లో బరి ఏర్పాటు చేశారు.

మినీ స్టేడియంను తలపించే రీతిలో ఏర్పాట్లు.. మంత్రులు, పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖుల కోసం ప్రత్యేకంగా మద్యం, మాంసం కోసం ప్రత్యేకంగా ఏసీ కంటైనర్లతో తాత్కాలిక గదులు, భారీ స్వాగత ద్వారాలతో కోడి పందేల బరులు.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో భోగి పండగ నుంచి మూడు రోజులు కోడి పందేలకు శ్రీకారం చుట్టేరు.పందేలతో పాటు పెద్ద ఎత్తున గుండాట, పేకాట శిబిరాలకు ఏర్పాట్లు చేశారు. వీటిలో ఎక్కువ శాతం కూటమి నేతలు పంచుకుని జేబులు నింపుకునే పనిలో పడ్డారు.

# అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధ్యాయులకు అందని డీఏ

- యూటీఎఫ్ జిల్లా శాఖ నిరసన

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** సంక్రాంతి సందర్భంగా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకి డీఏ బకాయిలను ఇటీవల జమ చేయగా, గతంలో కడియం మండలంలో పనిచేసిన 130 మంది ఉపాధ్యాయులకు అధికారుల అలసత్వం వల్ల అందలేదని జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈవీఎస్ఆర్ ప్రసాద్, ఏ షరీఫ్, జిల్లా కార్యదర్శి కే రమేష్ ఆరోపించారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2018 నుంచి బకాయిగా ఉన్న ఆరు విడతల డీఏలనును ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ ఖాతాలకు చెల్లించింది. అయితే కడియం మండలంలో గతంలో పనిచేసిన అధికారులు, మండల విద్యా వనరుల కార్యాలయంలో పనిచేస్తూ ఉన్న అకౌంటెంట్ నిర్లక్ష్యం వల్ల ఈ బిల్లు ఖజానాకు నివేదించబడలేదన్నారు. ఫలితంగా ఆ కాలంలో ఇక్కడ పనిచేసిన 130 మంది ఉపాధ్యాయులకు దాదాపు కోటీ 50 లక్షల మేర నిధులు చెల్లింపు జరగలేదన్నారు. దీంతో సీపీఎస్, ఓపీఎస్ ఉపాధ్యాయులు కూడా కడియం మండలంలో ఒక్కొక్కరు 50 నుంచి 70 వేల వరకు నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై యూటీఎఫ్ పక్షాన అనేక సార్లు అధికారులకు ప్రాతినిథ్యం చేసినా ప్రయోజనం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే ఉపాధ్యాయులకు డీఏ నిధులు వచ్చేటట్టు చేయాలని, బాధ్యులపై తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరం అయితే ఉపాధ్యాయులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని కడియం మండల యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీవీఎస్ శాస్త్రి, బీ అబ్బాయి హెచ్చరించారు.

## వైద్య కళాశాల పీపీపీ విధానాన్ని రద్దు చేసే వరకు

# పోరాటం ఆగదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు
- మాట తప్పినందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
- మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ జీవోలను భోగి మంటల్లో దహనం చేసిన సీపీఐ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలో పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి వీబీ రామ్ జీ పేరు పెట్టాడాన్ని నిరసిస్తూ ఆ జీవో ప్రతులను భోగిమంటల్లో వేసి దహనం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున స్థానిక ఆనంద్ నగర్, వేంకట నగరం ప్రాంతాలలో దహనం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, చర్యలను తూర్పారబట్టారు. ప్రతి పక్షంలో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం వైద్య విద్యకు పేదలకు దూరం చేసే పద్ధతుల్లో 107, 108 జీవోలను తీసుకువచ్చి వైద్య విద్యను 50 శాతం ప్రైవేటీకరణ చేస్తే, అప్పటిలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెట్టి పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న వైఎస్ఆర్సీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వంద రోజుల్లో 107, 108 జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి.. నేడు కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీలలో భాగంగా జీవోలను రద్దు చేయకపోగా, 100 శాతం వైద్య విద్యను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. పీపీపీ విధానం వల్ల కేవలం వైద్య విద్యార్థుల నష్టపోవడంతో పాటు సామాన్య ప్రజలు వైద్యం ఉచితంగా చేయించుకునే పరిస్థితి ఉండదన్నారు. వైద్య కళాశాల రాష్ట్రానికి వస్తే దాని పక్కనే ఒకటి ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటవుతుందన్నారు. దాని వల్ల సామాన్య ప్రజలు వైద్యం అందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. పీపీపీ విధానం వల్ల పేదలకు విద్యతోపాటు వైద్యం కూడా దూరం చేసేటువంటి పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఒక వైపు లక్షలలో ఖర్చుపెట్టి ఇంటర్ తో పాటు నీట్ శిక్షణకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసే చదివిస్తున్నారని, నీట్ అర్హతలు సాధించిన తరువాత వారికి పీపీపీ విధానం వల్ల రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో లేకుండా పోతాయని మండిపడ్డారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉండాల్సిన వైద్య విద్యను లాభాల కేంద్రంగా మార్చే ప్రయత్నం పీపీపీ విధానమన్నారు. రాష్ట్రంలో జీవో నెంబర్ 590 ద్వారా 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగాల్సిన ఈ వైద్య కళాశాలలను ప్రైవేట్ భాగ్యసామికే అప్పగించడం, ప్రభుత్వ భూములు భవనాలు మౌలిక సదుపాయాలు ఆసుపత్రులు దీర్ఘకాలం పాటు ప్రైవేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ విధానంలో యాజమాన్య కోటాలో సీట్లకు భారీ ఫీజులు విధించే అవకాశం ఉందని, దీని వల్ల పేద మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని నిరసన తెలిపారు. వైద్య విద్య సీట్లు పెరుగుతాయన్న ప్రభుత్వ హామీలు అబద్ధపు మాటలే అన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణను వేగవంతం చేసినట్లే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 107, 108, 590 రద్దు చేయాలని డిమాండు చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు నాంది పలుకుతామని..ఈ జీవోలను వెంటనే రద్దు చేయాలని భోగి మంటలలో వేసి దహనం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండవతి మంగ, సత్యవతి, సుబ్బలక్ష్మి, రమణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- రైతులకు అండగా ఉన్న పశు సంపద అభివృద్ధి చెందాలని, పంటలు బాగా పండి రైతుల లోగిళ్ళన్ని ధాన్యపు రాసులతో నిండాలని ఆకాక్షించారు
- ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు



**పల్నాడు, జనవరి 14, (మనసులో మాట):** తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకొని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పట్టణంలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన భోగి వేడుకల్లో పాల్గొని ప్రజలతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ముందుగా తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా భోగి మంటలను వెలిగించి పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పశు సంపద వృద్ధి చెందాలని పంటలు బాగాపండి పొలాలు కళకళలాడాలని, రైతుల లోగిళ్ళన్ని ధాన్యపు రాసులతో నిండాలని ఆకాంక్షించారు.

అనంతరం నరసరావుపేట పట్టణంలోని రిక్షా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటలను ఎమ్మెల్యే స్వయంగా వెలిగించి స్థానిక ప్రజలు కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ సంక్రాంతి పండుగ ఐక్యతకు, సాంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామీణ జీవన సంస్కృతిని గుర్తుచేసే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా, శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

తదుపరి మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో ఉత్సాహం గా పాల్గొన్నారు, గంగిరెద్దుల ఆటలు ప్రధాన ఆకర్షణ గా నిలిచాయి. శివుడు బొమ్మ వద్ద, పాతూరు శివాలయం వద్ద, నరసరావుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో ప్రత్యేకంగా పాల్గొన్న ఎమ్మెల్యే అక్కడి ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజల సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పండుగల సమయంలో పరస్పర స్నేహభావం, సోదరభావం మరింత పెంపొందాలని అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టానికి ఫలితం దక్కే విధంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సంక్రాంతి పండుగ రైతుల పండుగగా ప్రసిద్ధి చెందిందని, రైతులు సుఖసంతోషాలతో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# కోనసీమలో జోరుగా కోడిపందాలు

## ఒక్కో బరులో మూడు నుండి ఐదు గుండాట టేబుళ్లు





**అమలాపురం (మనసులో మాట) జనవరి 14..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం నుండి కోడిపందాలు జోరుగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల నుండి పోలీసులు కోడిపందాలు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదని హెచ్చరికలను లౌడ్ స్పీకర్లతో ఊదరగొట్టినా పోలీసులు కళ్ళు మూసుకోవడం తప్పలేదు. జిల్లాలో అమలాపురం, రాజోలు, పి గన్నవరం, ముమ్మిడివరం, కొత్తపేట, రామచంద్రపురం నియోజవర్గంలో భారీగా కోడిపందాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 150 కోడిపందాలు బరులు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కోడిపందాల నిర్వాహకులు బరుల్లో గుండాటలో పేకాటలపై ఎక్కువ దృష్టి పెట్టారు.ఎందుకంటే అధిక ఆదాయం వచ్చేది వీటిద్వారానే. అదేవిధంగా సాయంత్రం అయిందంటే అశ్లీల నృత్యాలకు ఏర్పాట్లు కూడా జోరుగా చేశారు. కోడిపందాలు తిలకించడానికి గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అయితే భోగి రోజున కోడిపందాలు బరులో ఆశించిన జనం ఎక్కడా కనిపించలేదు నామమాత్రంగానే వచ్చారు.దీనికి కారణం పోలీసులు కోడిపందాలు అడ్డుకుంటారేమోనని కొంతమంది, బంధువులు రావడం ఇలాంటి కారణాలతో అయితే రెండో రోజు పూర్తిస్థాయిలో జనం కోడి దాలు తిలకించడానికి వస్తారని నిర్వాహకులు అంచనా వేసుకుంటున్నారు. ప్రతి ఏడాది రాజకీయ నాయకులు కోడిపందాలు నిర్వహణ కోసం ముందుగా వారు కోడి పుంజులతో పందాలు ప్రారంభించేవారు. కానీ ఈ ఏడాది కోడి పందాల బరుల్లో నాయకులు ఎక్కడా వారి జాడ కనిపించలేదు. ఎక్కువ కోడిపందాలు బరోల్లో రాజకీయ నాయకుల అనుచరులతోనే బరులు నిర్వహణ కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే కొన్ని బరుల్లో ప్రైవేటు వ్యక్తులు కూడా నిర్వహణ కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రధాన బరుల్లో వేలంపాటల్లో బడా బాబులు పడుకోగా మిగిలిన బరుల్లో రాజకీయ నాయకుల అనుచరులు వ్యాపారం చేస్తున్నారు. నేడు రేపు కోడిపందాలు బరోల్లో కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయి .

**కోస కు మంచి గిరాకీ :**

కోడి పందాలు జరిగేటప్పుడు ఓడిపోయిన (చనిపోయిన) కోడిని కోస అంటారు. దీని ఖరీదు 5 వేల నుండి పదివేల వరకు నిర్వాహకులు అమ్ముతున్నారు. అయినప్పటికీ కోస దొరకడం కష్టతరమే ఈ కోస కోడిపందాలు నిర్వాహకులు చేతిల్లో ఉంటాయి. వీటిని పోలీసు అధికారులు కూడా చాలా ఇష్టంతో తినడానికి నిర్వాహకులు నుండి తీసుకెళుతూ ఉంటారు.



# పేదలకు వస్త్ర దానం

**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 14:** పదవ తరగతి పూర్వ విద్యార్థులచే (1976-77) సంక్రాంతి సందర్భంగా ముమ్మిడివరం శివాలయం వద్ద వందమంది పేదలకు వస్త్ర దానం చేసిన పూర్వ విద్యార్థులు.ఈ కార్యక్రమం లో కే. రామలింగేశ్వరరావు, పసుమర్తి సుబ్రమణ్యం, నముడూరి రామలింగ శాస్త్రి, అన్నా బత్తుల రాంబాబు,గంజి జాజి,సరిపెల్ల రామకృష్ణంరాజు లతోపాటు పలువురు పాల్గొన్నారు.

# బీజేపీ సంక్రాంతి సందడి..

## రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటలో రంగవల్లుల పోటీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** సంక్రాంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రూరల్ హుక్కుంపేట గ్రామ పంచాయతీ కార్తికేయ నగర్ లో రంగవల్లుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ అత్తిలి పోశేశ్వరరావు, ముద్రగడ సూర్యచంద్ర మోహన్, పోతురాజు శ్రీనివాసరావుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీకి న్యాయ నిర్ణేతలుగా బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, మహాత్మా పాఠశాల ప్రిన్సిపాల్ అత్తిలి భాగ్య జ్యోతి వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడటంలో భారతీయ పండుగలు ముఖ్య భూమికను నిర్వహిస్తాయి అన్నారు. ఈ ముగ్గుల పోటీలో విజేతలకు నగదు బహుమతిని, పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, మట్టా నాగబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు దుద్దుపూడి రమేష్, బొప్పన శ్రీనివాస్, బొప్పన నానాజీ, కాలెపు సత్య సాయిరాం, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, కరుటూరి శ్రీనివాసరావు, తనుబుద్ధి సూర్య భాస్కర్ రావు, మన్నెం శ్రీనివాస్, ఎన్వీబీఎన్ ఆచారి, కందికొండ రమేష్, నందివాడ సత్యనారాయణ, బండి సత్యప్రసాద్, వంకా యర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వినియోగం తప్పనిసరి

- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా అవగాహనా కార్యక్రమం
- డీటీఓ ఆర్ సురేష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం (ఎన్నార్ఎస్ఎం) 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం నగరంలోని మోరంపూడి ట్రాఫిక్ జంక్షన్ వద్ద జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. హెల్మెట్ వినియోగంతో ప్రాణ నష్టం నివారించవచ్చని ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, జీ రామ్ నారాయణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు బీ ఉమా మహేశ్వర రావు, పీవీవీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



**కాకినాడ (మనసులో మాట) జనవరి 14..** స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ అధ్యక్షులు ప్రసాద్ నాయుడు పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం మన పండుగలు అని అన్నారు. తరతరాలుగా ఆనందాన్ని పంచుతున్న సంక్రాంతి ఆబాల గోపాలానికి ఆనంద పర్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, సూర్యనారాయణ, పార్ధసారథి తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



చిరతపూడిలో ఆకట్టుకున్న

# రంగవల్లులు

- బ్రహ్మేశ్వర యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ
- ఉత్సాహంగా పాల్గొన్న బాలికలు, మహిళలు



**అంబాజీపేట (మనసులో మాట), జనవరి 14:** అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామంలో సంక్రాంతి పర్వదిన సందర్భంగా రంగవల్లుల పోటీ నిర్వహించారు. స్థానిక బ్రహ్మేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో అత్యంత ఉత్సాహంగా మహిళలు, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల నేపథ్యంలో చిరతపూడి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం సెంటర్ పరిసర వీధులన్నీ రకరకాల రంగుల ముగ్గులతో చూడ ముచ్చటగా శోభాయమానంగా ముస్తాబయ్యాయి. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ ముగ్గుల పోటీ నిర్వహించారు.

**విజేతలకు బహుమతీ ప్రదానం..**

ఈ పోటీలో విజేతలుగా దార్లంక లక్ష్మీ దుర్గ (ప్రథమ), బొడ్డు నాగ దుర్గా రజని (ద్వితీయ), భమిడి శేష మహాలక్ష్మి (తృతీయ) నిలిచారు. వీరికి గ్రామ ప్రముఖులు వెంకట కృష్ణమాచార్యులు, కర్రా వెంకట సత్యనారాయణ మూర్తి బహుమతులు అందజేశారు. మొత్తం 60 మంది ఈ పోటీలో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

**రాజమండ్రి సరస్వతీ ఘాట్ వద్ద..**

రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్‌లో వేంచేసియున్న శ్రీ జ్ఞాన సరస్వతీ పీఠం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. శ్రీ జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను న్యాయ నిర్ణేతలు తిలకించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మరొక ఇద్దరికి ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తోట సుబ్బారావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాలయాలను ప్రతీ ఒక్కరు గౌరవించాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతీ ఏటా ముగ్గుల పోటీలను సరస్వతి పీఠంలో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, యవతులు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యపురం బ్యాంకు డైరెక్టర్ పడాల శ్రీను పిల్లి నిర్మల, కే లలిత, కృష్ణకుమారి, తనూజ, శ్రీలక్ష్మి వ్యవహరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తూర్పు లక్ష్మీపురంలో

# ముగ్గుల పోటీలు



**ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 14..** ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం ముగ్గుల పోటీ కార్యక్రమం ఘనంగా జరిగాయి . ఈ కార్యక్రమం వీరంరెడ్డి పావని ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా సర్పంచ్ భార్గవి పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న సభ్యులకు బహుమతులను సర్పంచ్ భార్గవి చేతుల మీదగా అందజేశారు. సర్పంచ్ భార్గవి మాట్లాడుతూ వీరంరెడ్డి పావని, వీరంరెడ్డి మంగాదేవి, ప్రభ ఆధ్వర్యంలో గ్రామంలో జరగడం చాలా సంతోషంగా ఉందని సర్పంచ్ భార్గవి అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి కి ఉట్టిపట్టే విధంగా

# సంక్రాంతి పండుగ

- ఎమ్మెల్యే ఆనందరావు





**అమలాపురం (మనసులో మాట) జనవరి 14:** భారతీయ సంస్కృతి, రైతుల కృషికి గౌరవం తెలిపే పండుగగా కుటుంబ సమైక్యతను చాటే మహత్తర పర్వదినం గా సంక్రాంతి పండుగకు విశిష్ట స్థానం ఉందని స్థానిక ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు తెలిపారు. బుధవారం ఉప్పలగుప్తం మండల పరిధిలోని ఎస్ యానం బీచ్ నందు ఆంధ్ర గోవా కోకో బీచ్‌లో జనవరి 14, 15, 16 తేదీల్లో సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్యే ఆనందరావు ఆర్డీవో కే మాధవి జిల్లా పర్యాటక అధికారి అన్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ మూడు రోజుల సంక్రాంతి పండుగ ను కన్నుల పండుగగా బీచ్ నందు నిర్వహించుకోవాలన్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రభు త్వ వ్యవసాయ ఉద్యాన తదితర స్టాల్స్ తో పాటుగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన వివిధ పోటీలను ఫుడ్ స్టాల్స్, రెస్టారెంట్లు ప్రారంభించారు. లక్షలాది మంది పర్యాటకులు పాల్గొనేలా బీచ్ ను అలం కరించడం జరిగింద న్నారు, పర్యాట కులను విశేషంగా ఆకట్టుకు నేలా పలు ప్రదర్శ నలు ఏర్పాటు చేసినట్లు తెలి పారు .సాంస్కృతిక కార్య క్రమాలు, ముగ్గులు స్థానిక వంటకాల తో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యా యన్నారు. ఆంధ్ర గోవా కోకో బీచ్‌లో జనవరి 14 నుంచి 16 వరకు ఘనంగా నిర్వహించబడే సంక్రాంతి సంబరాలకు స్వాగతం పలికారు.ఎస్. యానం నందు గల సుందరమైన గోవా కోకో బీచ్ ప్రాంగణంలో నిర్వహించ బడు తున్న సంక్రాంతి సంబరాలను ప్రారంభించడం ఎంతో ఆనం దంగా, గర్వంగా ఉందన్నారు. సంక్రాంతి అనేది మన భారతీయ సంస్కృతికి ప్రతీక. రైతుల కృషికి గౌరవం తెలిపే పండుగగా, కుటుంబ సమైక్యతను చాటే మహత్తర పర్వదినంగా సంక్రాంతి పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు ఇలాంటి పండుగలను ప్రజలతో కలిసి, ప్రకృతి సోయగాల మధ్య జరుపుకోవడం మన సంప్రదాయాలకు మరింత అందాన్ని చేకూరుస్తుంద న్నారు ఆర్డీఓ కే మాధవి ప్రసంగిస్తూ గోవా కోకో బీచ్ వంటి పర్యాటక ప్రాంతా లలోని ఈ తరహా సంబ రాలు స్థానికంగా నిర్వ హించడం ద్వారా మన జిల్లాలోని పర్యాటక అవకా శాలను విస్తరించడంతో పాటు, స్థానిక కళాకారుల కు, యువతకు, స్వయం ఉపాధి వర్గాలకు మంచి అవకాశాలు కలుగుతా యన్నారు పర్యాటక పరంగా జిల్లా అభివృద్ధికి కూడా దోహదపడుతుంద న్నారు.ఈ సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్ర మాలు, సంప్రదాయ ఆటలు, కళా ప్రదర్శనలు మన సంస్కృతి గొప్పదనానికి అద్దం పట్టేలా నిర్వహించడం ఎంతో గర్వ కారణంగా ఉందన్నారు ఈ సంబరాలలో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరుకుంటున్నా నన్నారు.ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, సిరి సంపదలు నింపాలని ఆకాంక్షిస్తూ మీ అందరికీ హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పర్యాటక అధికారి అన్వర్ ఉద్యాన అధికారి బివి రమణ వ్య వసాయ అధికారి వెంకట రామారావు వివిధ శాఖల సిబ్బంది కూటమినాయకులు పాల్గొన్నారు.



సంక్రాంతి పండుగ సందర్భంగా

# ప్రైవేట్ బస్సుల అధిక ఛార్జీలపై కఠిన చర్యలు

జిల్లా రవాణా శాఖ అధికారి కే. శ్రీధర్



**కాకినాడ (మనసులో మాట) జనవరి 14..** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రైవేట్ బస్సులు అధిక ఛార్జీలు వసూలు చేయకుండా నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ కఠిన చర్యలు చేపట్టిందని జిల్లా రవాణా శాఖ అధికారి/కమిషనర్ తెలిపారు.గత ఐదు రోజులుగా ఆర్ టి జి ఎస్ పర్యవేక్షణతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫేర్ మానిటరింగ్ టీమ్స్ ద్వారా అన్ని ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫార్ములు (అభి బస్, రెడ్ బస్ తదితర యాప్‌లు) లోని బస్సు ఛార్జీలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన వెంటనే సంబంధిత ప్రైవేట్ బస్సు యజమానులతో అధికారులు సమన్వయం చేసి, ఛార్జీలను తక్షణమే తగ్గించి నియంత్రించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్ టీసీ నిర్దేశించిన ఛార్జీలపై గరిష్టంగా 50 శాతం మాత్రమే అదనంగా వసూలు చేయాలని స్పష్టం చేస్తూ, దానికంటే ఎక్కువ ధరకు టికెట్లు విక్రయిస్తే సంబంధిత బస్సు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 24ఐ7 హెల్ప్‌లైన్ నెంబర్ 92816 07001 ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సు ఛార్జీలు లేదా ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి తక్షణ పరిష్కారం అందిస్తారని చెప్పారు.

ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రతి ప్రైవేట్ బస్సులో తప్పనిసరిగా స్పష్టంగా ప్రదర్శించాలని బస్సు యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా మోటార్ వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ, అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. గత ఐదు రోజులగా జరుగుతున్న ఈ తనిఖీలలో అధిక ఛార్జీలు వసూలు చేసిన (5సంఖ్య) బస్సులపై కేసులు నమోదు చేసి 50,000 రూపాయలు జరిమానా విధించామని, అలాగే పన్ను, పర్మిట్ వంటి ఇతర నిబంధనలు ఉల్లంఘించిన (27బిసంఖ్యబి) బస్సులపై కేసులు నమోదు చేసి1,00,000 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.ఈ ప్రత్యేక తనిఖీలు మరియు పర్యవేక్షణ ప్రక్రియ జనవరి 18 వరకు కొనసాగుతాయని, పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల సమయంలో కూడా ఇదే విధమైన కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు భద్రతతో కూడిన ప్రయాణం అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పండుగ కాలంలో ప్రయాణికుల శ్రేయస్సు కోసం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ జిల్లా రవాణా శాఖ అధికారి కె.శ్రీధర్ తెలిపారు.

# అంబరాన్ని అంటిన భోగి సంబరాలు

**కాకినాడ (మనసులో మాట) జనవరి 14..** కాకినాడ నగరంలో భోగి సంబరాలు అంబరాన్నంటేలా సాగాయి. సంస్కృతంలోని 'భుగ్' అనే పదం నుంచి భోగి వచ్చినట్లు పెద్దలు చెబుతారు. భోగం అంటే 'సుఖం' అని అర్థం. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే ముందు రోజును సుఖసంతోషాలకు ఆరంభంగా భావిస్తూ దీనిని భోగిగా పిలుస్తారు. గోదాదేవి శ్రీరంగనాథుడిలో లీనమై పరమానందాన్ని పొందిన పవిత్ర రోజే ఈ భోగి అని విశ్వాసం. ఈరోజుప్రజలందరూ ఇళ్ల ముందు భోగి మంటలు వేసి..ఎంతో వైభవంగా చేసుకున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా... పండగను ఘనంగా గంగిరెద్దులు, హరిదాసుల ఆటపాటలతో భోగి పండగను పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని... భోగి మంటల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. నృత్యాలు చేస్తూ... ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ధరిత్రి ఫౌండేషన్ చైర్మన్ సురేఖ, బిజెపి యాదవ నాయకులు కొండల సాయి, ప్రజలుమాట్లాడుతూ భోగి మంటలు ఆడుతూ చిన్నాపెద్దా సంబరాలు జరుపుకుంటున్నారు. తెలుగు ప్రజల అతి పెద్ద పండుగలలో సంక్రాంతి ఒకటి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ



పండుగలో మొదటి రోజు భోగి ప్రత్యేకత. ఆనందాలను పంచే తెలుగులో భోగి అంటే చల్లటి మంట మాత్రమే కాదు. ప్రతి సంవత్సరం సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే ముందు రోజున భోగి పండుగను జరుపుకుంటారు. చలికి టాటా చెప్పేది. ఈ మంటల్లో పాత పాత వస్తువులు, విరిగిన మంచాలు, కుర్చీలు, ఉపయోగించని వస్తువులు విసిరివేయబడతాయి. కాబట్టి.. ఇంట్లో దారిద్ర్యం వదిలిపోతుందని నమ్ముతారు. భోగి నుంచి ఇళ్లలో పండుగ కళ వస్తుంది. తెలుగు లోగిళ్లు కొత్త రూపాన్ని పొందుతాయి. ధనుర్మాసం అంతా ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను ఎండబెట్టి పిడకలుగా మారుస్తారు. వాటిని భోగి మంటల్లో వాడటం వెనుక ఆరోగ్య రహస్యం ఉంది:

గాలి శుద్ధి ఆవు పిడకలు, రావి, మామిడి కట్టెలు కాల్చడం వల్ల వెలువడే పొగ వాతావరణంలోని సూక్ష్మక్రిములనునశింపజేస్తుంది. చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యలను అరికట్టడానికి ఈ మంటల వేడి దోహదపడుతుంది.

కుటుంబ సభ్యులు ఒకే చోట చేరి మంటలు వేయడం వల్ల సామాజిక ఐక్యత పెరుగుతుంది.చిన్నారులపై భోగి పళ్లు ఎందుకు పోస్తారు సాయంత్రం వేళ ఐదేళ్ల లోపు పిల్లలకు 'భోగి పళ్లు' (రేగు పళ్లు) పోయడం ఒక మధురమైన సంప్రదాయ నడుమబంధు మిత్రులతో ఆనందంగా భోగి పండగను నిర్వహించుకున్నారు



నూతన ఆశయాలతో ముందుకు సాగడమే

# భోగి విశిష్టత

- రైతుల మోముల్లో ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- భోగి మంటలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర మంత్రి సుభాష్

**రామచంద్రపురం(మనసులోమాట)జనవరి14:** దేశానికి అన్నం పెట్టే రైతన్న మోముల్లో చిరునవ్వు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. భోగి పండుగ సందర్భంగా స్థానిక ఊపీ కళాశాల ప్రాంగణంలో మంత్రి సుభాష్ తన కుటుంబ సమేతంగా భోగి మంటలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి విశిష్టతను తెలియజేస్తూ మూడు రోజుల పాటు ఏర్పాటుచేసిన కోనసీమ సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. అలాగే భోగి పండుగ విశిష్టతను వివరిస్తూ భోగి అనేది పాతను విడిచిపెట్టి కొత్త ఆశయాలతో ముందుకు సాగేందుకు ప్రతీకగా నిలిచే పండుగ అని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయానికి ఆధారమైన ప్రకతికి కతజ్ఞతలు తెలుపుతూ, రైతుల కష్టానికి గౌరవం తెలిపే పండుగగా భోగి ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ, రైతులకు గిట్టుబాటు ధర, రాజముద్రతో నూతన పాసు పుస్తకాలు పంపిణీ చేపట్టి అన్నదాతలు పట్ల చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. మన సంప్రదాయాలు, సంస్కతిని కాపాడుకోవాలని, భోగి మంటలు చెడు అలవాట్లను, నిరాశను దహనం చేసి, కొత్త ఆశలు, సంతోషం, శుభఫలితాలను ఆహ్వానించే సంకేతమని మంత్రి వివరించారు. మన ఆచార వ్యవహారాలు సంస్కతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. మకర సంక్రాంతి ప్రత్యేకతను చాటి చెప్పే హరిదాసు కీర్తనలు, చిలక జోస్యం, కోయదొర, పిట్టలదొర, డూడూ బసవన్నలు, రంగవల్లులు, గాలిపటాలు, పిండి వంటలు, సాంప్రదాయ కోడిపందాలు, గోదావరి జిల్లాలకు ప్రత్యేకతగా అభివర్ణించారు. ఈ భోగి పండుగ ప్రజల జీవితాల్లో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం నింపాలని, రైతులు పండించిన పంటలు సమద్ధిగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రం అభివద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ భోగి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సంక్రాంతి సందడి

# సంప్రదాయాల సొబగులు



**కాజులూరు (మనసులో మాట) జనవరి 14..** తెలుగు వారి ప్రధాన పండుగలలో సంక్రాంతికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇది కేవలం పంటల పండుగ మాత్రమే కాదు, గ్రామీణ జీవనశైలిని, కుటుంబ అనుబంధాలను, సాంప్రదాయాలను ప్రతిబింబించే మహోత్సవం. అంబరాన్ని అంటిన భోగి మంటలతో మొదలై, చిన్నారుల నవ్వులతో, ఆడపడుచుల గొబ్బిళ్లతో, గ్రామమంతా పండుగ వాతావరణంతో సంక్రాంతి సందడి ఉట్టిపడుతుంది. నేటి ఆధునిక కాలంలో గ్రామాల నుండి జీవనోపాధి కోసం మహానగరాలకు తరలి వెళ్లిన గ్రామీణలు సంక్రాంతికి గ్రామాలకు విచ్చేసి తమ బంధుమిత్రులతో హాయిగా గడుపుకున్నారు.

సంక్రాంతికి ముందురోజు భోగి పండుగను జరుపుకుంటారు. పాత పనికిరాని వస్తువులను తొలగించి, భోగి మంటలు వేయడం ద్వారా చెడును విడిచి, మంచిని ఆహ్వానించే భావన ఇందులో దాగి ఉంది. తెల్లవారుజామున గ్రామ వీధులన్నీ భోగి మంటల కాంతితో వెలిగిపోయాయి. చలి చిమ్ముతున్న వేళ ఆ మంటల చుట్టూ కుటుంబసభ్యులు, పొరుగువారు చేరి ఆనందంగా కబుర్లు చెప్పుకున్నారు.

భోగి రోజున చిన్నారులకు చేసే భోగి పళ్ళు కార్యక్రమం ఎంతో ముచ్చటైన సంప్రదాయం. రేగుపళ్ళు, చెరకు ముక్కలు, బెల్లం, నాణేలను పిల్లల తలపై పోస్తూ ఆశీర్వదిస్తారు. ఇది పిల్లలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని కోరుకునే సంకేతంగా భావిస్తారు. ఈ వేళ పిల్లల ముఖాల్లో కనిపించే ఆనందం పండుగకు మరింత రంగులు అద్దుతుంది.



గ్రామాల్లో సంక్రాంతి అంటే తప్పనిసరిగా గుర్తుకు వచ్చే మరో సంప్రదాయం గొబ్బిళ్ళు. ఆడపడుచులు, చిన్నపిల్లలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి, వాటి మధ్య గొబ్బిళ్లను అలంకరిస్తారు. పూలు, పసుపు, కుంకుమతో చేసిన గొబ్బిళ్ళు గ్రామీణ సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ప్రధానంగా సంవత్సరంలోపు పిల్లలకు ప్రత్యేక ఆకర్షణగా అలంకరించి ఈ కార్యక్రమంలో నిర్వహించారు.

సంక్రాంతి రోజుల్లో పల్లెల్లో కోలాహలం రెట్టింపు అవుతుంది. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, బంధువుల రాక, పిండి వంటకాల ఘుమఘుమలు పండుగ వాతావరణాన్ని చాటి చెప్పాయి. ఈ విధంగా సంక్రాంతి పండుగ తెలుగు సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతూ, తరతరాలుగా మన సంస్కృతిని నిలబెట్టే ఒక అద్భుతమైన పండుగగా నిలిచింది.



# భక్తిశ్రద్ధలతో గోదా కల్యాణం

**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 14:** పవిత్ర ధనుర్మాసం భోగి పండుగ సందర్భంగా గోదాదేవి కల్యాణాన్ని బుధవారం అత్యంత వైభవంగా జరిపించారు. స్థానిక ప్రధాన రహదారిలో వేయించేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకులు కండవిల్లి కేశవాచార్యులచే గోదాదేవి, స్వామివారి కళ్యానాన్నీ శాస్త్రోంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పెద్ద ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా కేశవపురంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కేశవ స్వామి వారి ఆలయంలో ఆలయ ఈవో ఎర్ర వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు పెద్దింటి శ్రావణ కుమార్ గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా సంక్రాంతి సందర్భంగా గురువారం స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలియజేశారు.

# స్వామి వారి ఊరేగింపు





**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 14:** సంక్రాంతి సందర్భంగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పల్లిపాలెం గ్రామంలో కొలవైయున్న శ్రీ హరి సాకేత వెంకటేశ్వర స్వామివారినీ బుధవారం ముమ్మిడివరం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళ తాళాలు, భాజా భజంత్రీలు, చిన్నారుల కోలాటాలు, శక్తి వేషాలు, బాణాసంచా కాల్పుల నడుమ ముమ్మిడివరం పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.

# పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా గోలి



**పల్నాడు, జనవరి 14,( మనసులో మాట):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యుడు గా పెదకూరపాడు మండలం గారపాడు గ్రామానికి చెందిన గోలి యల్లమందయ్య నియామకం చేపట్టారు.. బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ.వి. నాగేశ్వరరావు ద్వారా నియామక పత్రం అందుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి పాటుపడతానని స్పష్టం చేశారు. కుల బాంధవుల ప్రోత్సాహంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తానని, తనను ఆదరించి, సహకరించిన కుల బాంధవులకు రాష్ట్ర అధ్యక్షులు జీ వి నాగేశ్వరరావు గారికి ధన్యవాదాలు తెలియజేశారు.

## భారతీయ సంస్కృతిలో

# సంక్రాంతికి అత్యంత విశిష్టత

### భోగి మంటలు వేసిన ఎమ్మెల్యే శిరీషా దేవి - తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్

### కిండ్రలో ముగ్గుల పోటీలు బహుమతులు ప్రధానం చేయనున్న ఎమ్మెల్యే మిర్యాల సీరిషా



**రాజువొమ్మంగి( మనసులో) మాట జనవరి 14..** సంక్రాంతి పండుగ ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పండుగ కాదని చాలా విశిష్టత గల పండుగ అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం కిండ్రలో బుధవారం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో భోగి పండుగ నిర్వహించారు. కార్యక్రమం లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సంక్రాంతి ప్రకృతితో ముడిపడిన పండుగ అన్నారు. ఇది కేవలం మతానికి మాత్రమే అన్వ యించ కూడదని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సూర్యుని చలనం, ఋతువుల మార్పు, పంట కోత పూర్తయ్యే సమయాన్ని ఆధారంగా చేసుకున్న ప్రాచీన భారత దేశపు వ్యవసాయ కాల సంస్కృతితో ముడిపడినట్లు పేర్కొన్నారు. ఆదికాలంలో ఇది కేవలం పంట ముగిసిన సమయాన్ని గుర్తించే సహజ సూచికగా ఉండేదన్నారు. అది కాస్త క్రమంగా పంటలు చేతికి వచ్చిన అనంతరము విశ్రాంతి, సామూహిక భోజనాలు, కుటుంబ గ్రామ ఆచారాలుగా మారిందన్నారు. దీనిలో భాగంగా మొదటి రోజు జరుపుకునే భోగి పండుగ శుభ్రతకి చిహ్నంగా అంటే పాతదాన్ని వదిలేయడంఅనే విధానంతో భోగి మంటలు వేస్తారని పేర్కొన్నారు.అలాగే కనుమ(పశువులకు గౌరవం) వంటి ఆచారాలు వ్యవసాయ జీవన అవసరాల నుంచే పుట్టినట్లు చరిత్ర చెబుతుందన్నారు.దేశవ్యాప్తంగా పేర్లు వేరైనా మూలం ఒక్కటేనని పంటకోత ముగిసిన ఆనందకాలంలో దీనిని నిర్వహించడం శుభపరిణామన్నారు. పలు ప్రాంతాల్లో(సంక్రాంతి, పొంగల్, లోహ్రీ, బిహు మొదలైనవి)గా జరుపుకుంటారని పేర్కొన్నారు. ప్రాంతీయ తేడాలు తప్పా దీనిని అన్ని చోట్లా అంగరంగ వైభవంగా పెద్ద పండుగగా పిలుచుకోవటం జరుగుతుందన్నారు.

వీటిలో భాగంగా పంట పని పూర్తైన తర్వాత గ్రామీణ వినోదంగా ఏర్పడ్డ సామాజిక సంస్కృతిలో భాగంగా పలు సాంస్కృతిక క్రీడలు నిర్వహించడం మన సంస్కృతి అన్నారు.దీనిని అందరూ సంప్రదాయం ప్రకారం ఘనంగా జరుపుకోవాలని కోరారు. అలాగే ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గెలుపొందిన వారికి కనుమపండుగ రోజు ప్రథమ బహుమతి 15,000 రూపాయలు , ద్వితీయ బహుమతి 10,000 రూపాయలు తృ తీయ బహుమతి గా 5000 రూపాయలు చొప్పున ఆమె అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏ ఎం సి డైరెక్టర్ కేసిరెడ్డి శివ, తెదేపా నాయకులు పోతల చిట్టిబాబు అలియాస్ వెంకటరావు, చిట్టి సుబ్బారావు కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో కిండ్ర యువత పాల్గొన్నారు.

# ఎవరేం చెప్పినా బేఖాతర్

### కోడిపందాలు ఆపేదే లేదు అంటున్న బరులు..



**కాకినాడ (మనసులో మాట) జనవరి 13..** ఎవరేమి చెబితే మాకేంటి మా ఇష్టం మాదే మేము చేసేదే చట్టం మేము చెప్పింది ఎవరైనా ఆచరించాల్సిందే అంటూ విర్రవీగుతున్న కోడిపందాల బరులు... కోడిపందాలు ఆడకూడదని హైకోర్టు ఆదేశాలిచ్చిన చింతూరు డివిజన్ ఐటిడీ పీఓ పేపర్ న్యూస్ ద్వారా తెలియపరిచిన ఏఎస్పి సిఐ ఎస్ఐ ముగ్గురు కలిసి పత్రిక ప్రకటన ఇచ్చి ప్రజలకు తెలియజేసిన ఆగని కోడి పందాల బరులు ఎక్కడో తెలుసా రంపచోడవరం నియోజకవర్గం పోలవరం జిల్లా ఎటపాక మండలంలోని చోడవరం గ్రామంలో అలాగే పురుషోత్తపట్నం గ్రామంలో మెయిన్ రోడ్ లో ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎవరేం చెప్పినా మీ వినం మా ఇష్టం మాదే అంటూ అంగరంగ వైభోగంగా మొదటి రోజే మొదలవుతున్న కోడిపందాల బరులు సిద్ధం నేనంటూ నేను అంటున్న పురుషోత్తపట్నం

చోడవరం గ్రామాలలో కోడి పందాల బరులు దీన్ని అదుపు చేసే అధికారులు లేరా డ్రోనులతో చెకప్ చేస్తామన్నారు ఇంతవరకు ఏ చర్యలు తీసుకోకపోవడం ఆశాస్పదంగా ఉంది ఇకనైనా ఏ ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## మోడీ తెచ్చిన జిరామ్ జి

# పథకం పేపర్లు భోగిమంటల్లో..

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 14..** 2005 మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మికులకు పేదలకు ఉపాధి కల్పిస్తే,అటువంటి చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. వికసత్ భారత్ జి రాంజీ పేరుతో 2025 డిసెంబర్ నెలలో కొత్త ఉపాధి పథకాన్ని పార్లమెంట్ ఆమోదించిందని, ఈ చట్టం పేదలకున్న ఉపాధి హక్కు తొలగించిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు విమర్శించారు ఈరోజు ఉదయం ఇంద్ర పాలెం లో బోగి మంటల్లో మోడీ తెచ్చిన జిరాంజీ పథక ప్రతులను ఆయన దగ్ధం చేశారు. మోడీ తెచ్చిన చట్టంలో 100 రోజుల పనిని 125 రోజులకు పెంచామని ప్రచారం చేసుకుంటున్నారని, వ్యవసాయ కార్మిక సంఘాలు,వామపక్ష పార్టీలు 100 రోజులు పనిని 200 రోజులకు పెంచాలని రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తుంటే రోజు వేతనం పెంచలేదని ఆయన విమర్శించారు. వంద రోజులు పని ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం 40 రోజులు 50 రోజులు పని చెప్పారని అటువంటిది పేరుకి 125 రోజులు పెంచిన వ్యవసాయ కార్మికులకు పేదలకు పెద్దగా ఒరిగేది ఏమీ లేదని ఆయన అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర బిజెపి మంత్రులు, రాష్ట్రంలో టిడిపి,వైసిపి నాయకులు, భూస్వాములు పెద్ద గోల చేస్తున్నారని వీరి ఒత్తిడికి తలవొగ్గి మోడీ చట్టంలో 60 రోజులు పనులకు విశ్రాంతి ఇచ్చారని ఇది పెద్ద దుర్మార్గమని ఆయన తీవ్రంగా విమర్శించారు మోడీ తెచ్చిన జి రాంజీ పథకాన్ని రద్దు చేసే వరకు వ్యవసాయ కార్మికులు పేదలు , పెద్ద ఎత్తున పోడాలని తిరిగి 2005 ఉపాధి హామీ చట్టాన్ని పునరుదించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు .సామాజిక న్యాయ సాధన సమితి కాకినాడ జిల్లా గౌరవ అధ్యక్షులు అయితా బత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి గద్దెనెక్కిన మొదలు దళితులపైన పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని కాకినాడ జిల్లాలో దాడులు జరుగుతూ ఉంటే అధికారులు పెద్దగా పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు బిజెపి మతోన్మాదపాలన పోతే తప్ప ఈ దేశం బాగుపడదని ఆయన తీవ్రంగా విమర్శించారు . మహిళా సంఘం జిల్లా మాజీ కార్యదర్శి వాసంశెట్టి కుమారి డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వి చంద్రావు ఉపాధి కూలీలు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు పాల్గొన్న వారందరికీ చంద్ర రావు కృతజ్ఞతలు తెలిపారు.

# భోగి పండుగను ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి

**ఏలూరు, జనవరి - 14 (మనసులో మాట)..** చెడును పారద్రోలి మంచి మనసులతో ప్రజలంతా నూతన కాంతులతో సంక్రాంతి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అభిలాషించారు. ఇదేక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయని ఆయన పేర్కొన్నారు. ఏలూరు నగర సంక్రాంతి సంబరాలను శనివారపు పేటలో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. రంగవల్లుల పోటీలు, కోలాట నృత్యాలు, సంప్రదాయ కోడిపందాలు, ఎడ్లబండ్లు, గంగిరెద్దుల విన్యాసాలతో ప్రాచీన తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించిన ఈ వేడుకల్లో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు, మాజీ మంత్రి మాగంటి బాబు, పద్మవల్లి దేవి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈక్రమంలో సంబరాలు జరిగిన ప్రాంతానికి గ్రామీణ వాతావరణాన్ని తలపింపచేసే తరహాలో ఎడ్ల బండిపై చేరుకున్న ఎమ్మెల్యే చంటి దంపతులకు,,, టిడిపి నాయకులు, ప్రజలు పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం పండుగ సంబరాలకు నాందిపలుకుతూ భోగి మంటను వెలిగించారు. రంగవల్లులను తిలకించారు. సరదాగా కొద్దిసేపు డింకీ కోడిపందాలు వేసి అందర్నీ ఉత్సాహపరిచారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తోన్న మంచికి అందరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ఆయన,,, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రభుత్వాధినేతల బాధ్యతలో సమిష్టిగా పాలుపంచుకోవాలని సూచించారు. ఈ సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో నూతన కాంతులు నింపాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.



# క్రికెట్ టోర్నమెంట్ విజేతకు నగదు ట్రోఫీని, నగదు అందించిన ఎమ్మెల్యే గిడ్డి

**అయినవిల్లి ( మనసులో మాట) జనవరి 14..** సంక్రాంతి పండుగ నేపథ్యంలో అయినవిల్లి మండలం అయినవిల్లి లో నిర్వహించిన క్రికెట్ లీగ్ టోర్నమెంట్ పోటీలో వీరవల్లిపాలెం జట్టు విజయం సాధించగా ఆ జట్టుకు ట్రోఫీ నగదు ను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతులు మీదుగా అందజేసారు. బుధవారం అయినవిల్లి మండలం అయినవిల్లి లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో యువతకు ఉత్సాహం,ఉల్లాసాజన్ని ఇస్తాయన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ను ఇంత బాగా విజయవంతం కావడానికి కారణమైన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. కొద్దిసేపు ఎమ్మెల్యే క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# దానం చేయడం కర్తవంగా భావించాలి



**కాకినాడ (మనసులో మాట) జనవరి 14..** మనిషిగా పుట్టినందుకు తోటి మనిషికి దానం చేయడం కర్తవ్యంగా భావించి సహాయ పడాలని ప్రవాస ఆంధ్రులు కంచర్ల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు, నూతన వస్త్రాలను పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దానం చేయడం అమితానందాన్ని కలిగిస్తుందన్నారు .మన ఎదురుగా ఎవరైనా కష్టాలలో ఉన్నప్పుడు మనం వారికి సహాయం చేయగలిగిన స్థితిలో ఉంటే తప్పకుండా చేయూతనివ్వాలన్నారు. గ్రంధాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నూతన వస్త్రాలు, నిత్యవసర సరుకులు సమకూర్చిన కంచర్ల సత్యనారాయణ సేవా తత్పరత అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ,సత్య, రేలంగి బాపిరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అంశాలతో రూపొందించిన

# సిఐటియు క్యాలెండర్ ఆవిష్కరణ



**కాకినాడ (మనసులో మాట) జనవరి 14..** కాకినాడ కచేరిపేట సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ను సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషాబాబ్జి కచేరిపేట సిఐటియు కార్యాలయం నందు ఆవిష్కరించారు. వివిధ సామాజిక అంశాలపై ప్రత్యేకంగా రూపొందించిన క్యాలెండర్ కు ప్రకటనలు ఇచ్చి కార్మిక ఉద్యమానికి సహకరించిన వారందరికీ ధన్యవాదములు తెలియజేస్తూ, ఇటీవల విశాఖలో జరిగిన సిఐటియు జాతీయ మహాసభలకు ఆర్థిక సహకారం అందించి విజయవంతం చేసిన వారందరికీ పేరుపేరునా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, నక్కెళ్ళ శ్రీను, కామేశ్వరి, చెక్కల వేణి, అభ్యుద్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

### సర్పంచ్ గోవలక్ష్మీ చే పారిశుధ్య కార్మికులకు దుస్తులు, కిరాణా సామాన్లు అందజేత



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 14:** పంచాయతీలో పారిశుధ్య పరిరక్షణకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎనలేనివని గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అన్నారు. సంక్రాంతి సందర్భంగా బుధవారం పంచాయతీ కార్మికులు, పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రాలను, కిరాణా సామాన్లను గోవలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గోవలక్ష్మి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. గత ఐదు ఏళ్ళుగా పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దుస్తులు కిరాణా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి మెరుగైన వేతనాలు అందించడంతో పాటు వారి ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషిచేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



# ఘనంగా భోగి

**ముమ్మిడివరం(మనసులో మాట) జనవరి 14:** ముమ్మిడివరం మండలం లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. మూడు రోజుల వేడుకల్లో భాగంగా తొలి రోజు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పల్లెలు, పట్టణం అన్న తేడా లేకుండా జనం పొద్దున్నే లేచి భోగి మంటలు వేసుకున్నారు.

తమ లోగిళ్ల ముందు భోగి మంటల కాంతులు విరజిమ్మాయి. ఆ తర్వాత తమ ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేస్తూ సందడి చేశారు.

మండలం లో పలు చోట్ల రాత్రి నుండే ప్రజలు ఆనందంగా భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాల్లో మునిగిపోయారు.భోగి మంటల చుట్టూ ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ ఉత్సవాల్లో చిన్నాపెద్దా తేడాలేకుండా సందడి చేశారు. దక్షిణాయనానికి, ధనుర్మాసానికి చివరి రోజు భోగి. ఇళ్లలోకి భోగభాగ్యాలను ఆహ్వానించే రోజు ఇది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఇంటికిచేరే రోజు. రైతులతోపాటు అందరి ముఖాల్లో నవ్వులు పూసే రోజు. భోగి అంటే 'తొలినాడు' అని ఒక అర్థం ఉంది. కొత్త సంవత్సరంలో పండుగలు భోగితోనే మొదలవుతాయి. ఈ రోజున ఇంటి ముందు భోగి మంట వేస్తే ఇంట్లోని చెడు, దరిద్రాన్ని తొలగించుకున్నట్లే అని నమ్మకం.ప్రతీ గ్రామం లో పిల్లా పాపలతో ఉల్లాసం గా గడుపుతున్నారు



## అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన పేరేచర్ల గోపి



**పల్నాడు, జనవరి 14,( మనసులో మాట):** అమరావతి మండలంలోని ప్రభుత్వ అధికారులను ముఖ్య నాయకులను భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పేరేచర్ల గోపి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ అచ్చయ్యను ఎంపీడీవో పార్వతిని, వ్యవసాయ శాఖ అధికారులను గోపి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సై నరేష్ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పోరాటానికి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బిజెపి పార్టీ ఎల్లవేళలా వెన్నుదన్నుగా ఉండి నడిపిస్తుందని గోపి అన్నారు. అధికారులు నాయకులు సమన్వయంతో పనిచేసే ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. దుశ్శాలువతో సత్కరించి స్వీట్ బాక్స్ అందించారు.

### క్లీన్ అండ్ గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో

# ఘనంగా భోగి సంబరాలు

**- పండుగల విశిష్టతను భవిష్యత్ తరాలకు చాటే కార్యక్రమాలు అభినందనీయం**

**- రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు**



**కాకినాడ (మనసులో మాట) జనవరి 14..** భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలలో భాగమైన పండుగల విశిష్టతను భవిష్యత్ తరాలకు తెలియజేసే దిశగా క్లీన్ అండ్ గ్రీన్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. కాకినాడ నగరంలోని వివేకానంద పార్కులో క్లీన్ అండ్ గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి సంబరాలు ఘనంగా జరిగాయి.భోగి పండుగను పురస్కరించుకుని వివేకానంద పార్కు అంతటా రంగురంగుల ముగ్గులు, పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే సెట్లు ఏర్పాటు చేసి, సంప్రదాయ బోగి మంటను వెలిగించారు. ఈ కార్యక్రమం క్లీన్ అండ్ గ్రీన్ సొసైటీ చైర్మన్ బోడా ఆనంద్ అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు నాగజ్యోతి దంపతులు హాజరు కాగాగౌరవ అతిథిగా గ్రంధి బాబ్జిలు హాజరయ్యారు.అతిథులు ముందుగా పార్కులో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు సంప్రదాయ హిందూ వేషధారణలో పురుషులు పంచెలు, కండువాలు, మహిళలు పట్టు చీరలు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. బోగి మంటను సొసైటీ చైర్మన్ బోడా ఆనంద్, టైటాన్ నగేష్, నమన రమేష్ కలిసి వెలిగించారు. చిన్నలు, పెద్దలు కుటుంబ సమేతంగా హాజరై సంప్రదాయ బోగి పిడకలను మంటల్లో వేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

అనంతరం మహిళలు, పురుషులు డాండియా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన పెట్ షోలో పిల్లులు, కుక్కలతో పాటు పాములు, పుంగనూరు ఆవుల గుత్రాలు, చిలక జోష్యం, గంగిరెద్దులు, హరిదాసులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా అప్యాయంగా పలకరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ కాకినాడ జిల్లా వాసులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మన సంస్కృతి సాంప్రదాయాలు భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా క్లీన్ అండ్ గ్రీన్ సొసైటీ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చేయన్ని ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ నగేష్, సెక్రటరీ రామానుజం, సభ్యులు రాజారపు మహేష్, కంతేటి కాశీ, ప్రసాదరెడ్డి, చోడవరపు మూర్తి, రావు స్వామి, అద్దేపల్లి రంగా, చోడే అనీల్, అప్పారెడ్డి, యాక్స్ అండ్ యాక్స్ సతీష్, ప్లీడర్ ప్రభాకర్, రైస్ షాప్ చౌదరి, విశ్వా, ఎస్.కె. అహ్మద్, నామన రమేష్, వాకర్స్, మహిళలు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వాఖ్యాతగా భాను వ్యవహరించారు.

# వేడుకగా 'రాకా' పురస్కార ప్రదానం

**- గీత రచయిత నూజెళ్ళ, సినీ నటుడు పళనీ స్వామికి ఘన సత్కారం**

**- మధుర సినీ గీతాలతో అలరించిన నగరంలోని గాయకులు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** 'రాజమహేంద్రవరం ఆర్ట్ క్రియేషన్ కల్చరల్ అసోసియేషన్' (రాకా) సంక్రాంతి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక గోకవరం బస్టాండు క్రాంతి నర్సింగ్ హోమ్ రెండవ అంతస్తులో 'బాలు సాంస్కృతిక మందిరం'లో నిర్వహించిన ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని 'రాకా' ప్రధాన కార్యదర్శి జీవీ రమణ వ్యాఖ్యతగా ఆద్యంతం రక్తి కట్టించారు. తొలుత నగరానికి చెందిన గాయకులు డాక్టర్ కంటె వీరన్న చౌదరి, జీవీ రమణ, నూజెళ్ళ సూరిబాబు, పళని స్వామి, రాధా కృష్ణమూర్తి, నాగరత్నం, లలితారాణి, వీర్రాజు, డాక్టర్ నూజెళ్ళ శ్రీనివాస్, తదితరులు ఆ'పాత' మధుర సినీ పాటలతో రంజింపజేశారు. శ్రోతల కరతాళధ్వనులతో అభినందనలు అందుకున్నారు.

**'రాకా' సంక్రాంతి పురస్కార ప్రదానం..**

ఆంగ్ల ఉపన్యాసకుడు, 'మేము గోదోరోళ్ళమండి..' పాట రచయిత డాక్టర్ నూజెళ్ళ శ్రీనివాస్, సినీ నటుడు– ఆరోగ్యకరమైన వంటల నిపుణుడు పళని స్వామి (భాగవతి శివప్రసాద్) లను 'రాకా' సంక్రాంతి పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు డాక్టర్ నూజెళ్ళ శ్రీనివాస్, పళని స్వామి మాట్లాడుతూ.. రాకా సంక్రాంతి పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.





సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు 'రాకా' చేస్తున్న కృషిని కొనియాడారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరాన్ని, భాధ్యతను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ప్రారంభించిన భవనం 'బాలు సాంస్కృతిక మందిరం'లో పురస్కారం పొందటం తమ పూర్వజన్మ సుకృతమని పురస్కార గ్రహీతలు డాక్టర్ నూజెళ్ళ శ్రీనివాస్, పళని స్వామి ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'రాకా' నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో తొలుత పురస్కార గ్రహీతల విశిష్టతను గాయకుడు నూజెళ్ళ సూరిబాబు సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో 'రాకా' అధ్యక్షుడు డాక్టర్ కంటె వీరన్న చౌదరి, ఉపాధ్యక్షుడు తిరుమల కృష్ణమోహన్, కోశాధికారి సూరపురెడ్డి తాతారావు, సహాయ కార్యదర్శి గౌరీ శంకరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని సహాయ సహకారాలు అందజేశారు.

**ఆకట్టుకున్న చిన్నారి శయన్ అమృత వాక్కులు..**

కార్యక్రమంలో చిన్నారి పొక్కులూరి నాగ శ్రీశయన్ 'అమృత వాక్కులు' ఆకట్టుకున్నాయి. పురస్కార గ్రహీతలు డాక్టర్ నూజెళ్ళ శ్రీనివాస్, పళని స్వామి, రాకా నిర్వాహకులు శ్రీ శయన్ ను అభినందించారు. పళని స్వామి తన మధుర స్వరంతో శయన్ కు ఆశీస్సులు, అభినందనలు అందజేశారు.

# వైభవంగా గోదారంగనాధుల కల్యాణం

**- స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు**



**కాజులూరు (మనసులో మాట) జనవరి 14..** గోదా రంగనాథుల కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కోలంక, కుయ్యేరు, కాజులూరు, గొల్లపాలెం, అయితపూడి, తనుమళ్ళ తదితర గ్రామాల్లో గోదాదేవి రంగనాధుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నాదాల మధ్య స్వామివారి కళ్యాణం భక్తులను ఆకట్టుకుంది. కోలంక లక్ష్మీ కేశవ స్వామి ఆలయంలోనూ అయితపూడి గొల్లపాలెం గ్రామాలలో వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, కుయ్యేరు రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన గోపాలస్వామి ఆలయంలోనూ కాజులూరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించి సాయం సంధ్య వేళ గోదా రంగనాదుల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఆలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించగా, ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో మారుమోగాయి. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ యువకులు స్వచ్ఛంద సేవలందిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

గోదారంగనాథుల కళ్యాణోత్సవం గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, సామాజిక ఐక్యతకు దోహదపడిందని భక్తులు తెలిపారు. స్వామివారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వారు అభిషేకలు జరిపించారు. ఈ సందర్భంగా కుయ్యేరు ఆలయ అర్చకులు ఖండవల్లి శ్రీనివాసచార్యులు కాజులూరు ఆలయ అర్చకులు రాకుదటి శ్రీనివాసచార్యులు గోదా రంగనాదుల కళ్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు పోలిశెట్టి శ్రీనివాసరావు , పుల్లెపు వెంకటరత్నం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు.



# అందాల నటుడు నటభూషణ శోభన్ బాబుకు ఘన నివాళి

**- గోదావరి గట్టున ఘనంగా 90వ జయంతి..**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** అందాల నటుడు, అభిమానుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన నటభూషణ్ శోభన్ బాబు 90వ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గోదావరి బండ్ రోడ్ లోగల శోభన్ బాబు విగ్రహానికి అభిమానులు. పూలమాలలు వేసి నివాళులర్పించి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ, సలహాదారు బళ్ళా శ్రీనివాసరావు, సేవా సమితి అధ్యక్షుడు కొనగళ్ళ శ్రీనివాస్ కుమార్, కార్యదర్శి పూడి శ్రీనివాస్, బట్టిప్రోలు శ్రీనివాస్ (భీమవరం), సోగ్గాడు ప్రసాద్ లు మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి ఎందరికో ఆదర్శప్రాయులై, ప్రేక్షకుల హృదయాలలో తమ విలక్షణమైన నటనతో చిరస్థాయిగా నిలిచిపోయిన నటుడు శోభన్ బాబు అని, ఆయన జ్ఞాపకార్థం ప్రతీ ఏటా జయంతి నాడు, వర్ధంతి నాడు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నుండి ప్రతీ ఏడాది సోగ్గాడు శోభన్ బాబు అవార్డును గ్లామర్ హీరోకి ఇవ్వడానికి నిర్ణయించామని, ఈ ఏడాది శోభన్ బాబు జయంతిని పురస్కరించుకుని హీరో సిద్దూ జొన్నలగడ్డ (డీజే టిల్లు)కు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కే ఆనంద్, ఏ అన్నవరం, పేపర్ మిల్లు శర్మ, డాక్టర్ న్యూటన్, కేఎస్ ప్రకాశరావు, డీ శ్రీనివాస్, జీ సింహాచలం, ఎం మల్లికార్జున రావు, ఎస్వీవీ సత్యనారాయణ, ప్రకాష్, తణుకు, భీమవరం, కాకినాడ అభిమానులతో పాటు అనేక మంది అభిమానులు పాల్గొన్నారు. అలాగే అందరికీ మిఠాయిలు పంచారు. అనంతరం వైజాగ్ త్రినాథ్, విజయభాస్కర్ లు ఏర్పాటు చేసిన శోభన్ బాబు 90 సంవత్సరాల జన్మదిన కానుక పుస్తకాలను ఆవిష్కరించారు. శోభన్ బాబు సేవా సమితి సభ్యుడు ఆకుల సూర్యప్రకాశరావు (ధవళేశ్వరం) తుంటి ఆపరేషన్ నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు.

# మాజీ ఎంపీ భరత్ రామ్ ఇంట ఘనంగా భోగి వేడుకలు





**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మాజీ ఎంపీ భరత్ రామ్ నివాసం వద్ద కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం తెల్లవారుజామునే భోగి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు, కార్యకర్తలతో కలిసి భోగిమంటలను వెలిగించి ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. నగరంలోని ఓఎన్జీసీ కార్యాలయం సమీపంలోని లఫ్లోరా అపార్ట్మెంట్ వద్ద జరిగిన ఈ భోగి సంబరాల్లో సంప్రదాయ దుస్తులలో పండుగ ప్రత్యేక శోభను సంతరించుకుంది. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాజీ ఎంపీ భరత్ కి భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ప్రైవేటీకరణ పత్రాలను భోగి మంటలలో వేసి ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగను ఐక్యత, ఆనందాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ మాజీ ఎంపీ భరత్ రామ్ ..ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా గోదాదేవి కల్యాణం



**పిఠాపురం మనసులో మాట జనవరి 14:** పిఠాపురం పట్టణంలో గల ప్రముఖ వైష్ణవాలయం శ్రీ కుంతి మాధవ స్వామి వారి ఆలయంలో బుధవారం సాయంత్రం గోదాదేవి రంగనాథ స్వామి కల్యా ణం కన్నుల వైకుంఠంగా, అంగరంగ వైభవంగా జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ దివ్యమైన వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. కళ్యాణ వేడుకకు ముందు, ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ప్రతిమలను ప్రత్యేక వేదికపై ఆసీనులను చేసి, వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య కళ్యాణ క్రతువును సంప్రదాయబద్ధంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని గోవింద నామస్మరణ చేశారు. గోదా రంగనాథ స్వామి కళ్యాణంలో పాల్గొంటే తమ పాపాలు తొలిగి, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలన్నీ ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయాయి. ఈ వేడుకకు ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణ అధికారిణి బొడ్డేపల్లి ధనలక్ష్మి పర్యవేక్షించారు

## మున్సిపల్ కాలనీ గ్రౌండ్ లో

# అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు









**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 14:** రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్ పర్యవేక్షణలో మున్సిపల్ కాలనీ గ్రౌండ్ లో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత పుర ప్రముఖులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ గుడా చైర్మన్ గన్ని కృష్ణ, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు అమర్ జహా బేగ్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు షఫీ బేగ్, కేకే సంజీవరావు, డాక్టర్ రాజశేఖర్, కిశోర్‌కుమార్ జెఎన్, మేడవరపు భద్రం దొర, బెజవాడ రంగారావు, జాలా నటరాజ్, మహమ్మద్ ఫసివుల్లా బేగ్, తాడి సూరిబాబు, కాకర్ల హరిబాబు, రామకృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మున్సిపల్ కాలనీ వా స ం ల ం వె ం ట రాగా డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి, సత్య సౌందర్య, మీనాక్షి మేఘన్ రెడ్డి లు కలసి సుందరంగా అలంకరించిన దుగలు, కర్రలను వెలిగించి భోగి మంటలు వేశారు. గంగిరెద్దుల మేళం, హరిదాసు కీర్తనలు, పిల్లల డాన్సులు, ఎడ్లబండ్లు, గుర్రాల స్వారీ కోడిపందాలు, సోదమ్మ వంటివి సంక్రాంతి సంబరాలకు వచ్చిన వారికి నేత్రపర్వమైంది.

ఈ సంక్రాంతి సంబరాలకు కర్ర సాము, పొట్టేలు విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాలకు విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ టీకే విశ్వేశ్వర రెడ్డి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఈ మున్సిపల్ కాలనీ గ్రౌండ్ లో నిర్వహించే సంక్రాంతి సంబరాలకు ప్రతి ఒక్కరినీ ఆహ్వానించటం అభినందనీయమని అన్నారు.

సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు పెట్టగా వాటిలో మొదటి విజేతగా నిలిచిన పీ సునీతకి ఐదు వేల రూపాయలు, రెండవ విజేతగా నిలిచిన డీ లాస్యకి మూడు వేల రూపాయలు, మూడవ విజేతగా నిలిచిన ఏ శ్రావణి కి రెండు వేల రూపాయలు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కి, మాజీ గుడా చైర్మన్ గన్ని కృష్ణ కి, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ మధు కి, పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బేగ్ కి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజుకి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలు అమర్జహ బేగ్ కి, కేకే సంజీవరావుకి, గౌతమి జీవ కారుణ్య సంఘం మాజీ చైర్మన్ బర్రె కొండబాబు కి శాలువా కప్పి, మెమొంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. సంక్రాంతి సంబరాలకు వచ్చిన ప్రతి ఒక్కరికీ విశ్వేశ్వర రెడ్డి సాంప్రదాయ వంటకాలైన అరిస, పోకుండలను అందజేశారు. టగ్గాఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, డాన్స్ పోటీలు విద్యార్థులకు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, మున్సిపల్ కాలనీ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.





### ప్రజా వ్యతిరేక విధానాలపై సంక్రాంతి తర్వాత

# సిపిఐ పోరాటాలు తీవ్రతరం

**-మునగోటి శ్రీనివాసరావు**



**పల్నాడు, జనవరి 14,( మనసులో మాట):** పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు భోగిసంక్రాంతికనుమ శుభాకాంక్షలు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తెలిపారు. 75 తాళ్లూరు సిపిఐ సమితి ఆధ్వర్యంలో పి పి పి జీవో కాఫీలను ఆయన తగలబెట్టారు. శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ , సంక్రాంతి అనంతరం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపడుతున్న మత ఉన్మాదప్రైవేటీకరణ విధానాలపై సిపిఐగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. పీపీపీ పేరుతో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటు సంస్థలకు నిధులు కేటాయించడం దుర్మార్గమని విమర్శించారు. మెడికల్ కాలేజీల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జారీ చేసిన జీఓ నంబర్లు 590, 847 కాపీలను భోగిమంటల్లో రాష్ట్రవ్యాప్తంగా దహనం చేస్తామని తెలిపారు. ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ, ప్రజాసంఘాలు, విద్యార్థియువజన నాయకులపై అక్రమ కేసులు, ఉప వంటి కఠిన చట్టాల ప్రయోగాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్‌డీఏ ప్రభుత్వాల కుట్రతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన 2500 ఎకరాలను అదానీకి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలపై సంక్రాంతి తర్వాత ఉద్యమాలు నిర్వహిస్తామని, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి కల్పించండి..



**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 14:** పిఠాపురం నుంచి యు. కొత్తపల్లి, ఉప్పాడ వెళ్లే ప్రధాన రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రైల్వే గేటు వద్ద భారీ ధర్నా బుధవారం. నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ కె. చిన్న మాట్లాడుతూ, గత ప్రభుత్వం నుంచి ఈ బ్రిడ్జి నిర్మాణంపై హామీలు వస్తున్నా, ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా ఈ బ్రిడ్జి నిర్మాణానికి కే9 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు ప్రకటించిందని, అయితే పనులు ప్రారంభించడం లో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు.

**ప్రజల ఇబ్బందులు:**

రైల్వే గేటు పడిన ప్రతిసారీ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోందని, దీనివల్ల యు. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు, పాఠశాల విద్యార్థులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో చిరు వ్యాపారస్తులు కూడా ట్రాఫిక్ సమస్యతో నష్టపోతున్నారని తెలిపారు.

**ముఖ్య డిమాండ్లు:**

ప్రభుత్వం ప్రకటించిన నిధులతో తక్షణమే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి.

బ్రిడ్జి నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న గృహ యజమానులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోనేటి రాజు, కె. విశ్వనాథం, వీరబాబు, పెదపాటి సత్యనారాయణ, ఎస్. సత్తిబాబు, వై. వెంకట్రావు పలువురు కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# జోరుగా కోడిపందాలు

### హెచ్చరిక బోర్డు ఏర్పాటు కే పరిమితమైన పోలీస్ , రెవెన్యూ యంత్రాంగం

### పోలీసుల మాటలు నీటి మీద రాత



**ఎటపాక( మనసులో మాట), జనవరి 14:** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు జోరుగా సాగుతున్నాయి. విఆర్ పురం, చోడవరం, ఈజీ కోడేరు, తదితర చోట్ల బరులు ఏర్పాటుచేసి కూటమినేతలు ముందుండి కోడి పందాలు నిర్వహిస్తున్నారు. మండలంలో మునుపెన్నడూ లేని రీతిలో కూటమి ప్రభుత్వం వచ్చాక జాతీయ రహదారీ పక్కనే బరులు ఏర్పాటు చేసి కోడి పందాలు నిర్వహిస్తున్నారు. కోడిపందాలు అడ్డుకోవాలని హైకోర్టు ఆదేశాలు అమలులో నోచుకోవడం లేదు. కోడిపందాలు అడ్డుకుంటామని, నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చింతూరు ఏఎస్పి బీ హేమంత్ కుమార్ ఆదివారం నాడు ఎటపాక లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎటపాక ఎస్సై, మరియు తహసిల్దార్ మంగళవారం నాడు బరుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ పేపర్ స్టేట్మెంట్‌లలో చెప్పిన దానికి, ఆచరణలో జరుగుతున్న దానికి పొంతన లేదనీ, కోడిపందాల నిర్వహణకు, బరులు సిద్ధమ్ చేసినా చర్యలు తీసుకోవడంలో పోలీస్, రెవిన్యూ, యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందుతోందనీ పలువురు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. కోడిపందాల వద్ద జరిగే గుండాట, జూదం తో జేబులు ఖాళీ అవటం ఖాయం. కోడిపందాలు అడ్డుకుని హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే చింతూరు ఏ ఎస్ పి కోడిపందాలు నిర్వహిస్తే కట్టని చర్యలు జరుపుతామని చెప్పడంతో ఆ మాటలు నీటి మీద రాతల ఉన్నాయని కొందరు అంటున్నారు. ఎంత జరుగుతున్న పోలీసులు మాత్రం ఎందుకు మౌనంగా ఉంటున్నారు అనేది ఒక సమాధానంగా మిగిలిందా.

## పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 14:** పిఠాపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య కార్మికులకు నూతన యూనిఫామ్ దుస్తులను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు , కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు వైయస్సార్సీపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మండలి సభ్యుడు గండేపల్లి బాబి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పారిశుద్ధ్య కార్మికులకు నూతన యూనిఫామ్ వస్త్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
గురువారం 15 జనవరి 2026


# ఐనవోలు మల్లికార్జున స్వామి సేవలో మంత్రి

**హన్మకొండ, జనవరి 14 (మనసులో మాట):**

భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండ జిల్లా ఐనవోలులోని శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదమంత్రాలతో ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టాండ్‌ను మంత్రి, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణించి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు వంటి మౌలిక వసతులు సక్రమంగా అందేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఐనవోలు ఆలయ అభివృద్ధికి, జాతర నిర్వహణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. భోగి పండుగ నాడు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అభివృద్ధే సర్కార్ లక్ష్యం

- అమృత్ పథకం కింద రూ. 40 కోట్లు.. ఇంటింటికీ నల్లా నీరు
- వచ్చే నెల నుంచి అర్హులందరికీ పింఛన్లు
- భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వివేకానంద

**మంచిర్యాల, జనవరి 14 (మనసులో మాట):**

ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమృత్ పథకం కింద క్యాతనపల్లి మున్సిపాలిటీకి నలభై కోట్ల రూపాయలు మంజూరు చేశామని, ఇప్పటికే యాభై శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తామన్నారు. మున్సిపల్ వార్డుల్లో ఇళ్ళ మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను వేరే చోటికి మార్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత పదేళ్లలో పేదలకు అందని రేషన్ కార్డులను తమ ప్రభుత్వం గుర్తించి అందించిందని, చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. వచ్చే నెల నుంచి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని శుభవార్త చెప్పారు.





# మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు

## టీవీ ఛానల్ జర్నలిస్టుల అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 14:** తెలంగాణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరఫున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికారుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# చట్టప్రకారమే విలేకర్ల అరెస్ట్

## మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్, జనవరి 14 :** ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

## పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు.. హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 14:** ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొర బడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా- డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కుక్కలపై విషప్రయోగం

## ఏకంగా 600 కుక్కలు మృతి..

## ఐదుగురు సర్పంచ్‌లపై కేసులు

**కామారెడ్డి, జనవరి 14:** మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్‌పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్టేట్ అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# 15 కోట్లతో మధిర అభివృద్ధి

## భోగి రోజున పనులకు శ్రీకారం

## నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## మౌలిక వసతుల కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## ఘనంగా శంకుస్థాపన, భూమిపూజ

**మధిర, జనవరి 14 (మనసులో మాట):**

మధిర పట్టణ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసింది. సుమారు పదిహేను (15) కోట్ల రూపాయల వ్యయంతో పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) మల్లు భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు. బుధవారం మధిరలో పదిహేను కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన పనులకు ఆయన శంకుస్థాపన చేసి, భూమి పూజ నిర్వహించారు.

### మౌలిక వసతుల కల్పన..

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. భోగి పండుగ పర్వదినాన మధిర పట్టణ అభివృద్ధి కోసం భారీ నిధులతో పనులు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీపీఓ ఏ. శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీ రాజ్ ఈఈ మహేష్ బాబు, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# గొంతుకోసిన చైనా మాంజా

## వాహనదారుడు మృతి

**సంగారెడ్డి, జనవరి 14:** సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే.



హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ. 1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో 29 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఖమ్మం, జనవరి 14: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎమ్ఎస్) నేత పొడియం బుధ్రాతో పాటు డీఏకేఎమ్ఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో పాటు ఇతర మావోయిస్టులు పోలీసులు ముందు లొంగిపోయారు. తమ ఆయుధాలను సరెండర్ చేశారు. పొడియం బుధ్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది మావోయిస్టులు



ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని చెప్పారు. నక్సలిజంను వీడి సామాన్య జనజీవనాన్ని అవలంబించాలని ఈ సందర్భంగా ఇతర మావోలకు ఆయన పిలుపునిచ్చారు. కొంతకాలంగా మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతుండటంతో గోగుండ ప్రాంతంలో (దర్భా డివిజన్) ఉద్యమ ప్రాబల్యం మరింతగా తగ్గినట్టైంది. గోగుండలో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకూ తగ్గిపోయాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మావోయిస్టు మద్దతుదారుల నెట్‌వర్క్ బలహీనపడిందని, ఫలితంగా సరెండర్లు పెరిగాయని చెబుతున్నారు. జనవరి 8న దంతేవాడలో 63 మంది సరెండర్ కాగా అంతకుముందు రోజున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500 మంది లొంగిపోయారు. ఈ ఏడాది మార్చ్ 31 నాటికి నక్సలిజంను రూపుమాపాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.



# జర్నలిస్టుల అరెస్టు దారుణం

## విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు

## రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో

## మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి14(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టులు అక్రమం

## తీవ్రంగా ఖండించిన ఏపీయూడబ్ల్యూజే

**విజయవాడ,జనవరి14 :** ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టులను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వంపై విమర్శలు చేయడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మాత్రమే కారణంగా జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెర్చ్ వారెంట్ లేకుండా చానెల్ కార్యాలయంలోకి పోలీసులు ప్రవేశించి సోదాలు నిర్వహించడం పూర్తిగా అన్యాయమని అన్నారు. పండుగ సమయంలో అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల ఇళ్లలోకి వెళ్లి తలుపులు పగలగొట్టి అరెస్టులు చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. నిర్దిష్ట విధి విధానాలను పాటించకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్టు చేయడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు సుబ్బారావు.. ఇది పత్రికా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించారు. జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. టెలికాస్ట్ అయిన వార్తలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఫిర్యాదు చేయాల్సిందే తప్ప జర్నలిస్టులను అరెస్టు చేయడం సరికాదన్నారు.. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్ సుధీర్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ఏపీయూడబ్ల్యూజే డిమాండ్ చేసింది.

# ఎన్టీవీ జర్నలిస్లు అరెస్టు తొందరపాటు చర్య

## కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి



**హైదరాబాద్,జనవరి14:** ఎన్టీవీలో వచ్చిన ఓ కథనంపై రేవంత్ సర్కార్ ఓవర్ రియాక్షన్ చేస్తోంది. జర్నలిస్టులపై రేవంత్ సర్కార్ ప్రతాపంపై పౌరసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తాజాగా ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టులను కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఖండించారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం మంచిది కాదని హితవు పలికారు. నోటీసులు ఇచ్చి వ్యక్తిగతంగా వివరణ తీసుకుంటే బాగుండేదన్నారు. జర్నలిస్టుల అరెస్టులతో రాష్ట్రంలో యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. తెలంగాణ పోలీసుల చర్యలను ఖండిస్తున్నా.. తలుపులు బద్దలుగొట్టి దౌర్జన్యంగా బద్దలుగొట్టి ఇంట్లోకి వచ్చారు. పండగకు భార్యతో వెళ్తుండగా ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్‌ను లాక్కెళ్లడం సరికాదు. ప్రొసీజర్, నోటీసులు లేకుండానే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

# జిల్లాలను మారిస్తే తీవ్ర పరిణామాలు

## మాజీ స్పీకర్ మధుసూధనాచారి హెచ్చరిక

**హనుమకొండ,జనవరి14:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రతీకార పాలన కొనసాగిస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళు చెరిపేయడం రేవంత్ రెడ్డి జేజమ్మ తరం కూడా కాదన్నారు. కేసీఆర్ పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజనను చేశారని, జిల్లాలను మార్చే దుర్మార్గానికి ఒడిగడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. చేతనైతే ఇచ్చిన హామీ ప్రకారం సాగు సాయాన్ని పెంచి అందించాలని, ఏదో ఒక సాకుతో జిల్లాలలో మార్పులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో మార్పులు జరుగుతే తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాడే పార్టీ బీఆర్ ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. గతానికి అదనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతగల ప్రభుత్వం దానికి భిన్నంగా జిల్లాలు కుదిస్తాం, మార్చేస్తాం అనే బాధ్యతారాహిత ప్రకటనలతో గందరగోళం సృష్టించి వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమన్నారు. సమావేశంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్లు సోదా కిరణ్, నాయకులు ఇమ్మడి రాజు, శోభన్, సల్వాజీ రవీందర్ రావు, పానుగంటి శ్రీధర్, ఎండీ గౌస్‌ఖాన్, ఏలిషా, సౌరం రఘు, సంపతి రఘు, ఎస్కే మహిమూద్ పాల్గొన్నారు.

# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన
- అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 14:** సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ నేతల అవకతవకలపై సిట్ వేయండి



- జర్నలిస్టులపైనే సిట్ ఎందుకు
- అన్నింటిపైనా దమ్ముంటే విచారణ జరపండి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్

**హైదరాబాద్, జనవరి 14:** జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిళ్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమిషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమిషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమిషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.

# ఉత్సాహంగా సాగిన కైట్ ఫెస్టివల్

## పరేడ్ గ్రౌండ్‌లో సందడిగా ఎగిరిన పతంగులు

## నోరూరించేలా స్వీట్ స్టాల్స్



**హైదరాబాద్,జనవరి14:** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 'అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ 2026' ప్రారంభమైంది. రంగురంగుల పతంగులతో భాగ్యనగర ఆకాశం ఒక అద్భుతమైన కాన్వాస్‌లా మారిపోయింది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలో ప్రపంచం నలుమూలల నుంచి కైట్ ఫ్లయర్స్ తరలివచ్చారు. రష్యా, పోర్చుగల్, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్, ఉక్రెయిన్, వియత్నాం, జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా వంటి 19 దేశాల నుండి 40 మంది నిపుణులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అలాగే భారత దేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ స్థాయి కైట్ ప్లేయర్స్ పాల్గొని వైవిధ్యమైన పతంగులను ఎగురవేస్తున్నారు. భూమి నుండి ఆకాశానికి రంగురంగుల సందేశాలు పంపుతున్నారా అన్నట్టుగా గ్రౌండ్ అంతా పతంగులతో నిండి పోయింది. డాల్ఫిన్లు, కార్టూన్ క్యారెక్టర్లు, డ్రాగన్లు, భారీ ఆకారాల్లో ఉన్న గాలిపటాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడి ప్రజల ఉత్సాహం, ఆతిథ్యం అద్భుతం అని అంతర్జాతీయ ఫ్లయర్స్ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది మరికొన్ని పతంగులతో పాటు ప్రత్యేక ఆకర్షణలు కూడా తోడయ్యాయి. అక్కడ వివిధ రాష్ట్రాల సంప్రదాయ మిఠాయిల స్టాల్స్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. జనవరి 16 నుంచి 18 వరకు పరేడ్ గ్రౌండ్‌లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, అలాగే గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్ కూడా జరగనున్నాయి. ఇదిలావుంటే కైట్ ఫెస్టివల్‌కు తోడు స్వీట్ ఫెస్టివల్ కూడా అలరించింది. రకరకాల స్వీట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



# వ్యక్తిత్వ హననం జరిగితే సహించం

## వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు వార్తలు సరికాదు

## మహిళా ఐఎఎస్ కేసుపై డిజిపి శివధర్ రెడ్డి స్పందన



**హైదరాబాద్, జనవరి 14 :** చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్లలో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు. వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననంపై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశర చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్క్యులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరోమారు స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్దాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# లోక కళ్యాణార్థం ఎల్లమ్మకు బోనాలు

- సంక్రాంతి పీడ దినాల వేళ హిజ్రాల ప్రత్యేక పూజలు
- ఇంద్రమ్మ కాలనీలో డప్పు చప్పుళ్లతో సందడి
- ప్రజల క్షేమం కోసమేనని తెలిపిన అధ్యక్షురాలు సునీత




**మనసులో మాట - సిద్దిపేట**

సంక్రాంతి పీడ దినాల వేళ ప్రజలకు ఎలాంటి కీడు జరగకూడదని ఆకాంక్షిస్తూ, లోక కళ్యాణార్థం హిజ్రాల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మంగళవారం సిద్దిపేటలోని ఇంద్రమ్మ కాలనీ నుండి డప్పు చప్పుళ్ల నడుమ, భక్తి శ్రద్ధలతో ఈ బోనాల శోభాయాత్ర వైభవంగా సాగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ.. సంక్రాంతి సమయంలో పీడ దినాలు ఉంటాయని ప్రజల్లో నమ్మకం ఉందని గుర్తుచేశారు. ఈ సమయంలో ప్రజలకు హాని కలగకుండా, గ్రామంలో శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం నెలకొనాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. డప్పు వాయిద్యాలు, ఆటపాటలు, నృత్యాలతో అమ్మవారి ఉత్సవం కోలాహలంగా సాగింది. అమ్మవారి నామస్మరణతో పరిసరాలు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో రజిని, ప్రశాంతి, కరిష్మా, అంకిత, చిన్నారి నవీన్, కళ్యాణి తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# సిద్దిపేట పదో వార్డులో ముగ్గుల పోటీలు

- 150 మందికి పైగా మహిళల ఉత్సాహం
- ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు
- అలరించిన గంగిరెద్దుల విన్యాసాలు




**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేట పట్టణంలోని పదో (10వ) వార్డులో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. బింగి బాలలక్ష్మీ ఉ రాజేశం ఆధ్వర్యంలో, బి.ఆర్.ఎస్ (దీ=హా) పార్టీ మహిళా విభాగం మరియు యువజన విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్రాంతి వంటి పండుగలు మన సంస్కృతికి ప్రతీకలని అన్నారు. మహిళలు, యువత ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని కొనియాడారు. వార్డులో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు నూట యాభై (150) మందికి పైగా మహిళలు, యువతులు చిన్నాపెద్ద తేడా లేకుండా అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో, ఆకట్టుకునే డిజైన్లతో వార్డు అంతా పండుగ శోభతో కళకళలాడింది. అనంతరం విజేతలకు చైర్మన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గంగిరెద్దుల సందడి పోటీల సమయంలో గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మన ప్రాచీన సంప్రదాయాన్ని కళ్లకు కట్టినట్లు చూపిన గంగిరెద్దుల ఆటను పిల్లలు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు. ఈ విన్యాసాలను వీక్షించిన మున్సిపల్ చైర్మన్ కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, చేర్యాల వెంకన్న, డాక్టర్ విటోబా, డాక్టర్ చంద్రారెడ్డి, వినయ్ రాజ, విజయ్ తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

# తడకపల్లిలో ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

- సంక్రాంతి సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన సర్పంచ్, ఉప సర్పంచ్
- యువతను క్రీడల వైపు మళ్లించడమే లక్ష్యం



**మనసులో మాట- సిద్దిపేట**

సిద్దిపేట మండలం తడకపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. పండుగను పురస్కరించుకుని గ్రామ బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు బైండ్ల సాయిలు, గ్రామ ఉప సర్పంచ్ అల్లిమెల్లి నరేందర్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గ్రామానికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాస్ఫూర్తితో ఉత్సాహంగా పోటీపడ్డారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో గెలుపొందిన జట్లకు గ్రామ సర్పంచ్ తోడంగల వెంకటేష్, ఉప సర్పంచ్ మహేందర్ తమ చేతుల మీదుగా నగదు బహుమతులు, ఇతర కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ అల్లిమెల్లి నరేందర్ మాట్లాడుతూ.. తాను ఎల్లవేళలా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆధ్వర్యంలో యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచుతూ క్రీడల వైపు మళ్లించేందుకు ఇదొక మంచి ప్రయత్నమని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు సేవ చేయడంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు బైండ్ల సాయిలు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, కనకయ్య, ఆగం రెడ్డి, రమేష్ యాదవ్ రెడ్డి, పులి రాజు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



# బిచ్కుంద పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్న సర్పంచ్ విఠల్ రావు

**శ్రీ సోమలింగ శివాచార్య స్వామీజీకి ఘన సన్మానం**

**శాలువా కప్పి ఆశీర్వాదం తీసుకున్న శేట్లూర్ సర్పంచ్**

**జుక్కల్ - మనసులో మాట**

బిచ్కుంద సంస్థాన మఠం పీఠాధిపతి శ్రీ 108 ష. బ్ర. సోమలింగ శివాచార్య మహా స్వామీజీని శేట్లూర్ గ్రామ సర్పంచ్ కాళోజీ విఠల్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం మఠానికి వెళ్లిన ఆయన, స్వామీజీని శాలువాతో ఘనంగా సన్మానించి, వారి దివ్య ఆశీస్సులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు శేట్లూర్ గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు శంకర్ పటేల్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మరియు మాజీ ఎంపీటీసీ (వీుజ) తేజ రావు పటేల్, కాంగ్రెస్ నాయకులు కాళోజీ నాగ్ నాథ్ పాల్గొన్నారు.

# బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన యువ నాయకులు చింతల్ సుభాష్

**రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు ఎన్నికల్లో పోటీ**

**జుక్కల్- మనసులో మాట**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తానని జనసేన యువ నాయకులు చింతల్ సుభాష్ తెలిపారు. రాష్ట్ర నాయకుల ఆదేశాలు ప్రకారం తను పోటీ చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజాసేవ కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. అధ్యక్షులు పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్, కార్యదర్శి రామ్ తల్లూరి ఆధ్వర్యంలో పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి తాను కట్టుబడి ఉంటానని అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఒక అవకాశం ఇవ్వండి అన్ని రకాల సమస్యలు పరిస్తారని తెలిపారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.



## మకర సంక్రాంతి సందర్భంగా మణికంఠ స్వామి తిరు ఆభరణాల ఊరేగింపు




**సంగారెడ్డి - మనసులో మాట**

మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మణికంఠ స్వామి వారి తిరుఆభరణాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాహితీ రాము గురు స్వామి ఆధ్వర్యంలో సంజీవ్ నగర్ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి శ్రీ నవరత్నాలయ దేవస్థానం వరకు మంగళ వాయిద్యాల నడుమ అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి జి ఐ ఐసి చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి హాజరై ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మకర సంక్రాంతి పర్వదినం ఆధ్యాత్మికత, సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వాములు, సివిల్ స్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు.

## వైభవంగా గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవం



**బెజ్జంకి, జనవరి 14 (మనసులో మాట)**

బెజ్జంకి మండలంలోని బెజ్జంకి మండల కేంద్రంలో, కల్లేపల్లి గ్రామాలలో బుధవారం గోదాదేవి, రంగనాయకుల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో, కల్లేపల్లి గ్రామంలోని వెంకటేశ్వర ఆలయంలో ఈ కళ్యాణ మహోత్సవం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన పూజారి శేషం మధుసూదనాచారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలపించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉప సర్పంచ్ ధూమాల మహేష్ లతోపాటు వార్డు సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ మణికంఠ స్వామి తిరుఆభరణాల ఊరేగింపు


**ఘనంగా మకర సంక్రాంతి వేడుకలు**



**జుక్కల్- మనసులో మాట**

మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మణికంఠ స్వామి వారి తిరుఆభరణాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురు స్వామిల ఆధ్వర్యంలో బిచ్కుంద అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి గ్రామ పురవీధుల గుండ మంగళ వాయిద్యాల నడుమ అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు సాగింది. కన్నుల పండుగ గా ప్రత్యేక అభిషేకాలు పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మకర సంక్రాంతి పర్వదినం ఆధ్యాత్మికత, సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వాములు, సివిల్ స్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు.

## వైభవంగా శ్రీ అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు



**సంగారెడ్డి - మనసులో మాట**

మకర సంక్రాంతిని పురస్కరించుకుని సదాశివపేట పట్టణంలో శ్రీ అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మందిర్ సేవా సమితి పెద్దలు శంకర్ గురుస్వామి, సుధాకర్ గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 రోజుల మాలధారణ చేసిన స్వాములు ఆభరణాలను నెత్తిన ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, కోలాటం, భజన కీర్తనలతో పట్టణ వీధుల గుండా సాగిన ఊరేగింపు అనంతరం అయ్యప్ప మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శబరి దివ్యజ్యోతి దర్శనం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# గజ్వేల్ 18వ వార్డులో ఘనంగా గాలిపటాల పండుగ

**రామాలయం వద్ద కైట్స్ ఫెస్టివల్.. చిన్నారులకు ఉచిత పంపిణీ**

**చైనా మాంజా వాడొద్దు.. జాగ్రత్తలు తప్పనిసరి: గాడిపల్లి భాస్కర్**

**నిర్వాహకుడు కాశమైన సందీప్ కుమార్‌కు అభినందనలు**



**గజ్వేల్ -మనసులో మాట**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పద్దెనిమిదవ (18వ) వార్డు రామాలయం వద్ద సంక్రాంతి సందడి నెలకొంది. వార్డుకు చెందిన యువ నాయకుడు కాశమైన సందీప్ కుమార్ ఆధ్వర్యంలో 'కైట్స్ ఫెస్టివల్' (గాలిపటాల వేడుక) ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ, పిల్లలకు ఉచితంగా గాలిపటాలు (పతంగులు), దారం చక్రాలను కాశమైన సందీప్ కుమార్ అందజేశారు. పిల్లల ముఖాల్లో ఆనందం చూసేందుకు సొంత ఖర్చుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన సందీప్ ను గాడిపల్లి భాస్కర్, ఇతర బిజెపి నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ.. పిల్లలు అత్యంత ప్రమాదకరమైన చైనా మాంజాను వాడకూడదని హితవు పలికారు. గాలిపటాలు ఎగురవేసేటప్పుడు విద్యుత్ తీగలు, భవనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సంతోషకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, ఎల్లు రామిరెడ్డి, కుడికియాల రాములు, కమ్మరి శ్రీను, వెంకట్ రెడ్డి, నాయిని సందీప్, నరసింహ ముదిరాజ్, సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, నాగు ముదిరాజ్, కాళ్ల సాయి, హరి, వెంకటేష్, కాశమైన ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నిట్టూరు కబడ్డీ పోరులో నిమ్మనపల్లి విజయం

**హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్**

**విజేతలకు నగదు బహుమతులు అందజేసిన సర్పంచులు**

**బొంపల్లి జట్టుకు దక్కిన రెండో స్థానం**



**పెద్దపల్లి - మనసులో మాట**

పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన 'అండర్-16' కబడ్డీ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్ (తుది పోరు)లో బొంపల్లి మరియు నిమ్మనపల్లి గ్రామాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ పోరులో చివరకు నిమ్మనపల్లి జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. పోటీలో గెలుపొందిన జట్లకు సర్పంచులు వేల్పుల రమేష్, ఆకుల సువర్ణ - శ్రీనివాస్ దంపతులు బహుమతులను అందజేశారు. విజేతగా నిలిచిన నిమ్మనపల్లి జట్టు ఐదు వేల రూపాయల (రూ. 5,000) నగదు బహుమతిని కైవసం చేసుకుంది.రన్నరప్ గా నిలిచిన బొంపల్లి జట్టు రెండు వేల ఐదు వందల రూపాయల (రూ. 2,500) నగదు బహుమతిని దక్కించుకుంది.క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు ఇద్దరు సర్పంచులు కలిసి, విజేతగా నిలిచిన నిమ్మనపల్లి జట్టుకు అదనంగా వెయ్యి పదహారు రూపాయల (రూ. 1,016) ప్రోత్సాహక బహుమతిని అందజేశారు.ఈ బహుమతి ప్రదానోత్సవంలో సర్పంచులు వేల్పుల రమేష్, ఆకుల సువర్ణ - శ్రీనివాస్, బొంపల్లి సర్పంచ్ దాడి మాణిక - సంతోష్, ఉప సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు. గ్రామ యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జట్లను ఉత్సాహపరిచారు.

# చిన్న శంకరంపేటలో రంగులద్దిన సంక్రాంతి.. ముగ్గుల పోటీల్లో విజేతగా మాలతి

**సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**



**చిన్న శంకరంపేట - మనసులో మాట :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్న శంకరంపేటలో పండుగ వాతావరణం నెలకొంది. సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన ఇరవై ఎనిమిది (28) మంది మహిళలు పాల్గొని, తమ నైపుణ్యంతో రంగురంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ పోటీలో మాలతి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, కావ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే సంతోష తృతీయ స్థానాన్ని, పూజ నాలుగవ స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలకు సర్పంచ్ చంద్రశేఖర్ నగదు బహుమతులను అందజేసి అభినందించారు. కేవలం విజేతలకే కాకుండా, పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక (కన్సోలేషన్) బహుమతులను అందించి నిర్వాహకులు ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాను ప్రసాద్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బండయప్ప మఠాన్ని కాంగ్రెస్ భవనంగా మార్చారు

- రాజకీయాలు చేయాలనుకుంటే ప్రత్యక్షంగా రావాలి.. తాడోపేడో తేల్చుకుందాం
- మఠాధిపతి సోమయప్ప స్వామిపై మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ధ్వజం
- బిచ్కుందలో రోడ్డుపై ముగ్గులు వేసి వినూత్న నిరసన
- సెంట్రల్ లైటింగ్ పనుల్లో జాప్యంపై మండిపాటు



**జుక్కల్- మనసులో మాట**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనుల జాప్యంపై మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో రోడ్డుపై ముగ్గులు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మఠాధిపతి తీరుపై, అధికార పార్టీ నిర్లక్ష్యంపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన సెంట్రల్ లైటింగ్ పనులను, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని హన్మంత్ షిండే మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమస్యలపై ప్రశ్నించిన బిచ్కుంద యువకులపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ఆయన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును సూటిగా ప్రశ్నించారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టే సంస్కృతిని మానుకోవాలని హితవు పలికారు. ఎంతో పవిత్రమైన బండయప్ప మఠాన్ని, ప్రస్తుత మఠాధిపతి సోమయప్ప స్వామి కాంగ్రెస్ భవనంగా మార్చేశారని షిండే తీవ్ర ఆరోపణలు చేశారు. స్వామికి రాజకీయాలపై ఆసక్తి ఉంటే పరోక్షంగా కాకుండా, ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని సవాల్ విసిరారు. "రాజకీయాల్లోకి రండి.. అప్పుడు తాడోపేడో తేల్చుకుందాం" అని వ్యాఖ్యానించారు. పవిత్రమైన మఠాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదని హితవు పలికారు. వెంటనే సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయకపోతే నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నలచారి బాలాజీ, శ్రీనివాస్, ఎన్. శ్రీనివాస్, యాదవ్, హాజీ లక్ష్మణ్, డాక్టర్ రాజు, పిట్ల సాయికుమార్, దర్పల అశోక్, చాకలి విట్టల్, అవర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు



- ఘనంగా ముగ్గుల పోటీలు.. విజేతలకు బహుమతుల ప్రదానం
- అపార్టుమెంట్ల సంస్కృతిలోనూ సంప్రదాయాన్ని కాపాడుకోవాలి
- కొమిరిశెట్టి ఫౌండేషన్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు

**శేరిలింగంపల్లి - మనసులో మాట**

మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు అని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం మియాపూర్ ప్రాంతంలో ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. కొమిరిశెట్టి ఫౌండేషన్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మియాపూర్ లోని టీ.ఎన్ నగర్, స్టాలిన్ నగర్, వేముకుంట మహిళా భవన్ ప్రాంగణాల్లో మహిళలకు ఈ పోటీలను నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా, కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ.. పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు అని అభివర్ణించారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. ప్రస్తుత పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తర్వాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరం కూడా మన ప్రాచీన సంస్కృతిని కొనసాగించేలా ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాళ్లు చంద్రకళ, రాణి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొని పోటీదారులను ఉత్సాహపరిచారు.



# తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

**సర్పంచ్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు**

**జుక్కల్, బిచ్కుంద, గుండె నెమలి వాసులకు పండుగ శుభాకాంక్షలు**

**రైతులకు, వ్యవసాయానికి ఇచ్చే గౌరవమే ఈ పండుగ**

**జుక్కల్ - మనసులో మాట**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా బిచ్కుంద మరియు గుండె నెమలి గ్రామ ప్రజలకు గుండె నెమలి సర్పంచ్ మోహన్ రెడ్డి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. మన అచ్చ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు, సొంత గ్రామాల మీద ఉండే మమకారానికి ఈ పండుగ నిలువుటద్దమని మోహన్ రెడ్డి అన్నారు. రైతులకు, వ్యవసాయానికి మనమంతా ఇచ్చే గౌరవానికి, తెలుగువారికంటూ ప్రత్యేకమైన కళలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని అభివర్ణించారు. సంక్రాంతి పండుగను అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంటా భోగభాగ్యాలు కలగాలని, పాడి పంటల అభివృద్ధి, ఆయురారోగ్యాలతో అందరూ వర్ధిల్లాలని కోరారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. అలాగే పతంగులు ఎగురవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

# ఆర్టీసీ కాలనీలో రంగు రంగుల ముగ్గుల సందడి

**అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పోటీలు**

**ప్రథమ బహుమతి గెలుచుకున్న మానస, వైష్ణవి**

**సంస్కృతి, ఐక్యతకు అద్దం పట్టిన వేడుకలు**



**శేరిలింగంపల్లి - మనసులో మాట**

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గం, మదీనగూడలోని ఆర్టీసీ కాలనీలో ముగ్గుల పోటీలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆర్టీసీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ సృజనాత్మకతతో రంగురంగుల ముగ్గులు వేసి అలరించారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ పోటీల్లో విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. ఇందులో మానస, వైష్ణవి ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా.. మైథిలి, మేఘన, కావ్య, విరూప ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. అలాగే కె. ప్రసన్న తృతీయ బహుమతిని సొంతం చేసుకున్నారు. విజేతలను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. కేవలం పోటీల కోసమే కాకుండా, సమాజంలోని ఐక్యత, సృజనాత్మకత, సాంస్కృతిక బలాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం జరిగిందని గుర్తుచేశారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బి.ఎస్.ఎన్. సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి ఏ. కృష్ణ కిరీటి (కిట్టు), సంయుక్త కార్యదర్శులు ఎస్. కొండల్ రావు, కె. రమేష్, డి. రమణ, ఏ.ఎన్. శ్రీనివాసరావు, ఖజాంచి జి. రమేష్ కుమార్, ప్రధాన సలహాదారు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే వాల హరీష్ రావు, బాబు మోహన్ మల్లేశ్, గంగారం సంగారెడ్డి, జనార్ధన్ గౌడ్, ఏ. సత్యనారాయణ రావు, జె. కృష్ణ రావు, సూర్యనారాయణ రావు, సిద్దేశ్వర్ రెడ్డి, రామ్ బాబు, రవి కుమార్, సంజీవ రెడ్డి, లోకేష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# మంథని 'ముకాస' యువజన అధ్యక్షుడిగా దండే రాకేష్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం నాయకులు
- రైతులు, విద్యార్థుల సమస్యలపై పోరాడాలి
- మండల అధ్యక్షులు బుద్దార్థి సత్యనారాయణ దిశానిర్దేశం



**పెద్దపల్లి - మనసులో మాట**

మంథని మండల మున్నూరు కాపు సంఘం (ముకాస) యువజన విభాగం నూతన అధ్యక్షుడిగా దండే రాకేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మంథనిలో జరిగిన సంఘం సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బండి సంజీవ్, జిల్లా అధ్యక్షులు తొగరి సురేష్ ఆదేశాల మేరకు.. మండల అధ్యక్షులు బుద్దార్థి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. యువజన నాయకుడిగా దండే రాకేష్ పేరును ప్రతిపాదించగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ నూతన కమిటీకి దిశానిర్దేశం చేశారు. మున్నూరు కాపు రైతులు మరియు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యువత నడుం బిగించాలన్నారు. ముఖ్యంగా బి.సి (వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్ల సాధన కోసం ముందుండి పోరాడాలని, సమాజ సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్లాస్‌పూర్ సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్, ఈసంపెల్లి ప్రసాద్, కాసర్ల శ్రీనివాస్, భద్రపు శ్రీనివాస్, రావుల స్వామి, బుద్దార్థి లక్ష్మణ్, బండి శంకర్, నరేష్, ఎడ్ల తిరుపతి, చిగురు రాములు, రాజు మరియు ఇతర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# మల్లన్నపేటలో రంగులద్దిన సంక్రాంతి

- ఘనంగా ముగ్గుల పోటీలు
- స్టవ్ గెలుచుకున్న గుండా శ్వేత, ప్రెషర్ కుక్కర్ సొంతం చేసుకున్న దాసరి కార్తీక
- నలభై ఐదు మంది మహిళల ఉత్సాహభరిత పోటీ
- విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులు

**గొల్లపల్లి - మనసులో మాట**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండుగను పురస్కరించుకుని గ్రామ ఉప సర్పంచ్ ముత్యాల స్వామి ఆధ్వర్యంలో స్థానిక మల్లన్న గుడి ఆవరణలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన నలభై ఐదు (45) మంది మహిళలు, పిల్లలు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ పోటీలో గుండా శ్వేత ప్రథమ స్థానంలో నిలిచి స్టవ్ ను బహుమతిగా గెలుచుకోగా, దాసరి కార్తీక ద్వితీయ స్థానంతో ప్రెషర్ కుక్కర్ ను సొంతం చేసుకున్నారు. అలాగే తోట మాధవి తృతీయ బహుమతిగా ఐరన్ బాక్స్ ను, నమిలికొండ అవిఘ్న నాలుగవ బహుమతిగా వాటర్ హీటర్ ను అందుకున్నారు. ఇక ఐదవ బహుమతిని మధు షైనీ గెలుచుకున్నారు. మిగిలిన పోటీదారులందరికీ ప్రోత్సాహక బహుమతులుగా టీ కప్పులను అందజేసి అభినందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయురాలు అమరేశ్వరి, జిల్లా బీసీ మహిళా అధ్యక్షురాలు గంగాజల, పద్మశాలి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమాంజలి వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ చైర్మన్ బీమా సంతోష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ సర్పంచులు అబ్బాపూర్ వెంకటేష్, భీమ్రాజపల్లి సత్తన్న, బేర కిషోర్, కాంగ్రెస్ నాయకులు కొండ్ర గంగారెడ్డి, వార్డ్ మెంబర్ బాలయ్య, బొల్లి మహేష్, రాజన్న తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

# ఫిర్యాదులు చెత్త బుట్టపాలు

- గజ్వేల్‌లో అధికారుల నిర్వాకం
- ఓటరు జాబితాల్లో గందరగోళం.. ప్రజాస్వామ్యంపై అధికారుల ఆటలు
- ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు వార్డుల్లో ఓట్లు
- తప్పులు సరిచేయకుంటే ఎన్నికలను అడ్డుకుంటాం
- మున్సిపల్ అధికారులపై భగ్గుమన్న బిజెపి నేతలు



**గజ్వేల్ - మనసులో మాట**

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ఉప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రక్రియను అధికారులు అపహాస్యం చేస్తున్నారని, వారు తయారు చేసిన ఓటరు జాబితాలు (లిస్టులు) తీవ్ర వివాదాస్పదంగా మారాయని భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకులు మండిపడ్డారు. అధికారుల తీరు ఎన్నికల వ్యవస్థకే మచ్చ తెచ్చేలా ఉందని ఆరోపించారు. గజ్వేల్ బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టెలికాం బోర్డు మెంబర్ కమ్మరి శ్రీనివాస్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఒకే ఇంట్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల ఓట్లను వేర్వేరు వార్డులకు చీల్చారని, భార్యాభర్తలను, పిల్లలను విడదీసి వేర్వేరు చోట్ల నమోదు చేయడం ద్వారా అధికారులు ప్రజాస్వామ్యపు మౌలిక హక్కులకే ముప్పు తెచ్చారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ ఘోర తప్పిదాలను సరిచేయాలని తాము పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులను అధికారులు ఏకంగా చెత్త బుట్టలో వేసిన దృశ్యాలను తాము సాక్ష్యాలతో సహా సేకరించామని తెలిపారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసే నిరంకుశ ధోరణికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటరు జాబితా సవరణ పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ఎవరి ఆదేశాలతో ఈ గందరగోళం సృష్టిస్తున్నారని ప్రశ్నించారు.

## న్యాయ పోరాటం చేస్తాం..

తప్పులతడకలతో రూపొందించిన ఓటరు జాబితాను తక్షణమే రద్దు చేసి, పూర్తిస్థాయి సవరణ చేపట్టాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే వార్డులో ఉండేలా పారదర్శక ప్రక్రియను అమలు చేయాలని కోరారు. లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి, రానున్న మున్సిపల్ ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే అధికారుల తీరును గజ్వేల్ ప్రజలు సహించబోరని, దీనిపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఎల్లు రామ్ రెడ్డి, కుడిక్యాల రాములు, పేర్ల శ్రీనివాస్, గజ్వేల్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, చెప్యాల వెంకట్ రెడ్డి, నాయిని సందీప్ కుమార్, మడుగురి నరసింహ, వడ్డేపల్లి ప్రసాద్, కాశమైన సందీప్, బారు అరవింద్, నాగు ముదిరాజ్, మంద వెంకట్, దువ్వల రాజు యాదవ్, హరి కుమార్, భాస్కర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, పోకల ప్రభాకర్, కరుణాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, పాల్గొన్నారు.

# పండుగ పూట విషాదం.. రోడ్డు ప్రమాదంలో అల్లుడు మృతి

మామకు తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

వంతెన పైనుంచి కిందపడ్డ ద్విచక్ర వాహనం

బెజ్జూర్ మండలం కుంటలమానెపల్లి సమీపంలో ఘటన



**కొమురం భీం జిల్లా - మనసులో మాట**

పండుగ వేళ ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ద్విచక్ర వాహనం అదుపుతప్పి వంతెన పైనుంచి పడిపోవడంతో అల్లుడు అక్కడికక్కడే మృతి చెందగా, మామకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ హృదయ విదారక సంఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌటాల మండలానికి చెందిన చంద్రశేఖర్, బెజ్జూర్ మండలం బోర్ కుట్ గ్రామానికి చెందిన శంకర్ వరసకు అల్లుడు, మామ అవుతారు. వీరిద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బెజ్జూర్ మండలంలోని కుంటలమానెపల్లి – అందుగులగూడ ప్రధాన రహదారిపై ప్రమాదం జరిగింది. మార్గమధ్యలో ఉన్న ఓ వంతెన (ఒర్రె) వద్ద వాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు కిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న చంద్రశేఖర్ తలకు బలమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. వెనుక కూర్చున్న శంకర్ కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే '108' అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. పండుగ రోజున అల్లుడు మృతి చెందడం, మామ ఆసుపత్రి పాలవడంతో ఇరు కుటుంబాల్లోనూ, గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

# చేగుంటలో చైనా మాంజా కలకలం.. మహిళ కాలికి తీవ్ర గాయం

నిషేధిత దారం ధాటికి చందంపేట వాసికి లోతైన గాయం

అధిక రక్తస్రావం.. ఆస్పత్రికి తరలించిన స్థానికులు

అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**చేగుంట - మనసులో మాట**

ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, నిషేధిత చైనా మాంజా జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతూనే ఉంది. తాజాగా చేగుంట మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్న ఘటన ఇందుకు నిదర్శనంగా నిలిచింది. గాలిపటాల సరదా ఒక అమాయకపు మహిళ పాలిట శాపంగా మారింది. చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన చేరి మన్నెమ్మ అనే మహిళ చేగుంటలో వెళ్తుండగా, అకస్మాత్తుగా గాలిపటం దారం (చైనా మాంజా) ఆమె కుడి కాలికి బలంగా చుట్టుకుంది. ఆ దారం పదునుకు కాలు లోతుగా తెగిపోయి, తీవ్ర రక్తస్రావం జరిగింది. బాధితురాలి ఆర్తనాదాలు విన్న స్థానికులు వెంటనే స్పందించి, మానవత్వంతో ఆమెను చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వం, పోలీసులు చైనా మాంజాను వాడవద్దని పదేపదే హెచ్చరిస్తున్నా.. ఎక్కడో ఒకచోట ఈ అమ్మకాలను, వినియోగాన్ని అడ్డుకోలేకపోతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకొని, మరెవరూ దీని బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# గంజాయితో పట్టుబడ్డ యువకుడు.. ఇద్దరిపై కేసు నమోదు

చందోలి శివారులో పోలీసుల తనిఖీలు

ఎనభై తొమ్మిది గ్రాముల గంజాయి స్వాధీనం

డబ్బు కోసమే అడ్డదారులు.. విచారణలో వెల్లడి

వివరాలు వెల్లడించిన ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి



**గొల్లపల్లి - మనసులో మాట**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. చందోలి గ్రామ శివారులో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. యువకుడి వద్ద నుంచి ఎనభై తొమ్మిది (89) గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చందోలి శివారు రోడ్డులో ఒక యువకుడు గంజాయితో వెళ్తున్నాడన్న పక్కా సమాచారం పోలీసులకు అందింది. దీంతో వారు వెంటనే అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. అటుగా వస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని సోదా చేయగా, అతడి వద్ద గంజాయి లభించింది. పట్టుబడిన యువకుడిని వెల్గటూర్ మండలం జగదేవ్ పేట గ్రామానికి చెందిన బచ్చల రామ్ చరణ్ గా గుర్తించారు. పోలీసుల విచారణలో అతను పలు విషయాలు వెల్లడించాడు. తాను చెడు వ్యసనాలకు బానిసయ్యానని, తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి విక్రయానికి దిగినట్లు తెలిపాడు. ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సాయి సిద్ధు వర్ధన్ అనే వ్యక్తి దగ్గర దీనిని కొనుగోలు చేసి, ఇతరులకు అమ్ముతానని ఒప్పుకున్నాడు. ఈ ఘటనపై గొల్లపల్లి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి స్పందిస్తూ.. గంజాయి కలిగి ఉన్న రామ్ చరణ్ తో పాటు, దానిని సరఫరా చేసిన సాయి సిద్ధు వర్ధన్ పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

మామిడి తోరణాలతో అందంగా అలంకరించుకున్న ఇళ్లు, ఇంటి ముందు అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు.. భోగి మంటలు, వేకువజామునే జంగమదేవరల జేగంటలు, ఢమరుక నాదాలూ.. హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల దీవెనలు, పిట్టల దొరల బడాయి మాటలు.. కొత్త బట్టలు కట్టుకున్న చిన్నారుల సందడి, కొత్త అల్లుళ్ళు, బావమరదళ్ల సరదాలు, బంధువులందరూ ఒక్కటిగా చేరి తీపి కబుర్లు చెప్పుకుంటూ చేసుకునే రకరకాల పిండి వంటలు, పశువులను పూజిస్తూ.. ఇంటికి చేరిన పంటలతో.. రైతుల ఆనందాలు.. ఇలా తెలుగు లోగిళ్లలో కొత్త వెలుగులు నింపే సంక్రాంతి వైభవం ఇది. తెలుగు వారికి ఈ పండుగ ఒక వరం. ఆభరణం. ఇటువంటి గొప్ప ఆచార వ్యవహారాలు నేడు ఆధునికత ముసుగులో కళ తప్పాయి. పండుగ అంటే ఉరుకుల పరుగుల జీవితంలో ఒక సెలవు రోజులుగా చూస్తున్న రోజులు వచ్చాయి. కుటుంబ సభ్యులు అంతా ఒకచోట చేరి కబుర్లు చెప్పుకుంటూ రకరకాల పిండి వంటలు చేసుకోవడంలో ఆంతర్యాన్ని అర్థం చేసుకునే కనీస పరిజ్ఞానం కొరవడింది.

## కానరాని సాంప్రదాయ సంబరాలు, జానపద కళా రూపాలు

### సంక్రాంతి పండగ పూటా కళాకారుల ప్రదర్శనలు లేక

## పల్లె కన్నీరు పెడుతోంది

- సంస్కృతి, సంప్రదాయాలు బ్రతికితే వృత్తులు బ్రతుకుతాయి
- ఆధునికత పేరుతో వృత్తులు వ్యాపారమయ్యాయి
- తరాలుగా వస్తున్న ఆచారాలను పాఠాలుగా విద్యార్థులకు బోధించాలి
- వృత్తిని నమ్ముకున్న కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి
- భావితరాలకు భవిష్యత్తును ఇవ్వడం మన బాధ్యత
- మన సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలి

# సంక్రాంతి కళ తప్పుతోంది




మామిడి తోరణాలతో అందంగా అలంకరించుకున్న ఇళ్లు, ఇంటి ముందు అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు.. భోగి మంటలు, వేకువజామునే జంగమదేవరల జేగంటలు, ఢమరుక నాదాలూ.. హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల దీవెనలు, పిట్టల దొరల బడాయి మాటలు.. కొత్త బట్టలు కట్టుకున్న చిన్నారుల సందడి, కొత్త అల్లుళ్ళు, బావమరదళ్ల సరదాలు, బంధువులందరూ ఒక్కటిగా చేరి తీపి కబుర్లు చెప్పుకుంటూ చేసుకునే రకరకాల పిండి వంటలు, పశువులను పూజిస్తూ.. ఇంటికి చేరిన పంటలతో.. రైతుల ఆనందాలు.. ఇలా తెలుగు లోగిళ్లలో కొత్త వెలుగులు నింపే సంక్రాంతి వైభవం ఇది. తెలుగు వారికి ఈ పండుగ ఒక వరం. ఆభరణం. ఇటువంటి గొప్ప ఆచార వ్యవహారాలు నేడు ఆధునికత ముసుగులో కళ తప్పాయి. పండుగ అంటే ఉరుకుల పరుగుల జీవితంలో ఒక సెలవు రోజులుగా చూస్తున్న రోజులు వచ్చాయి. కుటుంబ సభ్యులు అంతా ఒకచోట చేరి కబుర్లు చెప్పుకుంటూ రకరకాల పిండి వంటలు చేసుకోవడంలో ఆంతర్యాన్ని అర్థం చేసుకునే కనీస పరిజ్ఞానం కొరవడింది. ఎన్నో తరాలుగా వృత్తిని నమ్ముకున్న కళాకారులు ఇళ్ళ వద్దకు వచ్చి, రామాయణం, భాగవతం, జీవిత పరమార్థం చెబుతుంటే వినే పరిస్థితిలో లేని బీజీ పర్సనాలిటీలు అనేకం. వారి కళను కొంత సొమ్ము ఇచ్చి అభినందించలేని దరిద్రపు జీవితం గడుపుతున్న వారెందరో.. మన కళ్ళ ముందు ఉండటం మన దౌర్భాగ్యం. పల్లెల్లో పండగ పూట కళాకారుల ప్రదర్శనలు లేక పల్లె కన్నీరు పెడుతోంది. సంస్కృతి, సంప్రదాయాలు బ్రతికితే వృత్తులు బ్రతుకుతాయి. వృత్తులు బ్రతికితే ఆ వృత్తిని నమ్ముకున్న వారు బ్రతుకుతారు. విదేశీ మోజులో.. ఆధునికత పేరుతో వృత్తులు వ్యాపారాలయ్యాయి. కార్పొరేట్ కబంధ హస్తాలలో కళాకారులు, చిరు వ్యాపారులు జీవనపోరాటంలో ఓడిపోతున్నారు. ఇప్పటికైనా ఎంతో విలువైన సంస్కృతి, సంప్రదాయాలను.. తరాలుగా వస్తున్న ఆచారాలను పాఠాలుగా విద్యార్థులకు బోధించాలి. వృత్తిని నమ్ముకున్న కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. భావి తరాలకు భవిష్యత్తును ఇవ్వడం మన బాధ్యతగా భావించాలి. మన సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలి. మన అచ్చమైన తెలుగు పండుగ సంక్రాంతి ని ఇంటిల్లపాది కలిసి ఆనందంగా జరుపుకోవాలి.

## మామిడి తోరణాలతో..

హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల దీవెనలు, ఇంటి ముందు అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు.. భోగి మంటలు, వేకువజామునే జంగమదేవరల జేగంటలు, ఢమరుక నాదాలూ.. పిట్టలదొరల బడాయి మాటలు.. కొత్త బట్టలు, చిన్నారుల సందడి, కొత్త అల్లుళ్ళు, బావమరదళ్ల సరదాలు, బంధువులందరూ ఒక్కటిగా చేరి తీపి కబుర్లు చెప్పుకుంటూ చేసుకునే రకరకాల పిండివంటలు, పాడిపంటలతో రైతుల ఆనందాలు, తెలుగు లోగిళ్లలో కొత్త వెలుగులు నింపే సంక్రాంతి వైభవం ఇది. తెలుగువారికి ఈ పండుగ ఒక వరం. ఆభరణం.

**మీ ఇల్లు ఆనంద నిలయమై సుఖసంతోషాలతో ఉండాలని.. ఈ మకర సంక్రాంతి మీ ఇంట కొత్త కాంతులను వెదజల్లాలని.. మీ జీవితం అద్భుతంగా ఉండాలని కోరుకుంటూ సంక్రాంతి శుభాకాంక్షలు..**

ప్రపంచీకరణ ముసుగులో ప్రపంచం ఒక కుగ్రామం అయిపోయింది. కానీ..నిజమైన పల్లె తన ఆచ్ఛాదన కోల్పోయి పరాయీకరణ చెందుతోంది. "ఏవి తల్లి నిరుడు కురిసిన హిమ సమూహాలు" అన్నట్లు ఎక్కడో పల్లె తప్పిపోతోంది.. వెతికితే... కాంది శీకురాలై పోతోందని తెలుస్తోంది. ప్రపంచాన్ని జల్లెడ పెట్టి వెతికినా, నాటి పల్లె పడుచుతనం...స్వచ్ఛమైన నవ్వు...కల్మషం లేని జానపద కళా రూపాలు మచ్చుకైనా కానరాకుండా అయిపోయాయి. చివరికి పల్లె మాయమైంది. వృత్తి కళాకారులు కంట నీరు.. కళ్ళు చకోర







పక్షిలా ఎదురుచూస్తున్నాయి. కళామతల్లి ...బిక్కచచ్చిపోతోంది. సంస్కృతి, సంప్రదాయాల్లోంచి...పనీ పాట లోంచి పుట్టిన సహజ సిద్ధమైన కళారూపాలు దిక్కుతోచక బిక్కచచ్చిపోతున్నాయి. తెరవెనుక నుంచి ముందుకురాని తోలు బొమ్మలాటలు స్వతంత్రాన్ని ఇచ్చి తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయాయి. జాతరలో డప్పులు... తప్పెటగుళ్ళు కొయ్యబొమ్మల కొలువుతీరాయి. రామకోవెల్లో చక్కభజన డీజే సౌండ్స్ మధ్య బిక్కచచ్చిపోయింది. పండుగకి ముందే రావలసిన శకుని పక్షికే శకునం బాగులేక పల్లె నుంచి పారిపోయింది. కోలాటం కాస్త విన్పిస్తున్నా.. రాను రాను కళాఖండం జాబితా నుంచి బిరబిరా జారిపోతోంది. హరిదాసులు అక్షయ పాత్రలో ముక్కిపోయిన బియ్యంలో రాళ్ళు ..పురుగులు పట్టడంతో...పాత్ర కిలమెక్కింది. రంగవల్లులు ఫ్యాషన్ ఫంక్షన్ల దగ్గరకు వచ్చాయి. వృత్తి రీత్యా వచ్చిన కళారూపాలకు కూడు బోర్లించిన ఊకుడులా ..కుండలు డింకీలు కొడుతున్నాయి. పల్లె పరాయి పంచెన చేరేందుకు ప్యాసింజర్ రైలు ఎక్కుతోంది. పనీ పాటలో..పని కోసం వెళ్ళిన పల్లె....పల్లె వదిలిన... పాట అనాథ అయిపోయింది. సంస్కృతి..సంప్రదాయాల మధ్య మిడ్‌నెట్ మసాలాలు నెట్ డాన్స్‌లో మునిగిపోతుంటే సంప్రదాయ కళలు కళ తప్పుతున్నాయి. రాజు కట్టిన కోట.. రాణిమెట్టితోట భూతాలు గెంతుతున్నాయి. అక్కడ బొమికలే మిగులుతున్నాయి. పోషణ రాజుల నుంచి మంత్రులకు వచ్చాక... జానపద కళా రూపాలు.. జావగారిపోయి.. నేడు చరిత్రలో చిరిగిన పేజీల్లా కనీ కన్పించక చతికిల పడ్డాయి. ప్రతీ ఏటా పండగ..పబ్బంలో కళాయాతర కన్పించన చోట...నేడు యాతన కన్పిస్తోంది. పాలకులు పోషించవలసిన కళని.. పలకరించే నాథుడు కరవై.. కటకటలాడుతోంది. నట్టేట ఉండవలసిన కళా రూపాలు.. నెట్‌లో వెతికినా మసకబారిపోతున్నాయి. మనిషి మృగ్యమై విలువలు విస్తుపోయి.. డూడూ బసవన్నలు పెద్దల చెంతన తలలాడిస్తున్నాయి. సంక్రాతి శోభ ప్రకటనల చాటున పల్లెను చూసి పుసుక్కున నవ్వుతోంది

మేడవరపు రంగనాయకులు
వ్యవస్థాపక అధ్యక్షులు
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
9866444489,
7036602022





## టాప్‌లోకి దూసుకెళ్లిన

# విరాట్ కోహ్లీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్? ప్లేస్?కు చేరుకున్నాడు. ప్రస్తుతం విరాట్ 785 రేటింగ్స్?తో నెం.1 ర్యాంక్?లో ఉన్నాడు. గత నాలుగేళ్లలో వన్డే ర్యాంకింగ్స్?లో నెం.1 పొజిషన్?కు చేరుకోవడం విరాట్?కు ఇదే తొలిసారి. అతడు చివరిసారిగా 2021 జులైలో వన్డేల్లో నెం1 ర్యాంక్? సాధించాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 784 రేటింగ్స్‌తో రెండు స్థానంలో ఉన్నాడు. టాప్?లో విరాట్‌కు, డారిల్ మిచెల్?కు ఒకే రేటింగ్ పాయింట్ తేడా ఉండడం గమనార్హం. ఇక స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ టాప్ నుంచి మూడో ప్లేస్‌కు పడిపోయాడు. గత కొన్నిరోజులుగా వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ టాప్‌లో ఉన్నాడు. అయితే రీసెంట్‌గా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో రోహిత్ స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. అదే సమయంలో విరాట్ గత ఐదు వన్డే మ్యాచ్‌ల్లో 50ం స్కోర్లు సాధించాడు. దీంతో కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకోగా, రోహిత్? రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 775 రేటింగ్స్?తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. BCCI Pగతేడాది సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ అత్యుత్తం ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విరాట్ రెండు సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సహా 303 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. అంతకుముందు ఆస్ట్రేలియా సిరీస్‌లో మూడో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుతం కివీసతో జరుగుతున్న సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో విరాట్ 93 పరుగులతో రాణించాడు. తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. అలా విరాట్ ఆడిన ఆఖరి 5 వన్డేల్లో అన్నింట్లోనూ 50ం స్కోర్లు చేశాడు.బౌలింగ్ విభాగానికి వస్తే, టాప్ 5 స్థానాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టాప్?లోనే ఉన్నాడు. అతడు 710 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో ఉండగా, ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (670 రేటింగ్స్) రెండో ప్లేస్?లో ఉన్నాడు. ఈ లిస్ట్‌లో టీమ్ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నాడు.కాగా, రాజ్‌కోట్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో విరాట్ నిరాశ పర్చాడు. ఈ మ్యాచ్‌లో 29 బంతులు ఆడిన అతడు 23 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇందులో 2 ఫోర్లు ఉన్నాయి. మరో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరాడు . అతడు 24 పరుగులు చేసి ఔటయ్యాడు.

# లీగ్ నుంచి తప్పుకున్న మొహమ్మద్ రిజ్వాన్

బిగ్ బాష్ లీగ్‌లో భాగంగా సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ హై డ్రామా చోటుచేసుకుంది. మెల్బోర్న్ తరపున ఆడుతున్న రిజ్వాన్, క్రీజులో సెట్ అయినప్పటికీ పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో ఆయన సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. రిజ్వాన్ 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ కేవలం 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం మందగించింది.ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇంకా కేవలం 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, క్రీజులో పవర్ హిట్టర్లు ఉండాలని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్‌గా పరిగణిస్తారు. ఇలా బీబీఎల్ చరిత్రలో బలవంతంగా రిటైర్డ్ అవుట్ చేయబడిన మొదటి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు.రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ 'మాస్టర్ ప్లాన్ణ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 170 పరుగులు చేసింది. లక్ష్య చేధనలో సిడ్నీ థండర్ డీఎల్ఎస్ పద్ధతిలో విజయం సాధించింది. మొహమ్మద్ రిజ్వాన్ ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఆయన కేవలం 167 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన ఓవరాల్ స్ట్రైక్ రేట్ 101 గా ఉండటం టీ20 ఫార్మాట్‌లో ఆందోళన కలిగించే అంశం. ఈ అవమానకర ఉదంతంతో పాకిస్థాన్ సెలెక్టర్లు రిజ్వాన్‌ను రాబోయే టీ20 వరల్డ్ కప్ జట్టులోకి తీసుకోవడంపై నీలినీడలు కమ్ముకున్నాయి.ఆధునిక టీ20 క్రికెట్‌లో స్ట్రైక్ రేట్ అనేది ప్రాణవాయువు వంటిది. ఎంతటి స్టార్ ప్లేయర్ అయినా వేగంగా ఆడకపోతే జట్టు నుంచి పక్కకు తప్పుకోవాల్సిందేనని రిజ్వాన్ ఉదంతం మరోసారి నిరూపించింది.

# రెండో వన్డేలో టీమిండియా ఓటమి

**కేఎల్ రాహుల్ సెంచరీ వృథ**

**రెండో వన్డేలో భారత్‌పై 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం**

**అద్భుత సెంచరీతో కివీస్‌ను గెలిపించిన డారిల్ మిచెల్ (131)**

**టీమిండియా తరఫున కేఎల్ రాహుల్ (112) శతకం వృథ**

**విఫలమైన రోహిత్, కోహ్లీ..**

**రాణించిన శుభ్‌మన్ గిల్ (56)**

**బౌలింగ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు**






న్యూజిలాండ్ తో జరిగిన రెండో వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. డారిల్ మిచెల్ (117 బంతుల్లో 131 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగడంతో, టీమిండియా నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ సునాయాసంగా ఛేదించింది. కివీస్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. భారత జట్టులో కేఎల్ రాహుల్ (112 నాటౌట్) అజేయ సెంచరీ వృథ అయింది. రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కేఎల్ రాహుల్ శతకం, శుభ్‌మన్ గిల్ (56) అర్ధశతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), శ్రేయస్ అయ్యర్ (8) వంటి కీలక బ్యాటర్లు విఫలం కావడంతో భారీ స్కోరు సాధ్యం కాలేదు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 285 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్, 46 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్, విల్ యంగ్ (87)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 162 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ నుంచి లాగేసుకున్నారు. విల్ యంగ్ ఔటయ్యాక, గ్లెన్ ఫిలిప్స్ (32 నాటౌట్)తో కలిసి మిచెల్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్ లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కివీస్ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమం అయింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇందోర్ లో జరగనుంది.

## ప్రపంచకప్ స్క్వాడ్‌లో రోహిత్, కోహ్లీలకు చోటు



భారత క్రికెట్ అభిమానులకు ఒక తీపి కబురు. టీమ్ ఇండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై గత కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు పాల్గొంటారా లేదా అన్న సందేహాలపై టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న రెండో వన్డేకు ముందు ఆయన మీడియాలో మాట్లాడుతూ, రోహిత్-కోహ్లీలు 2027 వరల్డ్ కప్ రోడ్‌మ్యాప్‌లో అంతర్భాగమని స్పష్టం చేశారు. "రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు కేవలం ఆటగాళ్లు మాత్రమే కాదు, వారు టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాల్లో కీలక భాగస్వాములు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో వారు నిరంతరం వన్డే ఫార్మాట్ గురించి, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో జరిగే 2027 వరల్డ్ కప్ ప్రణాళికల గురించి చర్చిస్తున్నారు" అని కోటక్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. గంభీర్ ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న వార్తల్లో నిజం లేదని, వారు అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ అని, జట్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలో వారికి బాగా తెలుసని ఆయన పేర్కొన్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరగనుంది. దక్షిణాఫ్రికాలోని బౌన్సీ పిచ్‌లపై యువ ఆటగాళ్లు తడబడే అవకాశం ఉంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కోహ్లీ, రోహిత్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉంటేనే భారత్ విజయావకాశాలు మెరుగుపడతాయని మాజీ క్రికెటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వారు ఆడుతున్న తీరు, చూపిస్తున్న ఫిట్‌నెస్ ప్రకారం 2027 వరకు వారు ఆడటం ఏమాత్రం కష్టం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం భీకరమైన ఫామ్‌లో ఉన్నాడు. గత ఐదు వన్డేల్లో వరుసగా 50 కంటే ఎక్కువ పరుగులు చేసి ప్రపంచ నంబర్ 1 ర్యాంకింగ్ సొంతం చేసుకున్నాడు. అటు రోహిత్ శర్మ కూడా వన్డేల్లో తన దూకుడును కొనసాగిస్తున్నాడు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత, వారిద్దరి పూర్తి ఫోకస్ ఇప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌పైనే ఉంది. ఇది జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ అని కోచ్ అభిప్రాయపడ్డారు.

## ఆయుష్ బదోని ఎంపిక సరికాదు

**మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్**



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయంతో దూరమవ్వగా.. అతని స్థానంలో ఢిల్లీ ప్లేయర్ ఆయుష్ బదోనిని సెలెక్టర్లు ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికను మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తప్పుబట్టాడు. ఇది సరైన ఎంపిక కాదని విమర్శించాడు. దేశవాళీ క్రికెట్‌లో అతని ప్రదర్శన మెరుగ్గా లేకున్నా..ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించాడు.'ఒకరి విషయంలో పరుగులు చేస్తేనే జట్టులో చోటు అంటున్నారు. మరొకరి విషయంలో మాత్రం పరుగులు చేయకున్నా జట్టులోకి తీసుకుంటున్నారు. ఐపీఎల్‌లో బదోని ఆడిన అద్భుత ఇన్నింగ్స్ ఏదైనా ఉంటే చెప్పండి. ఐపీఎల్ ప్రదర్శనను వన్డేలకు ప్రామాణికంగా తీసుకోకూడదు. అతను కేవలం మూడు వికెట్లు తీసుకున్నంత మాత్రాన ఆల్‌రౌండర్ అవుతాడా? అతను ఐపీఎల్‌లో ఎన్నిసార్లు బౌలింగ్ చేశాడు. అతను బౌలింగ్ చేయడం ఎవరైనా చూశారా?'అని క్రిష్ శ్రీకాంత్ సెలెక్టర్లను ప్రశ్నించాడు.రుతురాజ్ గైక్వాడ్ ఏం పాపం చేశాడని కూడా శ్రీకాంత్ నిలదీసాడు. 'గత వన్డే సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ చేశాడు. కానీ అతన్ని ఎంపిక చేయలేదు. అతను ఏం తప్పు చేశాడు? ఒక వేళ ఆల్‌రౌండర్ అవసరమైతే అక్షర్ పటేల్‌ను తీసుకోవాల్సింది.'అని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో ఆయుష్ బదోని కనీసం 1000 పరుగులు కూడా చేయలేదని, అతని ఖాతాలో వికెట్లు కూడా ఎక్కువగా లేవని ఆకాశ్ చోప్రా విమర్శించాడు. నితీష్ కుమార్ రెడ్డిని జట్టులోకి తీసుకోని అవకాశాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాడు. అతన్ని చివర్లో బ్యాటింగ్‌కు పంపించడం, కొన్ని ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయించడం సరికాదన్నాడు. అయితే ఈ విమర్శలకు టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సమాధానమిచ్చాడు. భారత్-ఏ తరఫున మెరుగైన ప్రదర్శన చేయడంతోనే బదోనిని తీసుకున్నామని స్పష్టం చేశాడు. ఐపీఎల్‌లోనూ అతను మెరుగ్గా రాణించాడని గుర్తు చేశాడు. బదోని జట్టులోకి వచ్చిన న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో అతనికి అవకాశం దక్కలేదు. సుందర్ స్థానంలో నితీష్ రెడ్డిని ఆడించారు.

## సరికొత్త రికార్డ్ సృష్టించిన హర్మన్‌ప్రీత్

మహిళల ప్రీమియర్ లీగ్?లో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. తాజాగా గుజరాత్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్?లో 193 పరుగుల భారీ ఛేదనలో అదిరే ఇన్నింగ్స్ తో హర్మన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకుంది. 43 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టును గెలిపించింది. ఈ క్రమంలోనే డబ్ల్యూపీఎల్?లో హర్మన్ అరుదైన రికార్డు తన పేరిట లిఖించుకుంది. ఆ రికార్డు ఏంటంటే హర్మన్‌ప్రీత్ ఈ ఎడిషన్‌లో సూపర్ ఫామ్‌లో దూసుకుపోతోంది. దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఇప్పటికే అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్?గా నిలిచిన హర్మన్, తాజాగా మరో ఘనత సాధించింది. గుజరాత్‌తో మ్యాచ్‌లో సూపర్ ఇన్నింగ్స్‌తో ఆమె డబ్ల్యూపీఎల్‌లో 1000 పరుగులు మైలురాయి అందుకుంది. 55 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హర్మన్ ఈ మైలురాయి అందుకుంది. దీంతో ఈ టోర్నీ హిస్టరీలో ఈ ఘనత సాధించిన భారత తొలి క్రికెటర్‌గా హర్మన్ రికార్డులకెక్కింది.ఇక తాజా మ్యాచ్‌లో హర్మన్ 71 పరుగులతో రాణించింది. ఆమె ఇప్పటిదాకా 30 మ్యాచ్‌ల్లో 46.18 సగటుతో 1016 పరుగులు చేసింది. ఇందులో 10 హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. 95 పరుగులు అత్యధిక స్కోర్‌గా ఉంది. ముంబయి జట్టుకే చెందిన నాట్ సీవర్‌బ్రంట్ 1101 పరుగులతో ఈ లిస్ట్‌లో టాప్‌లో ఉంది.కాగా, ఈ సీజన్‌లో అత్యధిక పరుగుల నమోదు చేసిన బ్యాటర్‌గానూ హర్మన్ టాప్?లో కొనసాగుతోంది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌ల్లో ఆమె 165.00 యావరేజ్‌తో 165 పరుగులు చేసింది. ఆర్సీబీతో ఆడిన తొలి మ్యాచ్‌లో 20 పరుగులకే వెనుదిరిగిన ఆమె, తర్వాత వరుసగా 74 పరుగులు (దిల్లీ క్యాపిటల్స్), 71 పరుగులు (గుజరాత్) రెండు భారీ హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. ఈ లిస్ట్?లో తర్వాత స్థానాల్లో సోఫీ డివైన్ (141), అష్లీ గార్డ్‌నర్ (134) ఉన్నారు. ఇప్పటిదాకా ప్రస్తుత ఎడిషన్‌లో ఆరు మ్యాచ్?లు ముగిశాయి.ఇక మ్యాచ్‌విషయానికొస్తే, గుజరాత్?పై ముంబయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 193 భారీ ఛేదనలో హర్మన్‌తోపాటు అమన్‌జోత్ కౌర్ (40 పరుగులు, 26 బంతుల్లో), నికోల కెరీ (38 పరుగులు, 23 బంతుల్లో) రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 192-5 భారీ స్కోర్ చేసింది. బెత్ మూనీ (33), కనికా అహుజా (35), జార్జ్ వేర్?హామ్ (43), భార్తి ఫుల్మాలి (36) ఆకట్టుకున్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# హాస్యం చుట్టూ తిరిగిన కథ అనగనగా ఒకరాజు

## సంక్రాంతికి నవ్వులు పండించిన నవీన్ పోలిశెట్టి



నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజుఅంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గ్టటెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక ప్లలెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్ధంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్ధం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉ ంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీ-యార్ధంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.

## నేనెందుకు క్షమాపణలు చెప్పాలి: మైలకా అరోరా

ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.

# మన శంకరవరప్రసాద్ కలెక్షన్ల దూకుడు

### రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక.. కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న దర్శకుడు

ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజూ కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తంచేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' విజయం సాధించడంతో చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించింది. 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు అనిల్‌రావిపూడి తెలిపారు. ఛాలెంజ్‌గా తీసుకుని సినిమాను పూర్తి చేసినట్లు చెప్పారు. ఇక తన అంచనా ప్రకారం ఈ చిత్రానికి రూ.400 నుంచి 500 కోట్లు వస్తాయని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో చిత్రబృందం తాజాగా సెలబ్రేషన్స్ చేసుకుంది. దర్శకనిర్మాతలతో పాటు చిరంజీవి, వెంకటేశ్, రామ్ చరణ్ ఆ సెలబ్రేషన్స్‌లో పాల్గొని కేక్ కట్ సందడి చేశారు.





# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ

### తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.



# తుంబాడ్ దర్శకుడి మరో మూవీ మయసభ

తుంబాడ్' వంటి కల్ట్ క్లాసిక్‌ను అందించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే నుంచి మరో సంచలనం రాబోతోంది. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'మయసభ'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. 'తుంబాడ్' తరహాలోనే ఈ సినిమాలో కూడా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తున్న జావేద్ జాఫ్రీ గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒక కొత్త అవతారంలో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. వీణా జమ్కర్, దీపక్ దామ్లే, మొహమ్మద్ సమద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861